thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 57 కరీంనగర్ గురువారం, 8 మే 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## టెలికమ్యూనికేషన్స్‌లో దూసుకెళ్తున్న భారత్

న్యూఢిల్లీ : ప్రతిభ, టెక్నాలజీతో టెలికమ్యూనికేషన్స్‌లో ప్రపంచస్థాయిలో భారత్ దూసుకెళ్తోందని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధిశాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. ఢిల్లీలోని తాజ్‌ప్యాలెసలో జరిగిన 'భారత్ టెలికాం-2025' సదస్సులో ఆయన మాట్లాడారు. 850 మిలియన్లకుపైగా ఇంటర్నెట్ వినియోగదారులతో భారతదేశం గణనీయమైన మైలురాళ్లను సాధించిందన్నారు. ప్రపంచంలోనే అత్యంత చౌక రేట్లతో డేటాను భారత్ అందిస్తోందని తెలిపారు. టెలికాం పరికరాల ఎగుమతి ఇటీవలి సంవత్సరాలలో నాలుగు రెట్లు పెరిగి మొత్తం విలువ రూ.1.49 లక్షల కోట్లకు చేరుకుందన్నారు. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం, సొల్యూషన్స్ ఆధారంగా 5జీ ఎకోసిస్టమ్‌ను రూపొందించినట్లు తెలిపారు.

# పాక్ ప్రతీకార దాడులు

# దేనికైనా సిద్ధం

ఆపరేషన్ సింధూర్ కీలక మలుపు తీసుకుంటోంది. దాదాపు అయిదు దశాబ్దాల తరువాత పాక్ భూ భాగంలోని ఉగ్రవాద శిబిరాల పైన భారత సైన్యం విరుచుకు పడింది. పక్కా ప్లాన్ తో అనుకున్న ముహూర్తానికి భారత్ వైమానిక దళం ఉగ్రవాద క్యాంపుల పైన క్షిపణులతో దాడి చేసింది. పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులను మట్టు బెట్టింది. ప్రధాని మోదీ స్వయంగా ఈ ఆపరేషన్ సింధూర్ ను పర్యవేక్షించారు. భారత్ సైన్యానికి దేశ వ్యాప్తంగా మద్దతు లభిస్తోంది. ఇదే సమయంలో పాక్ కదలికల పైన భారత్ అప్రమత్తం అవుతోంది. కొత్త ప్రణాళికలతో సిద్ధం అవుతోంది. భారత్ అర్ధరాత్రి పాక్ తో సహా పీఓకేలో ఉన్న ఉగ్రవాద శిబిరాలను నేల మట్టం చేసింది. ముంబై దాడికి కేంద్రంగా నిలిచిన జైషే ప్రధాన కార్యాలయం మొదలు పీఓకేలో తిష్ట వేసిన ఉగ్రవాదుల శిబిరాల పైన విరుచుకు పడింది. మోస్ట్ వాంటెడ్ లిస్టులో ఉన్న ముఖ్యమైన ఉగ్రవాదులతో సహా పెద్ద సంఖ్యలో కమాండర్లను మట్టు బెట్టారు. ఇక, ఇప్పుడు పాకిస్థాన్ ఏం చేయబోతుందనేది భారత్ నిశితంగా పరిశీలిస్తోంది. ఇప్పటి వరకు మాటలకే పాక్ పరిమితం అయింది. భారత్ పైన ప్రతీకార చర్యలు తప్పవంటూ పాక్ మంత్రులు చెప్పుకొస్తున్నారు. అయితే, ఒక్క విమానం కూడా ఇప్పటికీ ఎగరలేదు. పాక్ నుంచి ఎలాంటి ప్రతిస్పందన వచ్చినా తిప్పి కొట్టటానికి భారత్ సర్వం సిద్ధంగా ఉంది. ఇందు కోసం ఆపరేష్ సింధూర్ స్వయంగా మానిటర్ చేస్తున్న ప్రధాని కీలక మంత్రాంగం నిర్వహించారు. ప్రతీ క్షణం అప్డేట్స్ పైన సమీక్షిస్తున్నారు. పాకిస్తాన్ ఎలాంటి ప్రతీకార చర్యలకు సిద్ధమైనా వెంటనే తిప్పి కొట్టేలా కార్యాచరణ సిద్ధం అవుతోంది. అటు దాడుల గురించి భారత్ విదేశాంగ - ఆర్మీ అధికారులు వెల్లడించారు. పాక్ లోని ఉగ్రవాద శిబిరాలనే టార్గెట్ చేసినట్లు వెల్లడించారు. కాగా, పాక్ ప్రతీకార చర్యలకు సిద్ధం అయితే, వెంటనే పీఓకే లక్ష్యంగా భారత్ సైన్యం పూర్తి స్థాయి చర్యలకు సిద్ధం అయ్యే అవకాశం ఉంది. పీఓకే ను స్వాధీనం చేసుకోవటమే లక్ష్యంగా అడుగులు ఖాయమని తెలుస్తోంది. పాకిస్తాన్ లో మాత్రం ఆ రకమైన స్పందన లేదని నిపుణులు భావిస్తున్నారు. పాక్ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రతీ కార చర్యలకు దిగితే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. తాము ఉగ్రవాద శిబిరాల పైనే దాడి చేసామని భారత్ స్పష్టం చేసింది. అటు పాక్ ఖచ్చితంగా దీనికి ప్రతిగా స్పందిస్తామని చెబుతున్న వేళ.. రానున్న 24 గంటల్లో చోటు చేసుకునే పరిణామాల పైన ఉత్కంఠ కొనసాగుతోంది.




## ఆపరేషన్ సింధూర్ 2, ఈ సారి గురి అక్కడే..!!

**ఆపరేషన్ సిందూర్ .. ప్రధాని మోడీ అత్యంత కీలక నిర్ణయం..** పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్.. పాకిస్థాన్ తో అన్ని రకాల సంబంధాలను తెగతెంపులు చేసుకుంది. ఇప్పటికే సింధు నదీ జలాల ఒప్పందంతో పాటు పాక్ తో వ్యాపారపరమైన అన్ని రకాల సంబంధాలను రద్దు చేసుకుంది.మరోవైపు పాక్ నటీనటులకు సంబంధించిన చిత్రాలను మన దేశంలో పూర్తిగా నిషేధం విధించిన సంగతి తెలిసిందే కదా. తాజాగా పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ దేశంలోని త్రివిధ దళాలు సమన్వయంతో పనిచేసి పాకిస్థాన్ తో పాటు ఆక్రమిత జమ్మూ కశ్మీర్ లోని 9 పైగా ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. ఈ దాడిలో ఇండియా మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ మసూద్ అజహర్ తో పాటు అతని కుటుంబ సభ్యులు 14 మందికి పైగా మరణించినట్లు తెలుస్తుంది. ఇంకోవైపు లష్కర్ ఏ తోయిబా ఛీఫ్ హాఫీజ్ సయ్యద్ తో పాటు దాదాపు 90 మందికి పైగా ఎయిర్ స్ట్రైక్ లో మరణించినట్లు సమాచారం. భారత్- పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని మంత్రి.. ఇప్పటికే షెడ్యూల్ చేసుకున్న విదేశీ పర్యటనలు రద్దు చేసుకున్నారు. ఈ నెలలోనే ప్రధాని మోడీ .. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యంగా యూరప్ పర్యటనలో భాగంగా క్రొయేషియా, నార్వే, నెదర్లాండ్స్ లో పర్యటించాల్సి ఉంది. కానీ పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత మృతి చెందిన వారి శ్రాద్ధ కర్మల తర్వాత భారత్ ఈ ప్రతీకార చర్యలకు పాల్పడినట్టు చెబుతున్నారు. మరోవైపు రష్యా దేశం నిర్వహించిన విక్టరీ డే వేడుకల్లో మోడీ పాల్గొనడం లేదని క్రెమ్లిన్ ప్రకటించిన సంగతి తెలిసిందే కదా.

పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ ప్రాంతంపై ఇండియా సైనిక దాడిపై స్పందించింది ఐక్యరాజ్య సమితి. ఇండియా, పాకిస్తాన్ సైనిక దాడులను.. యుద్ధాన్ని ప్రపంచం భరించలేదని.. ఇది చాలా ప్రమాదక రం అంటూ ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ వెల్లడించారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని ఉగ్రవాదుల శిబిరాలపై ఇండియా సైనిక దాడి వల్ల.. రెండు దేశాల మధ్య సైనిక యుద్ధ వాతావరణం నెలకొందని.. వెంటనే ఈ ఉద్రిక్తతలు తగ్గించాల్సిన అవసరం రెండు దేశాలకు ఉందంటూ చెప్పుకొచ్చారు ఆంటోనియో. ఇండియా, పాకిస్తాన్ దేశాలు సంయమనం పాటించాలని.. ఈ రెండు దేశాలు సైనిక యుద్ధానికి దిగితే అది ప్రపంచానికే మంచిది కాదని.. ప్రపంచం భరించలేదంటూ స్పష్టం చేశారాయన. ఆపరేషన్ సిందూర్' పేరుతో టెర్రరిస్టుల స్థావరాలపై భారత సైన్యం మెరుపు దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ మెరుపు దాడుల్లో 100 మందికి పైగా పాక్ ఉగ్రవాదులను భారత సైన్యం హతమార్చింది. మంగళవారం అర్ధరాత్రి తర్వాత 1.44 గంటలకు పీవోకేతోపాటు పాక్‌లోని 9 టెర్రరిస్ట్ స్థావరాలపై ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ మిసైళ్లతో అటాక్ చేసింది. టెర్రరిస్టుల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసింది. పాక్ ఉగ్ర స్థావరాలపై భారత్ చేసిన వైమానిక దాడులపై పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఘాటుగా




స్పందించారు. భారత్‌ది పిరికిపంద చర్య అని, పాక్ పౌరులు 8 మంది చనిపోయారని ఆయన ప్రకటించారు. ఇండియాలో తాము ఎప్పుడు.. ఎక్కడ ఏం చేస్తామో చెప్పమని -పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ చెప్పడం గమనార్హం. పాకిస్తాన్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ ఈ దాడులను యుద్ధ చర్యగా పేర్కొంటూ ఖండించారు. పంజాబ్ ప్రావిన్స్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. అంతర్జాతీయ, దేశీయ విమానాలను నిలిపివేశారు. ఖచ్చితంగా ఇండియా దాడులకు పాకిస్తాన్ ఖచ్చితంగా బదులు తీర్చుకుంటామని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అన్నారు.




న్యూఢిల్లీ: ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత్ ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీ సంయుక్తంగా మెరుపు దాడులు చేసింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పాటూ పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేశాయి. బహావల్‌పూర్, కోట్లీ, ముజఫరాబాద్‌పై క్షిపణి దాడులు జరిగాయి. ఈ దాడుల్లో సుమారు 90 మంది ఉగ్రవాదులు మృతి చెందినట్లు సమాచారం. మరికొంతమంది తీవ్రంగా గాయపడినట్లు తెలియవచ్చింది. ఈ నేపథ్యంలో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో పాకిస్తాన్ ఎమర్జెనీ ప్రకిటించింది. ఎమర్జెన్సీలో ఏమేమి చేయాలో కార్యక్రమాలను చేపడుతోంది. కొద్ది సేపటి క్రితమే ఎమర్జెన్సీని ప్రకటించింది.

**సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం..** అలాగే సరిహద్దు ప్రాంతాల్లో భారత్ సైనికులపై పాక్ సేనలు తిరగబడుతున్నాయి. ఈ ఘటనలో ఇరువైపులా ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం. రాత్రి జరిగిన ఆపరేషన్ సింధూర్‌కు ప్రతికారంగా పాకిస్తాన్ ఇప్పుడు స్పందిస్తోంది. సరిహద్దులో ఉద్రిక్తత నెలకొంది. కాగా భారత్ సేనలు పాకిస్తాన్‌లోని 9 ఉగ్రవాద శిబిరాల్లో దాడులు చేసి వాటిని ధ్వంసం చేశారు. అయితే పహల్గాం దాడి తర్వాత ఉగ్రవాదులను పాక్ ప్రభుత్వం వేరే శిబిరాలకు తరలించింది. మదర్సాలలో పెట్టారు. దీంతో పాకిస్తాన్ ప్రభుత్వం తమ మదర్సాలు, మసీదులు, ప్రార్థనా మందిలపై భారత్ దాడి చేసిందని పాకిస్తాన్ ప్రజలను రెచ్చగొడుతూ.. అక్కడ జరిగిన నష్టాన్ని ప్రపంచం ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది.

**మెడికల్ ఎమర్జెన్సీ...** ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్రస్థావరాలపై ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ కలిసి మెరుపు దాడులు చేశాయి. ఈ దాడుల్లో సుమారు 90 మందికిపైగా ఉగ్రవాదులు హతమైనట్లు సమాచారం. భారత్ దాడితో పాకిస్థాన్‌లో అలజడి రేగింది. లాహోర్, సియాల్ కోట్ ఎయిర్ పోర్టులను మూసివేసింది. ఇస్లామాబాద్, రావల్పిండిలో మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించింది. పాక్ అధికారులు వైద్య సిబ్బందికి సెలవులు రద్దు చేసి.. వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేశారు.

**హై అలర్ట్..** పాకిస్థాన్ లోని ప్రధాన ఎయిర్ పోర్టుల్లోనూ ఎమర్జెన్సీ ప్రకటించారు. ఇస్లామాబాద్, కరాచీ, లాహోర్, ముల్తాన్, స్కార్డు, ఫైసలాబాద్, పెషావర్ ఎయిర్ పోర్టుల్లో పాక్ ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. ఇస్లామాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును మూసివేయడంతో అక్కడకు చేరాల్సిన ఫ్లైట్స్ ను కరాచీకి మళ్లిస్తున్నారు. పాక్ గగనతలాన్ని పూర్తిగా మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.




భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ పై ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యింది. పహల్గాంలో దాడికి ప్రతీకారంగా.. పాక్ ఆక్రమిత్ కాశ్మీర్ పై ఇండియా సైనిక దాడికి దిగింది. పాకిస్తాన్ కేంద్రంగా.. పాకిస్తాన్ సాయంతో.. పాక్ నిధులతో నడుస్తున్న 9 ఉగ్రస్థావరాలను ఇండియా ధ్వంసం చేసింది. 25 నిమిషాలు భారత యుద్ధ విమానాలు మిస్సైల్స్, బాంబులతో.. ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన సంగతి తెలిసింది. ఈ క్రమంలోనే పాకిస్తాన్ స్పందించింది. భారత్ చేసింది యుద్ధ చర్య అంటూ గగ్గోలు పెడుతుంది. భారత్ పై ప్రతీకారం అంటూ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుంది. సరైన సమయంలో సమాధానం ఇస్తామంటూ పాక్ ప్రగల్భాలు పలుకుతున్నది. ఈ క్రమంలోనే భారత్ ఆపరేషన్ సింధూర్ పై అమెరికా స్పందించింది. సైనిక చర్యను త్వరగా ముగించాలని భారత్ కు సూచిస్తూనే.. పాకిస్తాన్ కు గడ్డి పెట్టింది. యుద్ధానికి దిగొద్దు అంటూ పాకిస్తాన్ కు వార్నింగ్ ఇచ్చింది అమెరికా. నీకు అంత సీన్ లేదు.. మూసుకుని కూర్చో అంటూ పాకిస్తాన్ దేశానికి అమెరికా స్ట్రాంగ్ మెసేజ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇది ఉగ్రవాదంపై ఇండియా చేస్తున్న దాడి అంటూ పాకిస్తాన్ కు చెబుతూనే.. యుద్ధం చేసే సత్తా మీ దేశానికి లేదని.. యుద్ధం అంటూ పెద్ద పెద్ద మాటలు అన్నీ కట్టిపెట్టు అంటూ కొరఢాతో కొట్టినట్లు పాకిస్తాన్ దేశానికి ట్రంప్ స్పష్టమైన సంకేతాలు పంపినట్లు తెలుస్తోంది. దీనికి ముందు అజిత్ దోబల్ కూడా అమెరికా కీలక ప్రతినిధులకు దాడి గురించిన పూర్తి సమాచారాన్ని పంచుకున్న సంగతి తెలిసిందే. అన్ని చూస్తూ ఉండు.. యుద్ధం ఆలోచన చేయకు.. యుద్ధం చేసే స్థాయి.. సత్తా.. దమ్ము లేదు అంటూ పాకిస్తాన్ దేశానికి అమెరికా గట్టిగానే చెప్పుకొచ్చింది. ఇండియాతో యుద్ధం చేస్తే పాకిస్తాన్ కు మద్దతు ఇచ్చేది లేదని కూడా ఖరాఖండిగా తేల్చి చెప్పింది అమెరికా. దీంతో పాకిస్తాన్ అన్నీ మూసుకుని.. తన గోడును ప్రపంచ దేశాలకు చెప్పుకుంటుంది. పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ దేశాన్ని మిగతా దేశాలు కూడా నమ్మటం లేదు.. భారత్ ఆపరేషన్ సింధూర్ కు పూర్తి మద్దతు ఇస్తూనే.. పాక్ ఉగ్రచర్యలను తప్పుబడుతున్నాయి. దీంతో ఇప్పుడు పాకిస్తాన్ ఒంటరి అయ్యింది.

# ఆపరేషన్ సిందూర్ గ్రాండ్ సక్సెస్..



శ్రీనగర్: 'ఆపరేషన్ సిందూర్' గ్రాండ్ సక్సెస్ అయింది. పహల్గాం ఉగ్రదాడికి కౌంటర్‌గా పాక్ ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేసిన మెరుపు దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. పాక్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న తొమ్మిది ఉగ్ర స్థావరాలపై భారత యుద్ధ విమానాలు మిస్సైల్స్?తో మెరుపు దాడులు చేశాయి. ఒక్క మురిద్కేలోనే 30 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. జైషే మహ్మద్, లష్కర్-ఏ-తొయిబా ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా భారత్ దాడులు చేసింది. బవహల్‌పూర్‌లోని జైషే మహ్మద్ స్థావరంపై భారత యుద్ధ విమానాలు బాంబులేశాయి. భారత సైన్యం చేసిన ఈ మెరుపు దాడుల్లో మొత్తం 100 మందికి పైగా ఉగ్రవాదులను హతమార్చి పహల్గాం ఉగ్రదాడికి భారత్ బదులు తీర్చుకుంది.

**భారత్ టార్గెట్ చేసి ధ్వంసం చేసిన ఉగ్ర స్థావరాలు ఇవే..** 9 ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసిన భారత సైన్యం సరిహద్దు నియంత్రణ రేఖ పూంఛ్- రాజౌరీకి 35 కి.మీ దూరంలో ఉ్న గుల్పూర్, పాక్ ఆక్రమిత

## యుద్ధంలో భారత్ తొలి విజయం


## 100 మందికి పైగా ఉగ్రవాదులు హతం

జమ్మూకశ్మీర్‌లోని తంగ్ధర్ సెక్టార్ లోపల 30కి.మీ పరిధిలో ఉన్న సవాయ్ లష్కరే క్యాంప్, జేఎం లాంచ్‌ప్యాడ్ బిలాల్ క్యాంప్, అంతర్జాతీయ సరిహద్దుకు 100 కి.మీ లోపు ఉన్న స్థావరాలపై టార్గెట్ చేసిన భారత్, అంతర్జాతీయ సరిహద్దుకు 100 కి.మీ దూరంలో ఉన్న బహవల్‌పూర్‌లో ఉన్న జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయం, మురిద్కే, సాంబా ఎదురుగా సరిహద్దుకు 30 కి.మీ దూరంలో ఉన్న లష్కరే క్యాంప్, సాంబా-కతువా ఎదురుగా అంతర్జాతీయ సరిహద్దుకు 8కి.మీ దూరంలో ఉన్న సర్జల్ క్యాంప్. ఇది జేఎంకు ఒక క్యాంప్,

అంతర్జాతీయ సరిహద్దుకు 15 కిలోమీటర్ల దూరంలో సియాల్‌కోట్ సమీపంలో ఉన్న హెచ్ఎం శిక్షణా శిబిరం మెహమూనా క్యాంప్, రాజౌరీకి ఎదురుగా నియంత్రణ రేఖకు 15 కి.మీ.ల దూరంలో ఉన్న జేఎం లాంచ్‌ప్యాడ్ బిలాల్ క్యాంప్, రాజౌరీకి ఎదురుగా నియంత్రణ రేఖకు 10.కి.మీ పరిధిలో ఉన్న బర్నాలా క్యాంప్.

చురకలు







చర్ల: తెలంగాణ– ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో బుధవారం ఉదయం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 22 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ మేరకు అధికార వర్గాలు వెల్లడించాయి. ఘటనా స్థలంలో కాల్పులు కొనసాగుతున్నాయి. ఈ ఆపరేషన్‌ను డీఆర్జీ, కోబ్రా, సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్, బస్తర్ ఫైటర్స్, సీఏఎఫ్ బలగాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. దీన్ని ఏడీజీ వివేకానంద సిన్హా పర్యవేక్షిస్తున్నారు. సీఆర్పీఎఫ్ ఐజీ రాకేశ్ అగర్వాల్, బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందరరాజ్ ఎప్పటికప్పుడు ఆపరేషన్‌పై ఆరా తీస్తున్నారు. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

## భారత పౌరుడిగా గర్వంగా ఉంది.. ‘ఆపరేషన్ సిందూర్’పై సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: పాక్‌లోని ఉగ్ర శిబిరాలపై మన సైన్యం చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’ పట్ల భారత పౌరుడిగా గర్వంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ పౌరులుగా అందరం ఏకతాటిగా నిలిచి ఐక్యత చాటాల్సిన సమయమిదంటూ ‘జైహింద్’ అని పేర్కొన్నారు. ఈ మేరకు ‘ఎక్స్’లో సీఎం పోస్ట్ చేశారు.

‘ఆపరేషన్ సిందూర్’ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అన్ని విభాగాలకు సీఎం దిశానిర్దేశం చేశారు. సాయంత్రం జరిగే మాక్ డ్రిల్‌ను ఆయన స్వయంగా పర్యవేక్షించనున్నారు. మరోవైపు దిల్లీలో ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సీఎం ఫోన్ చేశారు. తక్షణమే బయల్దేరి హైదరాబాద్ రావాలని సూచించారు.






## సరిహద్దుకు 100 కి.మీల లోనివే టార్గెట్.. భారత్ దాడి చేసిన 9 స్థావరాలివే..

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. పాకిస్థాన్ భూభాగంలోని ఉగ్ర స్థావరాలపై మంగళవారం అర్ధరాత్రి మెరుపు దాడులు జరిపింది. దీంతో దాయాది ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ‘ఆపరేషన్ సిందూర్ పేరుతో జరిపిన ఈ దాడుల్లో పాక్‌లోని 9 కీలక ఉగ్ర స్థావరాలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. అంతర్జాతీయ సరిహద్దుకు 100 కిలోమీటర్ల లోపు ఉన్న క్యాంపులను టార్గెట్ చేసింది. పాకిస్థాన్‌లోని 4, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 5 స్థావరాలను ధ్వంసం చేసింది. ఇందులో జైషే మహ్మద్‌కు చెందిన నాలుగు, లష్కరే తోయిబాకు చెందిన 4 క్యాంపులు ఉన్నాయి. రెండు హిజ్బుల్ ముజాహిద్దీన్ శిబిరాలు ఉన్నాయి.

**దాడులు జరిపిన స్థావరాల వివరాలు ఇలా..** బహవల్‌పూర్‌లోని మర్కజ్ సుబాన్: ఇది సరిహద్దుకు 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. జైషే మహ్మద్‌కు చెందిన ప్రధాన కార్యాలయంగా పేర్కొంటారు. మురిద్కేలోని మర్కాజ్ తోయిబా: సరిహద్దుకు 30 కిలోమీటర్ల దూరంలోని లష్కరే క్యాంపు కార్యాలయం ఇది. ఇక్కడే 26/11 ముంబయి దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు తలదాచుకున్నారని సమాచారం. సియల్‌కోట్‌లోని మెహ్‌మూనా జోయా: అంతర్జాతీయ సరిహద్దుకు 15 కి.మీ దూరంలో ఉన్న హిజ్బుల్ ముజాహిద్దీన్ శిబిరం ఇది. దీనికి చుట్టూ నివాస భవనాలు ఉన్నాయి. కోట్లిలోని మర్కాజ్ అబ్బాస్ ఉగ్ర స్థావరం: నియంత్రణ రేఖకు 35 కి.మీ. దూరంలో ఈ క్యాంప్ ఉంది. 20 ఏప్రిల్ 2023న పూంచ్‌లో జరిగిన దాడులకు, జూన్ 24న బస్సులో ప్రయాణిస్తున్న అమాయక యాత్రికులపై దాడికి ఇక్కడి ఉగ్రవాదులే కారణం అని సమాచారం. కోట్లిలోని మస్కర్ రహీల్ షహీద్: పీఓకేలో హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన స్థావరం ఇది. కొండల ప్రాంతంలో ఉండే ఈ క్యాంప్‌లో నాలుగు గదులు, బరాక్‌లు ఉన్నాయి. వీటిలో పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రి ఉన్నట్లు సమాచారం. ముజఫరాబాద్‌లోని షవాయ్ నల్లాహ్: పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తంగ్ధర్ సెక్టార్‌లో సరిహద్దుకు 30 కిలోమీటర్ల పరిధిలో షవాయ్ లష్కరే క్యాంప్ ఉంది.

ఈ ముఠాకు కీలకమైన క్యాంప్ ఇది. ఇక్కడే లష్కరే కేడర్ నియామకాలు, శిక్షణ వంటివి చేపడుతున్నారు. 2000 నుంచి ఇక్కడ కార్యకలాపాలు సాగిస్తున్నారు. బర్నాలలోని మర్కాజ్ అహ్లే హదిత్ ఉగ్ర స్థావరం: ఇది లష్కరే తోయిబా ఉగ్ర క్యాంప్. పూంఛ్–రాజౌరి–రియాసీ సెక్టార్‌లోకి లష్కరే ఉగ్రవాదులు, ఆయుధాలను పంపించేందుకు దీన్ని వినియోగిస్తున్నట్లు సమాచారం. ముజఫరాబాద్‌లోని సైద్నా బిలాల్ ఉగ్ర స్థావరం: పీఓకేలోని జైషే ప్రధాన కేంద్రాల్లో ఇది ఒకటి. ముజఫరాబాద్ రెడ్‌ఫోర్ట్‌కు ఎదురుగా ఉంటుంది. జమ్మూకశ్మీర్‌లోకి ఉగ్రవాదులను తరలించేందుకు వీలుగా దీన్ని రవాణా క్యాంప్‌గా నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎప్పుడూ 50–100 మంది ఉగ్రవాదులు ఉంటారని సమాచారం. తెహ్రా కలాన్‌లోని సర్జల్: జైషే మహ్మద్ ఉగ్ర స్థావరం ఇది. దీన్ని కూడా జమ్మూకశ్మీర్‌లోకి ఉగ్రవాదులను పంపించేందుకు ఉపయోగిస్తున్నారు.




జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడితో భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ క్రమంలో ‘ఆపరేషన్ సిందూర్’ పేరిట భారత్.. పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులకు దిగింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో మాక్‌డ్రిల్స్ నిర్వహించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పోలీసు, ఫైర్, విద్యుత్తు, ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది మాక్‌డ్రిల్స్‌లో పాల్గొన్నాయి.




పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడికి భారత్ సైన్యం ప్రతీకారం తీర్చుకుంది. ఆపరేషన్ సిందూర్‌తో దీటుగా బదులిచ్చింది. దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎక్స్ వేదికగా స్పందించారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉగ్రవాదులు పాల్పడిన దారుణ హత్యలకు భారత్ స్పందనే ఈ ఆపరేషన్ అని వ్యాఖ్యానించారు. “దేశ భద్రతా బలగాల చర్యలపై ఎంతో గర్వంగా ఉంది. పహల్గాంలో చోటుచేసుకున్న దారుణ హత్యలకు ప్రతిస్పందనే ఈ ఆపరేషన్. భారత్‌పై, దేశ ప్రజలపై జరిగే ఏ దాడికైనా తగిన ప్రతిస్పందన ఇవ్వడానికి మోదీ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించడానికి భారత్ కట్టుబడి ఉంది” అని వెల్లడించారు. భారత్ ప్రతి దాడిపై దేశంలోని రాజకీయ నాయకులు స్పందిస్తున్నారు. జై హింద్, జై ఇండియా అని పశ్చిమ్ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పోస్టు పెట్టారు. ఉగ్రదాడితో భారత్‌లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఆ ఘటనకు ప్రతిగా మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మన బలగాలు పాక్‌పై విరుచుకుపడ్డాయి. ఈ ఆపరేషన్‌కు పెట్టిన పేరుతోనే పాక్‌కు బలమైన సందేశం పంపింది.

ఈ పేరును ప్రధాని నరేంద్ర మోదీనే స్వయంగా పెట్టినట్లు కథనాలు వెలువడుతున్నాయి. మన మహిళలు భర్తలను కోల్పోయారు.. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని భారత్ ఎక్కడున్నా వదిలిపెట్టదు అనేలా మన ప్రతిస్పందన కచ్చితంగా కనిపించాలి అని ప్రధాని అధికారులకు స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోంది.




## అప్పుడు బాలాకోట్.. ఇప్పుడు ఆపరేషన్ సిందూర్.. పాక్‌ను ఏమార్చి దెబ్బకొట్టిన భారత్

పహల్గాం ఉగ్ర దాడికి భారత్ ప్రతీకార చర్యలు చేపట్టింది. ‘ఆపరేషన్ సిందూర్’ పేరిట పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులు చేసింది. ఈ చర్యపై యావత్ భారతదేశం హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తోంది. దాయాదిని ఏమార్చి.. అత్యంత పకడ్బంధీగా దాడుల ప్రణాళికలను భారత్ అమలుచేసింది. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ వ్యూహాలు కీలకంగా నిలిచాయి. బాలాకోట్ దాడులకు ముందు కూడా ఇలాంటి వ్యూహాలనే ప్రధాని అమలుచేశారు. దాడులకు ముందు ప్రశాంతమైన ప్రవర్తనతో దాయాదిని మరోసారి ఏమార్చారు. ఈ దాడులతో పాక్ షాక్‌కు గురికాక తప్పలేదు. బాలాకోట్ దాడి, ఆపరేషన్ సిందూర్‌ల మధ్య ఎన్నో పోలికలు ఉన్నాయి. అయితే.. వీటిని దాయాది పాకిస్థాన్ పసిగట్టడంలో విఫలమైంది. మోదీ వ్యూహాలను అంచనా వేయడంలో వెనకబడింది. పాక్ దృష్టి మరల్చి దెబ్బకొట్టడంలో భారత ప్రధాని మోదీ మరోసారి పైచేయి సాధించారు. దీంతో దాయాది ఏమరపాటుగా ఉన్న వేళ ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడింది.

**బాలాకోట్ దాడులకు ముందు..** పుల్వామా ఉగ్ర దాడికి ప్రతీకారంగా 2019 ఫిబ్రవరి 26న బాలాకోట్‌పై భారత్ దాడులు చేసింది. ఆ దాడికి 48 గంటల ముందు ప్రధాని మోదీ ఎప్పటిలానే ఎంతో ప్రశాంతంగా తన పనుల్లో నిమగ్నమయ్యారు. ఫిబ్రవరి 25న ఆయన దిల్లీలో జాతీయ యుద్ధ స్మారక చిహ్నాన్ని జాతికి అంకితం చేశారు. భారత సాయుధ దళాల పరాక్రమం గురించి మాట్లాడినప్పటికీ.. పాకిస్థాన్‌లోని ఖైబర్‌పంఖ్తుంఖ్వాలోని ఉగ్ర స్థావరాలపై జరగబోయే దాడుల గురించి ఎలాంటి సూచనలు చేయలేదు. ఆ రోజు రాత్రి 9 గంటలకు భారత వాయుసేన దాడులకు సిద్ధమవుతుండగా.. ప్రధాని మోదీ దిల్లీలో ఓ మీడియా బృందం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. అభివృద్ధి, భారత ఆకాంక్షలు, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారత సంకల్పం గురించి మాట్లాడారు. అయితే ఆ సమయంలో ప్రధాని ముఖంలో ఎలాంటి ఆందోళనా లేదు. ఎంతో ప్రశాంతంగా కనిపించారు. ఆ తర్వాత భారత బలగాలు తాము చేయాల్సిన పనిని విజయవంతంగా ముగించాయి.

**ఇప్పుడూ అలానే..** బాలాకోట్ దాడికి ముందు ప్రధాని మోదీ ప్రవర్తన ఎలా ఉందో.. ఇప్పుడూ అలానే ఎంతో ప్రశాంతంగా కనిపించారు. అప్పుడు పాల్గొన్నట్లే.. దాడికి ఒక రోజు ముందు ఓ మీడియా సంస్థ నిర్వహించిన సమావేశంలో మోదీ పాల్గొన్నారు. మంగళవారం రాత్రి ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహించిన ‘ఇండియా ఎట్ 2047’ సదస్సులో మోదీ మాట్లాడారు. భారత జలాలను ఇక నుంచి దేశం దాటనివ్వబోమని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దేశ ప్రయోజనాల కోసమే వాటిని వినియోగిస్తామని తేల్చి చెప్పారు. దాదాపు 30 నిమిషాల పాటు సాగిన ప్రసంగంలో.. ప్రధాని ముఖంలో ఎక్కడా ఆందోళన కనిపించలేదు. మరోవైపు దేశవ్యాప్తంగా యుద్ధ సన్నద్ధతపై ప్రజలకు అవగాహన కల్పించే మాక్ డ్రిల్స్‌ను అంతకుముందు ప్రకటించారు. ఇలాంటి కార్యక్రమాలతో.. దేశ ప్రజలను సైనిక చర్యకు, దాని పరిణామాలకు మోదీ సిద్ధం చేస్తున్నారనే సూచనలు మాత్రమే ప్రత్యర్థుల్లోకి వెళ్లాయి. అయితే.. ఇవన్నీ దాయాదిని ఏమార్చడానికి ఒక వ్యూహం మాత్రమే అని నిపుణులు పేర్కొంటున్నారు.

వీటిని పసిగట్టడంలో.. అప్పుడు బాలాకోట్ దాడుల సమయంలోనూ.. ఇప్పుడు ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ పాకిస్థాన్ పూర్తిగా విఫలమైంది. దీంతో దాయాది దృష్టి మరల్చి దాడి చేయడంలో మరోసారి భారత బలగాలు పైచేయి సాధించాయి.




‘ఆపరేషన్ సిందూర్’ కలిసి నిలబడదామంటూ ప్రముఖుల పోస్ట్‌లు..

పహల్గాంలో జరిగిన పైశాచిక చర్యకు భారత్ దీటైన స్పందన ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. మంగళవారం అర్ధరాత్రి 1.44 గంటలకు ‘ఆపరేషన్ సిందూర్’ పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం మెరుపు దాడులు చేసింది. దీనిపై ప్రముఖులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మేమంతా మీ వెంటే ఉంటామంటూ భారత్ సైన్యంను ఉద్దేశిస్తూ పోస్టులు పెడుతున్నారు. ‘జై హింద్’, ‘భారత్ మాతాకీ జై’, ‘ఆపరేషన్ సిందూర్’ అంటూ హ్యాష్ ట్యాగ్‌లతో సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి. ‘ఆపరేషన్ సిందూర్’ విజయవంతమైనందుకు ఆనందంగా ఉందంటూ అగ్ర కథానాయకుడు చిరంజీవి ‘జైహింద్’ అని రాశారు.

ఎన్నో రోజుల నిశ్శబ్దం తర్వాత ‘ఆపరేషన్ సిందూర్’ భారతదేశం మొత్తంలో స్ఫూర్తిని నింపింది. త్రివిధ దళాల ధైర్యం, అలాగే ఈ ఆపరేషన్‌కు నాయకత్వం వహించి సైన్యానికి అండగా ఉన్న ప్రధానమంత్రికి ధన్యవాదాలు. మేమంతా మీతోనే ఉన్నాం” **– పవన్ కల్యాణ్**

మా ప్రార్థనలన్నీ భద్రతా బలగాలతో ఉంటాయి. ఒకే దేశం.. కలిసి నిలబడదాం **– ఆనంద్ మహీంద్రా**

పోరాటం ఇప్పుడే ప్రారంభమైంది. లక్ష్యం పూర్తయ్యేవరకూ ఆగదు. దేశం మొత్తం మీతో ఉంది. జైహింద్ **– రజనీకాంత్**

“ఉగ్రవాదాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో మాత్రమే భారత్ చర్యలు చేపట్టింది. పాకిస్థాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకోలేదు. మన దేశం లక్ష్యాలను నిర్దేశించుకోవడంలో సంయమనం పాటించింది. 26 మందిని దారుణంగా చంపినందుకు మాత్రమే ఈ చర్యలు జరిపింది. మేం నిబద్ధతకు కట్టుబడి ఉంటాం” **– ప్రకాశ్ రాజ్**

ప్రస్తుతం ప్రతి కదలిక పైనా దృష్టిపెట్టాలి. అన్నిటినీ నిశితంగా పరిశీలించాలి. **– విశ్వక్‌సేన్**

జై హింద్ కీ సేనా.. భారత్ మాతాకీ జై.. **– రితేశ్ దేశ్‌ముఖ్**

భారత్ మాతా కీ జై.. న్యాయం జరిగింది **– ఖుష్బూ**

భద్రతా దళాలకు మరింత బలాన్నివ్వాలని ప్రార్థిద్దాం. ఒకే దేశం.. కలిసి నిలబడదాం. వందేమాతరం **– మధుర్ భండార్కర్**




జమ్మూకశ్మీర్‌పై దశాబ్దాలుగా వివాదాన్ని కొనసాగిస్తున్న పాకిస్థాన్.. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారత్‌పై ఉగ్రమూకలను ఉసిగొల్పుతున్న సంగతి తెలిసిందే. వీటికి దీటుగా స్పందిస్తున్న భారత్.. ప్రతీకార దాడులతో బుద్ధిచెబుతున్నప్పటికీ దాయాది దేశం తీరు మారడం లేదు. ఇటీవల పహల్గాంలోనూ పర్యటకులపై ఊచకోతకు పాల్పడింది. ప్రతీకారంగా పాక్ ఉగ్ర స్థావరాలపై భారత్ విరుచుకుపడింది. ‘ఆపరేషన్ సిందూర్’ పేరుతో దాడిచేసి పదుల సంఖ్యలో ముష్కర మూకలను మట్టుబెట్టింది. ఈ నేపథ్యంలో గత ఏడు దశాబ్దాల్లో పాక్‌పై మనం చేపట్టిన కీలక సైనిక ఆపరేషన్లను పరిశీలిస్తే..

**ఆపరేషన్ సిందూర్..** పహల్గాంలో ఏప్రిల్ 22న అక్కడి పర్యటకులపై దాడి చేసిన ఉగ్రవాదులు.. 26 మందిని ఊచకోత కోశారు. కన్నవారి, కట్టుకున్నవారి కళ్లముందే ప్రాణాలు తీసిన తీరు యావత్ ప్రపంచాన్ని కన్నీరు పెట్టించింది. దీనికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత్.. పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని మొత్తం తొమ్మిది ఉగ్ర స్థావరాలపై దాడులు చేసింది. ఈ దాడుల్లో పదుల సంఖ్యలో ముష్కరులను భారత సైన్యం మట్టుబెట్టింది.

**బాలాకోట్.. 2019...** పుల్వామాలో 2019 ఫిబ్రవరి 14న సీఆర్పీఎఫ్ సిబ్బందిపై దాడికి తెగబడిన ఉగ్రవాదులు.. 40 మంది సైనికులను పొట్టనపెట్టుకున్నారు. జైషే మహమ్మద్ ఈ దాడులు చేసినట్లు ప్రకటించుకుంది. దీనికి ప్రతీకారంగా బాలాకోట్‌లో జైషే ఉగ్ర స్థావరంపై ఫిబ్రవరి 26న భారత వాయుసేన వైమానిక దాడులు చేసింది. 1971 యుద్ధం తర్వాత పాకిస్థాన్ భూభాగంలోకి వెళ్లి దాడులు చేయడం అదే తొలిసారి.

**సర్జికల్ స్ట్రైక్స్.. 2016..** 2016 సెప్టెంబర్‌లో జమ్మూకశ్మీర్ ఉరిలోని భారత సైనిక స్థావరంపై మిలిటెంట్లు దాడులకు తెగబడి 19 మందిని చంపేశారు. అనంతరం పది రోజుల తర్వాత వ్యూహాత్మకంగా స్పందించిన భారత సైన్యం.. పీవోకేలో ఉన్న ఉగ్ర స్థావరాలపై సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించింది. అనేక మంది ఉగ్రవాదులను అంతం చేసింది. సీమాంతర ఉగ్రవాదాన్ని అంతం చేయడంలో సరికొత్త పంథాను అనుసరిస్తున్నట్లు ఆ ఘటనతో భారత్ నిరూపించుకుంది.

# శాస్త్రీయ సంగీతానికి ప్రాచుర్యం కల్పించిన గిరిజాదేవి

## - మే 8... సంగీత విద్వాంసురాలు గిరిజా దేవి జయంతి



గిరిజాదేవి (జననం 8 మే 1929) సేనియా, బెనారస్ ఘరానాకు చెందిన ఒక భారతీయ శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు. ఆమె లలిత శాస్త్రీయ సంగీతంతో పాటుగా టుమ్రీలను గానం చేసింది. గిరిజాదేవి వారణాశిలో ఒక జమీందారీ కుటుంబంలో మే 8, 1929లో జన్మించింది. ఆమె తండ్రి రాందేవ్ రాయ్ హార్మోనియం వాయించేవాడు. తండ్రి ఆమెకు తొలి సంగీత గురువు. ఆమె తన ఐదవ యేట నుండి ప్రముఖ సారంగి విద్వాంసుడు సర్జు ప్రసాద్ మిశ్రా వద్ద ఖయాల్ , టప్పాలు పాడడం నేర్చుకుంది. పిమ్మట శ్రీచంద్ మిశ్రా వద్ద వివిధ రీతుల సంగీతాన్ని అభ్యసించింది. తన తొమ్మిదవ యేట "యాద్ రహే" అనే సినిమాలో నటించింది. గిరిజా దేవి తొలి సారి ఆకాశవాణి అలహాబాద్ కేంద్రం ద్వారా 1949లో బహిరంగంగా పాడింది. కానీ ఉన్నత తరగతి కుటుంబీకులు బహిరంగంగా ప్రదర్శనలు ఇవ్వడం సంప్రదాయం కాదని తన తల్లి, అమ్మమ్మలనుండి వ్యతిరేకత రావడంతో కొంతకాలం ఆమె సంగీతం నాలుగు గోడలకే పరిమితమయ్యింది. చివరకు 1951లో బీహార్‌లో ఈమె తన తొలి సంగీత ప్రదర్శన చేసింది. ఆమె శ్రీచంద్ మిశ్రా వద్ద ఆయన 1960లలో మరణించేవరకు శిష్యరికం చేసింది. 1980లలో కలకత్తాలోని ఐ.టి.సి.సంగీత్ రీసర్చ్ అకాడమీ ఫ్యాకల్టీ సభ్యురాలిగా పనిచేసింది. 1990 తొలినాళ్లలో బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో సంగీత శాఖలో పని చేసి పలువురికి సంగీత పాఠాలు నేర్పి తన సంగీత వారసత్వాన్ని నిలుపుకుంది. ఆమె తరచూ పలుచోట్ల పర్యటిస్తూ అనేక ప్రదర్శనలు ఇచ్చింది. గిరిజా దేవి బెనారస్ ఘరానా పద్ధతిలో, పూరబీ అంగ్, టుమ్రీ పద్ధతులలో పాడి ఆ శాస్త్రీయ పద్ధతులకు ప్రాచుర్యం కల్పించింది. ఈమె కచేరిల్లో కజ్రి, చైతీ, హెూళీ, ఖయాల్, జానపద గీతాలు, టప్పా మొదలైన పాక్షిక సాంప్రదాయ శాస్త్రీయ పద్ధతులలోని పాటలు ఉంటాయి. ఆమె "క్వీన్ ఆఫ్ టుమ్రీ"గా పరిగణించ బడింది. ఆమె శిష్యురాలు మమతా భార్గవ అలంకార్ స్కూల్ ఆఫ్ మ్యూజిక్ ద్వారా అనేక మందికి సంగీత శిక్షణ ఇస్తున్నది. ఆమె పద్మశ్రీ పురస్కారం (1972), పద్మ భూషణ్ (1989), పద్మ విభూషణ్ (2016), సంగీత నాటక అకాడమీ అవార్డు (1977), సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ (2010), మహా సంగీత్ సమ్మాన్ అవార్డు (2012), సంగీత్ సమ్మాన్ అవార్డు, గ్లోబల్ ఇండియన్ మ్యూజిక్ అకాడమీ అవార్డ్ 2012 (జీవన సాఫల్య పురస్కారం), తనరిరి పురస్కార్ సొంతం చేసుకుంది. ఆమె తన 88వ యేట అక్టోబర్ 24, 2017 న కోల్‌కతాలో గుండెపోటుతో మరణించింది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సంచలన సినీ దర్శకుడు టి. కృష్ణ - మే 8...తొట్టెంపూడి కృష్ణ వర్ధంతి



తొట్టెంపూడి కృష్ణ దర్శకుడు, సంపాదకుడు, టాలీవుడ్ పరిశ్రమలో చాలా సంవత్సరాలు పనిచేశారు. ప్రతిఘటన, నేటి భారతం, రేపటి పౌరులు, ఇంకా ఎన్నో సినిమాల ద్వారా ఆయన మంచి పేరు తెచ్చుకున్నారు. కృష్ణ దర్శకత్వం వహించిన చిత్రాలకు అనేక అవార్డులు కూడా గెలుచు కున్నారు. ఆయన అనేక మలయాళ చిత్రాలలో పనిచేశారు. 1986 సంవత్సరంలో ఆయన చివరి చిత్రం "రేపటి పౌరులు", ఆయన మరణం తరువాత విడుదలైంది. ఆయన 1985 లో రాజశేఖర్, విజయశాంతి నటించిన చిత్రాలకు దర్శకత్వం వహించారు. అభ్యుదయానికి టి. కృష్ణ ప్రతిరూపం. ఆయన తీసిన ప్రతి సినిమా ఒక సంచలనం. తన చిత్రాలతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్న ఘనత ఆయనకు దక్కుతుంది. ప్రజానాట్య మండలి గర్వించదగిన గొప్ప కళాకారుల్లో టి కృష్ణ ఒకరు. మాదాల రంగారావు తీసిన యువతరం కదిలింది, విప్లవ శంఖం, ఎర్రమల్లెలు చిత్రాలకు ఆయన సహకారం అందించారు. మరో మిత్రుడు పోకూరి బాబూరావుతో కలసి ఈ తరం బ్యానర్‌పై 'నేటి భారతం' తీసి సంచలనం సృష్టించారు. పిదప 'దేశంలో దొంగలు పడ్డారు, దేవాలయం, వందేమాతరం, ప్రతిఘటన, రేపటి పౌరులు' చిత్రాలను రూపొందించి దర్శకుడిగా అత్యున్నత స్థానానికి చేరుకున్నారు. 'ఇందిన భారత' అనే కన్నడ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లేతో పాటు దర్శకత్వ బాధ్యత నిర్వర్తించారు. నేడు ప్రముఖ సినీ హీరోగా తెలుగు చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉన్న టి. గోపీచంద్ టి కృష్ణ కుమారుడే. కృష్ణ 1927 అక్టోబర్ 21న వరంగల్లు జిల్లా రాయిపర్తిలో జన్మించారు. అయన తండ్రి మంచి పండితుడు. ఉభయభాషా ప్రవీణుడు. కృష్ణ తన మేనమామ మాజీ మంత్రి టి.హయగ్రీవాచారి ప్రోత్సాహంతో నాటకాలలో ప్రవేశించి నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి 1948లో బి.ఎ. పూర్తి చేశారు. కొంతకాలం గోలకొండ పత్రికలో సినిమా సమీక్షలు వ్రాయడం, హైదరాబాద్ ఆలిండియా రేడియోలో గ్రామస్తుల కార్యక్రమాలలో "లింగడు" అనే తెలంగాణ యాసలో మాట్లాడే పాత్రను నిర్వహించడం వంటివి చేశాడు. సినిమాలలో పని చేయాలనే బలమైన కోరికతో 1950లో మద్రాసు చేరుకున్నారు. హెచ్.ఎం.రెడ్డి వద్ద దర్శకత్వశాఖలో అప్రెంటీస్‌గా చేరారు. ఆదర్శం అనే సినిమాలో సావిత్రికి జంటగా ఒక హాస్యపాత్రలో నటించారు. అదే చిత్రానికి అసోసియేట్ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. ఎం.వి.రాజన్ వద్ద ఎడిటింగ్‌లో శిక్షణ తీసుకున్నారు. రాజ్ కపూర్ తీసిన ప్రేమలేఖలు సినిమాలో "ప్రాణ్"కు తెలుగులో డబ్బింగ్ చెప్పారు. అమర సందేశం చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టరుగా, అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేశారు. కృష్ణ ప్రేమ చిత్రంతో ఇతను పూర్తి స్థాయి ఎడిటర్‌గా మారి 30కి పైగా చిత్రాలకు ఎడిటర్‌గా ఉన్నారు. కృష్ణ దర్శకత్వం వహించిన తొలి సినిమా ఉపాయంలో అపాయం. ఆయన ప్రతిఘటన, రేపటి పౌరులు, నేటి భారతం వంటి విజయ వంతమైన విప్లవాత్మక చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఈ తరం పిక్చర్స్ సంస్థని స్థాపించి ఎన్నో విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. మలయాళంలో కూడా కొన్ని చిత్రాలకు దర్శకత్వం వహించారు. నేటి భారతం (1980) (కథ, దర్శకత్వం), దేశంలో దొంగలు పడ్డారు (1985) (కథ, దర్శకత్వం), దేవాలయం (సినిమా) (1985) (కథ, కథనం, దర్శకత్వం), వందే మాతరం (1985 సినిమా) (1985) (కథ, కథనం,దర్శకత్వం), ప్రతి ఘటన (1985) (కథ, కథనం, దర్శకత్వం), పకరాతిను పకరం (1986) (దర్శకత్వం) మలయాళం, ప్రతిఘట్ (1987) (కథ, కథనం) రేపటి పౌరులు (1986) (రచన, దర్శకత్వం) తదితర చిత్రాల ద్వారా ఆయన ప్రతిభ తేట తెల్లం అవుతున్నది. సంచలన సినీ దర్శకుడిగా తెలుగు సినీ సామ్రాజ్యాన్ని ఏలుతున్న రోజుల్లోనే ఆయన కేన్సర్ వ్యాధికి గురి కాగా, 3 నెలలపాటు అమెరికాలో చికిత్స కూడా పొందారు. వ్యాధి తగ్గక, చెన్నై అపోలో ఆస్పత్రిలో ఇరవై రోజులపాటు చికిత్స పొంది , 1987 మే 8న తుది శ్వాస వదిలారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అన్నవరంలో సత్య దేవుని కళ్యాణానికి విస్తృత ఏర్పాట్లు

## మే 7నుండి 13 వరకు స్వామివారి కళ్యాణోత్సవాలు

**"మూలతో బ్రహ్మరూపాయ**
**మధ్యతశ్చ మహేశ్వరం**
**అధతో విష్ణురూపాయ**
**త్ర్యైక్య రూపాయతేనమః " .**

అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి త్రిమూర్తి రూపం. భక్త సులభుడిగా, కోర్కెలు నెరవేర్చే సత్యదేవుడిగా ఆయనపై అందరికీ అచంచల విశ్వాసం. ఏదైనా పని తలపెట్టినప్పుడు సత్యనారాయణ వ్రతం ఆచరిస్తే అనితర సాధ్యమైన మనోబలం సొంతమవు తుందని చెబుతారు కార్తికమాసంలో త్రిమూర్తుల అభేదాను భవాన్నిచ్చే మీసాలరాయుని దర్శనం చాలా మంచిదని నమ్మకం. అన్నవరం సత్యదేవుడికి ఏడాదిలో అతి ముఖ్యమైన పర్వదినాలలో ప్రధానమైనది సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవం. అన్నవరం శ్రీ వీరవెంకట సత్యన్నారాయణస్వామివారి కళ్యాణ మహోత్సవములు ప్రతి ఏడాది వైశాఖ శుద్ధ దశమి నుండి వైశాఖ బహుళ పాడ్యమి వరకు పంచాహ్నికంగా, స్మార్తాగమరీతిలో ఆపస్తంబ సూత్రరీత్యా మహావైభవంగా జరుగుతాయి. వీటినే అన్నవరం సత్యదేవుని బ్రహ్మోత్సవాలు అంటారు. మేరువు కుమారులైన భద్రుడు, రత్నాకరుడు మహావిష్ణువు అనుగ్రహంతో భద్రగిరి, రత్నగిరిగా మారినట్లు పురాణ కథనం. శ్రీమన్నారాయణుడు భద్రగిరిపై శ్రీరామచంద్రుడిగా, రత్నగిరిపై సత్యనారాయణ స్వామిగా అవతరించినట్లు చెబుతారు. సత్యదేవుని కొలువు సర్వదేవతా నిలయం. దిగువన స్వామి యంత్రం ఉంది. నలు దిక్కులా పంచాయతన దేవతలు కొలువుదీరారు. ఆగ్నేయాన గణపతి, నైరుతిలో సూర్య భగవానుడు, వాయువ్య దిశలో బాలాత్రిపుర సుందరీ అమ్మవారు, ఈశాన్యాన ఈశ్వరుడు కొలువై ఉన్నారు. ఆలయ నిర్మాణం 1934 లో జరిగింది. ఆలయ నిర్మాణం రెండు అంతస్తులలో జరిగింది. క్రింది భాగంలో నారాయణ యంత్రం, పై అంతస్తులో దేవతా మూర్తులు. ప్రధాన ఆలయం రథాకారంలో నాలుగువైపులా చక్రాలతో నిర్మింపబడింది. స్వామి విగ్రహం 4 మీటర్ల ఎత్తుంటుంది. ఈ స్వామిని మూలం బ్రహ్మ, మధ్య భాగం ఈశ్వరుడు, పై భాగం మహ విష్ణువుగా, త్రిమూర్తి స్వరూపంగా కొలుస్తారు. తెలుగువారు అన్ని శుభకార్యాల్లో కొలిచే దేవుడు శ్రీ సత్యన్నారాయణ స్వామి. ఆయన వ్రతం ఏదో ఒక సందర్భంలో చెయ్యనివారు అరుదుగా ఉంటారు. పిలిస్తే పలికే దైవంగా పేరుపొందిన శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయాన్ని రత్నగిరి అనే కొండపై అన్నవరంలో నిర్మించారు. ఈ ఆలయ నిర్మాణం అయి ఒక శతాబ్దము పైగా మాత్రమే ఐనా చాలా ప్రాశ్యస్త్యాన్ని, ప్రాముఖ్యతను పొందింది. సమీపంలో పంపా నది పారుతుంటుంది. కొండపై నెలకొని ఉన్న ఈ దేవాలయంలో వేంచేసి ఉన్న శ్రీ సత్యనారాయణ స్వామి ని దర్శించేందుకు గుడివరకు ఘాట్ రోడ్డు నిర్మించారు. మెట్ల గుండా కూడ వెళ్ళవచ్చు. ఇక్కడ సామూహికంగా వందలాది దంపతులు కూర్చుని ఒకేసారి సత్యనారాయణస్వామి వ్రతాన్ని కనుల పండువగా చేసికొంటూ ఉండటం ఒక ప్రత్యేకత. పంపా నది ఒడ్డున ఉన్న రత్నగిరి మీద ఈ ఆలయం సముద్ర మట్టానికి 300 అడుగుల ఎత్తులో ఉన్నది. ఈ గుడికి పాదచారులు చేరు కోవడానికి 460 మెట్లు ఉన్నాయి. ప్రధాన ఆలయం రథాకారం లో ఉండి, నాలుగు దిక్కులలో నాలుగు చక్రాలతో ఉంటుంది. ప్రధాన ఆలయానికి ఎదురుగా కళ్యాణ మండపం ఉంటుంది. ఈ కళ్యాణ మండపం ఆధునిక నిర్మాణ చాతుర్యానికి ఒక మచ్చుతునక. వనదుర్గ ఆలయం, రామాలయాలు ప్రక్కన కనిపిస్తూ ఉంటాయి. ఆలయ రూపం, అగ్ని పురాణం లో చెప్పబడినట్లు, ప్రకృతిని తలపిస్తూ ఉండాలి. ఈ ఆలయం ఆ ప్రకారం రెండు అంతస్థులలో నిర్మింపబడింది. క్రింది భాగం లో యంత్రం, పై అంతస్థులో స్వామి విగ్రహాలు ఉన్నాయి. స్వామి విగ్రహం 4 మీటర్ల ఎత్తు ఉంది. క్రింద గర్భగుడి ఉన్న భాగాన్ని విష్ణు మూర్తి గా అర్చిస్తారు, మధ్యభాగం లో ఉన్నదానిని శివునిగా పూజిస్తారు. మూలవిరాట్టు అంతా ఏక విగ్రహంగా ఉండి త్రిమూర్తులు గా పూజింప బడడం ఇక్కడి విశేషం. త్రిపాద విభూతి నారాయణ ఉపనిషత్తు లో వర్ణింపబడిన యంత్రం ఇక్కడ ఉన్నది. అన్నవరం రత్నాద్రివాసుడైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి అతి ముఖ్యమైన పర్వదినాలలో ప్రధానమైన సత్యదేవుడి వార్షిక కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు ఈనెల 7న ప్రారంభమై 13 వరకు నిర్వహిస్తుండగా, 8న దివ్య కల్యాణం అంగరంగ. వైభవంగా నిర్వహించనున్నారు. దివ్య కల్యాణం రోజున భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. కొండపైన, కొండ దిగువన కళాశాల మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు . కల్యాణ కార్యక్రమాలు వీక్షించే భక్తులకు వార్షిక కల్యాణవేదిక ఎదురుగా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. భారీ వాహనాలను కొండపైకి అనుమతించక, కొండదిగువ నుంచి పైకి ప్రత్యేక బస్సుల ద్వారా ఉచిత రవాణా సదుపాయం కల్పించనున్నారు. భక్తుల కోసం ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్లు, కల్యాణం అనంతరం భక్తులకు ఉచిత ప్రసాదం, కల్యాణ అక్షింతల పంపిణీకి కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతు న్నారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక ఇతర శాఖల సమన్వయంతో లోటుపాట్లు జరగకుండా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. కల్యాణం ప్రత్యక్షంగా వీక్షించలేని భక్తుల కోసం వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం గావిస్తున్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**




# 16 ఏళ్లకే బ్రెస్ట్ కేన్సర్ విజేత...

## 15 రోజుల్లోనే మిస్ వరల్డ్ బరిలో థాయ్‌లాండ్ సుందరి!



ప్రపంచవ్యాప్తంగా అందం, వ్యక్తిత్వానికి పట్టం కట్టే 72వ మిస్ వరల్డ్ – 2025 పోటీలకు హైదరాబాద్ నగరం ఆతిథ్యం ఇవ్వనున్న విషయం తెలిసిందే. ఈ ప్రతిష్టాత్మక వేడుకలో3 దాదాపు 120 దేశాల నుండి అందమైన యువతులు పాల్గొననున్నారు. ఈ క్రమంలో మిస్ వరల్డ్ థాయ్‌లాండ్ 2025గా ఎన్నికైన ఓపాల్ సుచాత చువాంగ్ శ్రీ ఇటీవల హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సందడి చేశారు. బంజారాహిల్స్‌లోని ప్రముఖ వస్త్ర దుకాణం సింఘానియాస్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తన 'ఓపాల్ ఫర్ హెర్' అనే సామాజిక బాధ్యత కార్యక్రమానికి మద్దతుగా ఆమె సింఘానియాస్ ప్రత్యేక చీరలు, లెహంగాలను ధరించారు. ఈ సందర్భంగా తన స్ఫూర్తిదాయకమైన జీవిత ప్రయాణాన్ని, మిస్ వరల్డ్ పోటీల కోసం తక్కువ సమయంలో ఎలా సిద్ధమయ్యారో మీడియాతో పంచుకున్నారు. ఓపాల్ సుచాత కేవలం అందాల పోటీదారు మాత్రమే కాదు.. ఆమె ఒక నిజమైన పోరాట యోధురాలు. కేవలం 16 సంవత్సరాల వయస్సులో ఆమె ప్రాణాంతకం కానప్పటికీ, రొమ్ము కణితితో బాధపడ్డారు. ఆ సమయంలో ఆమె అనుభవించిన భయం ఆమెపై తీవ్రమైన ప్రభావం చూపాయి. అయితే, ఓపాల్ ఆ కష్టాన్ని అధిగమించి తన అనుభవాన్ని ఇతరులకు సహాయం చేసే శక్తిగా మార్చుకున్నారు. 'ఓపాల్ ఫర్ హెర్' అనే పేరుతో ఆమె ఒక దేశవ్యాప్త రొమ్ము క్యాన్సర్ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆమె ప్రజలకు విద్య, ముందస్తు గుర్తింపు ప్రాముఖ్యత, ఈ వ్యాధిని ఎదుర్కోవడానికి అవసరమైన ధైర్యాన్ని అందిస్తున్నారు. సమాజంలో నెలకొన్న అపోహలు, అవగాహన లేకపోవడం లేదా ఆర్థిక ఇబ్బందుల కారణంగా చాలా మంది మహిళలు తమ సమస్యలను బయటకు చెప్పడానికి వెనుకాడుతున్నారని ఆమె గ్రహించారు. మిస్ థాయ్‌లాండ్‌గా ఎన్నికైన తర్వాత మిస్ వరల్డ్ వేదికకు సిద్ధం కావడానికి ఆమెకు కేవలం 15 రోజులు మాత్రమే సమయం దొరికింది. ఇది నిజంగా ఒక అద్భుతం అని ఆమె భావిస్తున్నారు. ఇంత తక్కువ సమయంలో ఇంత పెద్ద అవకాశం రావడం తన అదృష్టమని ఆమె అన్నారు. మిస్ వరల్డ్ వేదికపై విజయం సాధించడమే తన దేశానికి తాను ఇచ్చే గొప్ప బహుమతి అని ఆమె దృఢంగా నమ్ముతున్నారు. థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌లో పుట్టి పెరిగిన ఓపాల్, అక్కడే తన విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఉన్నత చదువుల కోసం ఆమె బ్యాంకాక్‌కు వచ్చారు. అక్కడి నుంచే ఆమె ఫ్యాషన్ రంగంలో తన ప్రయాణాన్ని ప్రారంభించారు. 16 ఏళ్ల వయస్సులో రొమ్ము కణితికి శస్త్రచికిత్స చేయించుకున్న అనుభవం ఆమెకు ఉంది. ఆ సమయంలో ఆమె అనుభవించిన బాధ, ఆందోళన ఆమెను రొమ్ము క్యాన్సర్ పట్ల మరింతగా అవగాహన పెంచుకునేలా చేశాయి. అందుకే ఆమె తన 'ఓపాల్ ఫర్ హెర్' కార్యక్రమం ద్వారా రొమ్ము క్యాన్సర్‌పై విస్తృతమైన అవగాహన కల్పిస్తున్నారు. ఈ వ్యాధిని ముందస్తుగా గుర్తించడం, సకాలంలో చికిత్స తీసుకోవడం ప్రాముఖ్యతను ఆమె నొక్కి చెబుతున్నారు. ఈ మహమ్మారిపై అవగాహన కల్పించడమే తన జీవిత లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. మిస్ థాయ్‌లాండ్‌గా తనకున్న వేదికను ఉపయోగించి, ఆమె తన స్వరాన్ని వినిపిస్తున్నారు. ఇలాంటి సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. థాయ్ ప్రజలకు స్ఫూర్తినిస్తూ, ప్రపంచానికి సేవ చేయాలనేదే ఆమె ప్రధాన లక్ష్యం. ఈ విషయంలో ఆమె తల్లి ఆమెకు గొప్ప స్ఫూర్తిగా నిలిచారు.

# కొంపముంచిన ఇన్‌స్టాగ్రామ్ స్నేహం..

## హైదరాబాద్ చీకటి కూపంలో చిక్కుకున్న థాయ్ యువతి

హైదరాబాద్‌లో ఒక హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది. ముప్పై సంవత్సరాల థాయ్ యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వ్యక్తితో స్నేహం చేసింది. అతడిని నమ్మి చెన్నైకి వచ్చిన ఆమె జీవితం అధోగతి పాలైంది. ఆ వ్యక్తి ఆమెను మోసం చేశాడు. ఒక హెూటల్ గదిలో అనేకసార్లు లైంగికంగా వేధించాడు. ఆ తర్వాత ఆమెను అక్కడే వదిలి పరారయ్యాడు. హెూటల్ అద్దె చెల్లించడానికి, తిరిగి తన దేశానికి డబ్బుల్లేని ఆ మహిళ నిస్సహాయ స్థితిలో వ్యభిచారం చేయాల్సి వచ్చింది. డబ్బు సంపాదించడానికి మరో దారి లేకపోవడంతో థాయ్ అమ్మాయిలను వ్యభిచారం కోసం సరఫరా చేసే ఒక వ్యక్తిని ఆమె ఆశ్రయించింది. ఆ వ్యక్తి ఆమెను, మరొక అమ్మాయిని శ్రీనగర్ కాలనీలోని ఒక ఫ్లాట్‌లో ఉంచి వ్యభిచారం చేయిస్తున్నాడు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు.. వారు ఆ ఫ్లాట్ మీద దాడి చేశారు. ఆ ఇద్దరు అమ్మాయిలను అదుపులోకి




తీసుకున్నారు. తిరిగి వెళ్లడానికి డబ్బు సంపాదించడానికే తాను వ్యభిచారంలోకి దిగానని ఆ థాయ్ యువతి పోలీసుల ఎదుట కన్నీటితో విలపించింది. దీంతో పోలీసులు ఆమెను పునరావాస గృహానికి తరలించారు. ఈ సంఘటనపై మహిళా సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దక్షిణాసియా దేశాల నుంచి వచ్చే మహిళలు కొందరు స్వార్థపరులైన పురుషులకు ఈజీ టార్గెట్ అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి మహిళలు, అమ్మాయిలు తెలిసో తెలియకో తమను ప్రేమించానని నమ్మించిన వారి మోసానికి బలవుతున్నారు. ఆ తర్వాత వ్యభిచార కూపంలోకి దిగవలసి వస్తోంది. ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఏర్పడే స్నేహాలు కొన్నిసార్లు ఎంత ప్రమాదకరంగా మారుతాయో ఈ ఉదంతం మరోసారి రుజువు చేసింది. ఆన్‌లైన్ స్నేహాల విషయంలో యువతులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యక్తిగత వివరాలు పంచుకునే ముందు అవతలి వ్యక్తి నేపథ్యం, ఉద్దేశాలను పూర్తిగా తెలుసుకోవాలని చెబుతున్నారు. హైదరాబాద్ పోలీసులు ఈ కేసును తీవ్రంగా పరిగణిస్తున్నారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అంతేకాకుండా, వ్యభిచార రాకెట్‌ను నడుపుతున్న వ్యక్తిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా బాధితులకు న్యాయం చేకూర్చగలమని.. ఇతరులకు ఇది ఒక గుణపాఠం అవుతుందని పోలీసులు భావిస్తున్నారు.

# ప్రపంచ కుబేరుడి కంటే ధనవంతుడు.. బ్యాంకు

## తప్పిదంతో రైతు ఖాతాలో లక్షల కోట్ల డబ్బు!

ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లాలోని ఓ మారుమూల గ్రామంలో నివాసం ఉంటున్న అజిత్ అనే రైతు తన బ్యాంక్ అకౌంట్లో ఏకంగా 36 అంకెల బ్యాలెన్స్ చూసి షాక్ అయ్యాడు. తన జీవితంలో కలలో కూడా ఊహించని ఈ సంఘటన అతడిని తీవ్ర ఆశ్చర్యానికి గురి చేసింది. ఏప్రిల్ 24న అజిత్ అకౌంట్ నుంచి మొదట రూ.1,800, ఆ తర్వాత అదే రోజు రూ.1,400 డెబిట్ అయ్యాయి. అయితే, మరుసటి రోజు ఏప్రిల్ 25న అతని బ్యాంకు బ్యాలెన్స్ అక్షరాలా రూ.1,00,13,56, 00,00,01, 39,54,21,00, 23,56, 00,00,01,39,542 గా కనిపించడంతో కేవలం అతని కుటుంబ సభ్యులే కాదు.. యావత్ గ్రామం విస్మయానికి గురైంది. ఇంత పెద్ద



మొత్తాన్ని చూసిన అజిత్ భార్య మొదట ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయారు. వెంటనే మోసగాళ్ల బారిన పడతామేమోనన్న భయం ఆమెను ఆవహించింది. దీని గురించి తెలుసుకోవడానికి అజిత్ బ్యాంకు సిబ్బందిని సంప్రదించగా జమ్మూ కాశ్మీర్‌లోని ఒక బ్రాంచ్‌లో జరిగిన టెక్నికల్ ఎర్రర్ కారణంగా ఈ డబ్బు జమ అయిందని వారు తెలిపారు. అయితే, ఆ తర్వాత కూడా అదే బ్యాలెన్స్ కనిపించడంతో అజిత్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు అతడిని సైబర్ క్రైమ్ విభాగంలో మరో దరఖాస్తు సమర్పించమని కోరారు. ప్రస్తుతం అజిత్ ఖాతా ఫ్రీజ్ చేయడంతో తాను మోసపోయానని ఆందోళన చెందుతున్నాడు. అజిత్ చూసిన ఈ మొత్తం బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు, స్పేస్‌ఎక్స్ సీఈఓ 14 అంకెల నికర విలువ (?2,84,17,69,27,10,400) కంటే కూడా చాలా ఎక్కువ కావడం గమనార్హం. ఒక సాధారణ రైతు అకౌంట్లో ఇంత అసాధారణమైన బ్యాలెన్స్ కనిపించడం బ్యాంకు వ్యవస్థల్లోని లోపాలను ఎత్తిచూపుతోంది. ఈ ఘటనపై బ్యాంకు అధికారులు పూర్తిస్థాయి విచారణ జరుపుతున్నారు. అజిత్ అకౌంట్లలోని నిధులను తిరిగి సరిచేసి, అతడికి జరిగిన అసౌకర్యానికి పరిహారం చెల్లించే అవకాశం ఉంది. అయితే, ఈ సంఘటన అజిత్, అతని కుటుంబ సభ్యులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది.

చురకలు

## సంపాదకీయం

# గాలి కేసు తేలింది... జగన్ కేసు మిగిలింది !

ఇప్పటికి పదిహేనేళ్ళ క్రితం ఉమ్మడి ఏపీలో సీబీఐ చేపట్టిన రెండు కేసులు పెను సంచలనం రేపాయి. అందులో ముందుగా గాలి జనార్ధనరెడ్డి కేసు తీసుకుంటే ఇది 2009 నుంచి 2011 మధ్యలో సీబీఐ విచారణ చేసిన కేసు. ఈ కేసులో సీబేఐ రంగంలోకి దిగి దర్యాప్తు చేసిన తరువాత కోర్టులో 14 ఏళ్ళ పాటు విచారణ జరిగి సీబీఐ కోర్టు తీర్పు వెలువరించింది. దాంతో గాలి జనార్ధనరెడ్డికి ఏడేళ్ళ జైలు శిక్ష ఖరారు చేస్తూ కోర్టు తీర్పు చెప్పింది. ఇదిపుడు రాజకీయంగా కొంత సంచలనం రేపుతోంది. ఎందుకంటే ఈ కేసు తర్వాత 2012లో వైసీపీ అధినేత జగన్ మీద సీబీఐ కేసు ఫైల్ చేసింది. ఆయన ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న దాని మీద పదకొండు చార్జి షీట్లు వేసి మరీ కేసు సుదీర్ఘంగా దర్యాప్తు చేసింది. ఇక ఈ కేసు మీద కూడా సీబీఐ కోర్టులో విచారణ సాగుతోంది. గాలి కేసు ఒక కొలిక్కి వచ్చి తీర్పు వెలువరించిన తరుణంలో అందరి చూపూ జగన్ కేసు మీద ఉంది. ఈ కేసు కూడా తొందరగా విచారణ ముగిసి సీబీఐ తుది తీర్పు ఇస్తుందని అంతా భావిస్తున్నారు. గాలి కేసులో తీర్పుని చూసిన వారు అంతా జగన్ కేసులో ఏదైనా సంచలనం నమోదు అవుతుందా అని కూడా చర్చించుకుంటున్నారు. నిజాకికి గాలి కేసు కంటే జగన్ కేసు మీదనే అందరి ఫోకస్ ఉంది. గాలి మాజీ మంత్రి మాత్రమే. ఆయన ప్రభావం కర్ణాటక రాజకీయాల్లో పెద్దగా లేదు. ఆయన సొంత పార్టీ స్థాపించి గత ఎన్నికల్లో పోటీ చేసినా తాను మాత్రమే ఎమ్మెల్యేగా గెలిచారు. చిత్రమేంటి అంటే ఆయన బీజేపీలో చేరిపోయారు. అయినా కూడా ఆయన ఇపుడు ఏడేళ్ళ జైలు శిక్షకు గురి అయ్యారు. బీజేపీలో చేరితే ఏదో విధంగా రక్షణ ఉంటుందని భావించిన వారందరికీ గాలి కేసు దిమ్మదిరిగే జవాబు అని అంటున్నారు. మరో వైపు చూస్తే అవినీతి అక్రమాలు ఎవరు చేసినా చట్టపరమైన రక్షణ ఉండదని కూడా కమలం పార్టీ ఈ విధంగా చాటుకున్నట్లు అయింది అని అంటున్నారు మరో వైపు చూస్తే కనుక ఏపీలో జగన్ తన తండ్రి హయాంలో అక్రమాస్తులు కూడగట్టారని ఆయన పలుకుబడిని ఉపయోగించుకుని ఎంతో చేశారని సీబీఐ క్విడ్ ప్రోకో అభియోగంతో కేసు నమోదు చేసింది. దాంతో టెక్నికల్ గా ఈ కేసు ఎంతవరకూ నిలబడుతుంది అన్న చర్చ ఉన్నా అంతిమ లబ్దిదారు ఎవరు అన్నది చూస్తారు కాబట్టి బలంగానే ఉంటుందని అది ఇబ్బంది పెట్టే విధంగా ఉంటుందని అంటున్నారు. ఇక లిక్కర్ స్కాం విషయంలో ఏపీలో సీఐడీ దూకుడు చేస్తోంది. ఈ కేసులో మూల సూత్రధారులను పట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఈ కేసులో కూడా వైసీపీలో పెద్ద తలకాయలు చిక్కుతాయా అన్నది మరో చర్చ. ఏది ఏమైనా వైసీపీ నేతలు వరసబెట్టి అరెస్టు అవుతున్నారు. వారి మీద కేసులు పడుతున్నాయి. తీగలు అన్నీ కలసి డొంక లాగితే ఏపీలో రాజకీయంగా ప్రకంపనలే పుడతాయని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో. ఈ లోగా గాలి కేసు ముందుకు రావడంతో అన్ని వైపుల నుంచి మేఘాలు ముసురుకుంటున్నాయా అన్న చర్చ కూడా సాగుతోంది.

# సామాజిక సేవలకు ప్రతిరూపం దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ - మే 8... దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ వర్ధంతి

ఆమె ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త, రచయిత్రి. దేశభక్తు రాలిగా, సామాజిక సేవా తత్పరు రాలుగా ... మరెవరూ చూపని ధైర్య సాహసాలను, ప్రజ్ఞను చూపి చరిత్రలో నిలిచి పోయారు. తెలుగు ప్రజలు గర్వించ దగిన ఉన్నత భావాలు కలిగిన మహోన్నత వ్యక్తి. వ్యక్తి మాత్రమే కాదు, ఒక వ్యవస్థ. మేధావిగా, న్యాయ కోవిదు రాలుగా, మానవతా వాదిగా, ఆంధ్ర మహిళాసభ వ్యవస్థాపకురాలిగా.. బహుముఖ ప్రజ్ఞను కనబరిచి చరిత్రపుటల్లో మహామనిషిగా నిలిచిన ఆ ఉక్కు మహిళ దుర్గాబాయ్ దేశ్ ముఖ్. ఒక బాలికగా జాతీయోద్యమానికి ప్రేరేపితురాలై, జాతిపిత, చాచా నెహ్రూ లాంటి జాతీయోద్యమ నేతల మన్ననలను అందు కున్నారు. గాంధీజీ ఆంధ్ర రాష్ట్ర పర్యటనకు విరాళాల సేకరణ కోసం కాకినాడ వచ్చినపుడు ఆయన ప్రసంగాన్ని తెలుగులో చేసిన అనువాదానికి గాంధీజీ అభినందనలకు పాత్రు లైనారు. ఆ సందర్భంలో విరాళాలు సేకరించడమే కాక, మహాత్ముడు అడిగితే తన చేతి బంగారు గాజులు కూడా సమర్పించిన త్యాగమయి. కాకినాడలో 1923లో జరిగిన కాంగ్రెసు మహాసభలకు టికెట్టు లేకుండా వచ్చిన జవాహర్లాల్ నెహ్రూను అనుమతి లేదని వెనక్కి పంపిన ధీశాలి. దుర్గాబాయ్ చిన్ననాటి నుండే స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచు కున్నారు. తన 12 యేండ్ల వయసులో ఆంగ్ల విద్యపై పోరాటం చేశారు. ఆమె రాజమండ్రిలో బాలికలకు హిందీలో విద్యను అందించడానికి బాలికా హిందీ పాఠశాలను ప్రారంభించారు. దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మద్రాసు ప్రెసిడెన్సి (ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్) లోని రాజమండ్రిలో, 1909 జూలై 15 న సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన రామారావు, కృష్ణవేణమ్మ దంపతులకు జన్మించారు. పది సంవత్సరాల వయస్సులోనే హిందీలో పాండిత్యాన్ని సంపాదించి, హిందీ పాఠశాలను నెలకొల్పి అన్ని వయసుల వారికీ విద్యాబోధన అందించారు. బెనారస్ విశ్వ విద్యాలయం నుండి మెట్రి క్యులేషన్, ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి ఎం.ఏ (పొలిటికల్ సైన్స్), 1942లో ఎల్. ఎల్.బి పూర్తిచేసింది. న్యాయశాస్త్ర చదువు పూర్తయ్యాక మద్రాసులో హైకోర్టులో సాధన ప్రారంభించారు. న్యాయ కోవిదురాలిగా, ప్రఖ్యాత క్రిమినల్ లాయర్‌గా పేరుగాంచారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు జైలు శిక్ష కూడా అనుభవించారు. భారతదేశ రాజ్యాంగ సభ, ప్రణాళికా సంఘ సభ్యురాలు. ఆమె నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్ ఎడ్యుకేషన్ కు మొదటి చైర్ పర్సన్ గా వ్యవహరించారు. 1953 ఆగస్టులో భారత ప్రభుత్వంచే నెలకొల్పబడిన కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డుకు వ్యవస్థాపక అధ్యక్షురాలిగా, ఢిల్లీలో బ్లైండ్ రిలీఫ్ అసోసియేషన్‌కు అధ్యక్షురాలిగా పని చేశారు. ఆమెను భారతదేశంలో సోషల్ సర్వీస్ మదర్ గా పిలిచేవారు. అనేక మహిళా సంస్థలు, సాంఘిక సంక్షేమ సంస్థలను ప్రారంభించి స్త్రీల అభ్యున్నతికి కృషిచేశారు. ఆమె ఆధ్వర్యంలో 1937లో చెన్నపట్నంలో (ప్రస్తుత చెన్నై లో) ఆంధ్ర మహిళా సభ స్థాపించ బడింది. హైదరాబాద్ లో ఆంధ్ర మహిళా సభను స్థాపించారు. ఇప్పటికీ పనిచేసే ఆసంస్థ పేరుతోనే ఆవీధిని పిలుస్తారు. అక్కడ వితంతువులకు,అనాథ స్త్రీలకు చదువు చెప్పించడం, రకరకాల పనులలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ళమీద వారు నిలబడేటట్లుగా తయారు చేసేవారు. రాష్ట్ర మంతటా ఎన్నో కళాశాలలు, వసతిగృహాలు, నర్సింగ్ హోమ్‌లు, వృత్తి విద్యాకేంద్రాలు నెలకొల్పారు. లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్ అనే బాల సంఘాన్నికూడా స్థాపించారు. నర్సింగ్ కాలేజీ లను స్థాపించారు. ఆంధ్ర మహిళ పత్రికను స్థాపించి సంపాదకత్వం వహించారు. 1953 జనవరి 22న దేశ్‌ముఖ్ వివాహం దుర్గాబాయ్ తో జరిగింది. అది ద్వితీయ, అంతర్రాష్ట్ర, ఆదర్శ వివాహం అయినందున దేశంలో గొప్ప సంచలనం సృష్టించింది. వారి పెళ్లి పత్రంపై నెహ్రూ, ఆచార్య కృపలానీ దంపతులు సాక్షులుగా సంతకాలు చేశారు. దుర్గాబాయ్‌తో వివాహం జరిగిన తర్వాత మొదటి జన్మదినాన్ని ఆయన తన ఇంట్లో చాలా నిరాడంబరంగా జరుపు కున్నారు. ఈ సంగతి నెహ్రూకు తెలిసి, తీరిక చేసుకొని నెహ్రూ వాళ్ల ఇంటికి వెళ్లారట. 'ఏం దుర్గాబాయ్! దేశ్‌ముఖ్ నీ భర్తే కావచ్చు.. నా క్యాబినెట్ మంత్రి సుమా!' అని చమత్కరించారట. ఆ దంపతులు ఇచ్చిన టీ బిస్కెట్ తీసుకుని నెహ్రూ మందహాసంతో వెళ్లిపోయారట. ఇలాంటి ఆప్యాయత ఈ రోజుల్లో కనిపించడం బహు అరుదు. 1971లో సాక్షారతా భవన్ ని



ప్రారంభించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం దుర్గాబాయికి 1971లో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. 1975లో భారత ప్రభుత్వం పద్మ విభూషణ పురస్కారంతో సత్కరించగా, అదే సంవత్సరం ఆయన సతీమణి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కూడా పద్మ విభూషణ్ పొందడం, భార్యా భర్తలు ఇద్దరూ ఒకే ఏడాది పురస్కార గ్రహీతలు కావడం విశేషం. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్, 1971 – నెహ్రూ లిటరసీ అవార్డు (వయోజన విద్యాసేవలకు గుర్తింపుగా), యునెస్కో నుండి పాల్ జి. హాఫ్‌మన్ అవార్డు పొందారు. అసమాన ప్రజ్ఞా పాటవాతో చిర కాలం గుర్తుండే కార్యక్రమాలకు పురుడు పోసిన దుర్గాబాయ్ 1981 మే 9వ తేదీన హైదరాబాదులో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఆపన్నులకు అండగా... రెడ్ క్రాస్ సంస్థ - మే 8...అంతర్జాతీయ రెడ్‌క్రాస్ దినోత్సవం


రెడ్ క్రాస్ సంస్థ ఏర్పాటు వెనక ఒక మానవతా మూర్తి స్ఫూర్తి ఉంది. స్విస్ పౌరుడు జీన్ హెన్రీ డునాంట్ 1859 లో ఒక వ్యాపార పర్యటనలో, ఆధునిక ఇటలీలో సోల్ఫెరినో యుద్ధం పరిస్థితులకు డునాంట్ సాక్షిగా నిలిచాడు. ఆ యుద్ధంలో 40వేల మంది మరణించారు, అధిక సంఖ్యాకులు గాయపడ్డారు. గాయపడిన వారికి సాయం అందకుండా, రక్షణ లేకుండా పోయిన హృదయ విదారక దృశ్యాలు కళ్ళారా చూశాడు. తన జ్ఞాపకాలు, అనుభవాలను ఎ మెమరీ ఆఫ్ సోల్ఫెరినో పుస్తకంలో రికార్డ్ చేశాడు. ఆ సంఘటన 1863 లో ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ కమిటీ (ఐసిఆర్సి) ఏర్పాటుకు ప్రేరణనిచ్చింది. యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకుని వారికి ఆసరాగా నిలవడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థే "రెడ్‌క్రాస్ సొసైటీ". ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సేవా సంస్థలన్నింటిలో అతి పెద్దది. అది మానవతా ఉద్యమంగా రూపు దిద్దుకుంది. అలా ప్రపంచ వ్యాప్తంగా అనేక రకాల సమస్యలతో బాధ పడుతున్న, పేదలను ఆదుకోవాలనే ఉద్దేశం ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవానికి ప్రేరణగా నిలుస్తున్నది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ వ్యవస్థాపకుడు హెన్రీ డునాంట్ మే 08, 1863లో జన్మించారు. ఆయన గౌరవార్థం ఆయన జయంతి రోజున ఈ ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని జరుపు కుంటున్నారు. హెన్రీ డునాంట్ నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కూడా. హెన్రీ డునాంట్,1859 జూన్ 24న వ్యాపారం పని మీద లావర్డి నగరానికి వెళ్ళాడు. ఆ సమయంలో ఫ్రాన్స్ ఆస్ట్రియాల మధ్యన జరుగుతున్న యుద్ధం వల్ల గాయపడిన వేలాది స్త్రీ పురుషులు ప్రథమ చికిత్స లేక మరణించడం చూశాక, హృదయ విదారకమైన దృశ్యం అయన మనస్సులో చెరగని ముద్ర వేసింది. తన స్వంత పని మరచిపోయి ఆపదలోనున్న వారందరికీ సహాయం చేశాడు. యుద్ధం ముగిసాక ఆయన ప్రజలందరికీ ... "యుద్ధాలలో గాయపడిన వారందరికి, తక్కిన వారందరూ సహాయం చేయాలి. ఇది మానవ ధర్మం." అని విజ్ఞప్తి చేశాడు. ఆయన విజ్ఞప్తి ప్రజలందరినీ ఆకట్టుకుంది. 1864లో జెనీవాలో అంతర్జాతీయ సమావేశం జరిగింది. రెడ్ క్రాస్ సంస్థాపనకు 14 దేశాలు తమ అంగీకారాన్ని తెలిపాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత 14 వ అంతర్జాతీయ సదస్సులో అంతర్జాతీయ కమిషన్ శాంతికి ప్రధాన




సహకారిగా రెడ్‌క్రాస్‌ను ప్రవేశ పెట్టింది. టోక్యోలో 1934లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ట్రూస్ సూత్రాలను ఆమోదించారు. అనంతరం రెడ్ క్రాస్ ను వివిధ ప్రాంతాలలో కూడా వర్తింప జేశారు. యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకుని వారికి ఆసరాగా నిలవడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థే రెడ్‌క్రాస్ సొసైటీ. తొలి రోజుల్లో యుద్ధాల్లో గాయపడిన సైనికులకు సేవ చేయడానికి మాత్రమే ఇది పరిమితమై ఉండేది. ఇంచుమించు ప్రపంచంలోని అన్ని దేశాలలోను రెడ్ క్రాస్ శాఖలు, యుద్ధ సమయాలలో, శాంతి కాలం లోను నిర్విరామంగా పనిచేస్తునే ఉంటాయి. జాతి, కుల, మత విచక్షణా భేదం లేకుండా నిస్సహాయులకు ఇది సేవ చేస్తుంది. శాంతి కాలంలో రెడ్ క్రాస్ కార్య కలాపాలు...ప్రథమ చికిత్స, ప్రమాదాలు జరగకుండా చూడడం, త్రాగే నీటిని పరిశుభ్రంగా ఉంచటం, నర్సులకు శిక్షణ నివ్వడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నడపటానికి మంత్రసానులకు శిక్షణ, వైద్య శాలలను స్థాపించడం, రక్త నిధులు సేకరించడం, మొదలైన పనులు చేస్తుంటుంది. 1965 వియన్నాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో, మానవత, నిష్పాక్షికత, సమ తౌల్యత, స్వతంత్రం, వాలంటరీ సేవ, ఐక్యత, విశ్వజనీయత...ఏడు ప్రాథమిక సూత్రాలు ఆమోదింపబడినవి. ఈ సూత్రాలను ఉద్యమం మొత్తంలో అమలు పరచాలని తీర్మానించ బడింది. 1986 లో జరిగిన సదస్సులోనూ మార్పులు చేర్పులు జరిగాయి. 1876 నుండి 1878 వరకూ జరిగిన రష్యా – టర్కీ యుద్ధ సమయంలో ఉస్మానియా సామ్రాజ్యం రెడ్ క్రాస్ కు బదులుగా రెడ్ క్రెసెంట్ ఉపయోగించింది. క్రాస్ గుర్తు క్రైస్తవ మతానికి చెందినదని, దీని ఉపయోగం వలన తమ సైనికుల నైతిక బలం దెబ్బతింటుందని టర్కీ ప్రతిపాదించింది. రష్యా ఈ విషయంలో సంపూర్ణ అంగీకారాన్ని ప్రకటించింది. 1929 జెనీవాలో జరిగిన సదస్సులో 19వ అధికరణ ప్రకారం ఆమోదం పొంది, స్విట్జర్లాండ్ దేశపు జాతీయ జెండాలోని ఎర్రని బ్యాక్‌గ్రౌండ్‌లో తెల్లని క్రాస్ ను తారుమారు చేసి తెల్లని బ్యాగ్‌డ్రాప్‌లో ఎర్రని క్రాస్‌ను లోగోగా ఏర్పరిచారు. అనేక దేశాలలో రానురాను దీని ఉపయోగం సాధారణ మయినది. రెడ్ క్రాస్ ప్రైవేట్ సంస్థ కింద 1863 లో స్థాపించిన, అలాగే 1919 లో స్థాపింపబడిన, అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ (%×జ=జ%), అంతర్జాతీయ రెడ్‌క్రాస్, రెడ్‌క్రెసెంట్ సంఘాల సమాఖ్య, స్విట్జర్లాండ్ లోని జెనీవా నగరంలో ప్రధాన కేంద్రంగా అనుబంధ సంస్థలు పనిచేస్తున్నాయి. హెన్రీ డ్యూనాండ్‌కు 1901లో తొలి నోబెల్ శాంతి బహుమతి లభించింది. రెడ్‌క్రాస్ సంస్థ 1917, 44, 63 సంవత్సరాలలో మూడు సార్లు నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకుంది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్, రెడ్‌క్రెసెంట్ ఉద్యమం ఒక అంతర్జాతీయ మానవతావాద ఉద్యమం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సేవాసంస్థ లన్నింటిలో రెడ్ క్రాస్ సొసైటీ అతి పెద్దది. ఈ సంస్థలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 9.7 కోట్ల మంది సభ్యులు (కార్యకర్తలు) ఉన్నారు. మానవతా వాదాన్ని, మానవుల జీవితాలను, ఆరోగ్యాన్ని కాపాడడానికి అనునిత్యం శ్రమిస్తూ వుంటారు. జాతి, మత, కుల, వర్గ, వర్ణ, వయో భేదాలు లేకుండా సత్సంకల్పంతో పనిచేస్తూ వుంటారు. అత్యవసర పరిస్థితుల నుండి వారి ప్రాణాలను రక్షించడానికి రెడ్ క్రాస్ సంస్థలు ఎంతో కృషి చేస్తాయి. మానవతా దృష్టితో ప్రారంభమైన ఈ రెడ్‌క్రాస్ ఉద్యమంలో నేడు ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొంటున్నాయి. భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ 1920 లో స్థాపించబడి, ఢిల్లీ ప్రధానకేంద్రంగా విశేష సేవలు అందిస్తూ, ప్రజాదరణ పొందుతున్నది. ఇండియన్ రెడ్‌క్రాస్ దేశ వ్యాప్తంగా 700 కి పైగా శాఖల నెట్‌వర్క్‌ను కలిగి ఉన్న స్వచ్ఛంద మానవతా సంస్థ.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# వాడుక భాషను విరివిగా వాడిన మేస్త్రీ తాపీ - మే 8...తాతాజీ తాపీ ధర్మారావు వర్ధంతి



తాపీ ధర్మారావు నాయుడు తెలుగు రచయిత, తెలుగు భాషా పండితుడు, హేతువాది, నాస్తికుడు. ఆంధ్రులకొక మనవి, దేవాలయాలపై బూతుబొమ్మలు ఎందుకు? పెళ్ళి దాని పుట్టు పూర్వోత్తరాలు, రాలూ రప్పలు, రాముడికి సీత ఏమవుతుంది వంటి బహు పాఠక పుస్తకాలు, సాహిత్యాంశాలపై సాహిత్య మొర్మొరాలు, పాతపాళీ, కొత్తపాళీ వంటి గ్రంథాలు, విజయవిలాస కావ్యంపై హృదయోల్లాస వ్యాఖ్య వంటి విభిన్న అంశాలపై రచనలు చేసి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన మాలపిల్ల, రైతుబిడ్డ మొదలైన సినిమాలకు సంభాషణలు రాశారు. తాపీ ధర్మారావు జయంతి సెప్టెంబరు 19 ని "తెలుగు మాధ్యమాల దినోత్సవం"గా కూడా జరుపు కుంటున్నారు. తాపీని గౌరవంగా 'తాతాజీ' అని పిలిచేవారు. సాహిత్యం, సినిమా, పత్రికలు, అధ్యాపకత్వం – ఇన్ని రంగాల్లో ఏకకాలంలో కృషి చేసిన అభ్యుదయవాది తాపీ. పత్రికలలో, సినిమాలలో వాడుక తెలుగు భాష ప్రవేశపెట్టిన ఘనత తాపీ ధర్మారావుకే చెందుతుంది. అభ్యుదయ రచయితల సంఘం తొలి మహాసభలకూ ఆయనే అధ్యక్షుడు. తాపీ ధర్మారావు (సెప్టెంబర్ 19, 1887 – మే 8, 1973) ప్రస్తుతం ఒరిస్సాలో ఉన్న బెర్హంపూరు (బరంపురం) లోని ఒక తెలుగు కుటుంబములో ధర్మారావు నరసమ్మ, అప్పన్న దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్యను శ్రీకాకుళంలో, మెట్రిక్యులేషన్ విజయవాడలో, పర్లాకిమిడిలో ఎఫ్.ఏ. వరకు చదువుకొని మద్రాసులోని పచ్చయప్ప కళాశాలలో చేరారు. చదివే రోజులలో వ్యవహారిక భాషావేత్త అయిన గిడుగు రామ్మూర్తి ఈయనకు గురువు కావటం విశేషం. వీరి అప్పన్న తాత లక్ష్మయ్య కొంతకాలం మిలిటరీలో పనిచేసి, తరువాత తాపీ పనిలో మంచి పేరు తెచ్చుకొన్నారు. అలా శ్రీకాకుళంలో "తాపీ లక్ష్మయ్య" అన్న పేరు స్థిరపడి పోయిందట. అలా వీరి ఇంటిపేరు తాపీ గా మారింది. చిన్నప్పుడు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడి, ఉపాధ్యాయ వృత్తి చేపట్టి, క్రమంగా యెదిగిన వ్యక్తి ఆయన. కల్లికోట రాజావారి కళాశాలలో గణిత ఉపాధ్యాయులుగా పని చేశారు. 1910 ప్రాంతంలో కొందరు మిత్రులతో కలిసి బరంపురంలో వేగుచుక్క గ్రంథమాలను స్థాపించారు. ఇతని తొలి రచన 1911లో 'ఆంధ్రులకొక మనవి' అనే పేరుతో వెలువడింది. పత్రికా నిర్వహణలో ఆయన నేర్పు అనన్య సామాన్యం. 1930 జూన్‌లో జస్టిస్ పార్టీ వారి పత్రిక 'సమదర్శిని'లో సంపాదకులుగా, 1935–'36లో గూడవల్లి రామబ్రహ్మం సారథ్యం లోని 'ప్రజామిత్ర' పత్రికలో రచయితగా, 1936లో పిఠాపురం రాజా పీపుల్స్ పార్టీ పక్షాన నెలకొల్పిన 'జనవాణి'కి ఎడిటర్‌గా పత్రికా రంగానికి తాతయ్య చేసిన సేవ, పెట్టిన ఒరవడి నేటికీ గుర్తు చేసుకుంటారు. ముందు వీర గ్రాంథిక వాదైనా, గిడుగు వారి ప్రభావంతో తర్వాత వ్యావహారిక భాషకు పట్టం కట్టారు. సినీ రచయితగా ఆయన తొలిచిత్రం మోహినీ రుక్మాంగద (1937). ఆ పౌరాణిక చిత్రంలో ఆయన వ్యావహారిక భాషలో సంభాషణలు రాయడం అప్పట్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. 'మాలపిల్ల', 'రోజులు మారాయి' చిత్రాల రచనల్లో ఆయన అభ్యుదయ భావాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. 1937లో సినీరంగం లో అడుగుపెట్టి మొదట మోహినీ రుక్మాంగదకు, చివరగా 1962లో భీష్మ సినిమాకు సంభాషణలు రాశారు. చేమకూర వెంకటకవి విజయవిలాస కావ్యానికి సహృదయోల్లస వ్యాఖ్య రాసి సంప్రదాయ పండితుల ప్రశంసలందు కున్నారు. తాపీ ధర్మారావు మాలపిల్ల (1938) సినిమాకు సంభాషణలు రాయగా, కథ అందించినది గుడిపాటి వెంకటచలం. ఉమ్మడి రాష్ట్రంగా వున్న రోజుల్లో బొబ్బిలి రాజా ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నప్పుడు... ధర్మారావు ఆయన దగ్గర కార్యదర్శిగా పని చేశారు. ఆంధ్ర రాష్ట్ర పత్రికా రచయితల మహాసభ జరిగినప్పుడు ధర్మారావే తొలి అధ్యక్షులు. శృంగేరి పీఠాధిపతులు జగద్గురు చంద్రశేఖర భారతీ శంకరాచార్యుల వారి నుండి 1926లో 'ఆంధ్ర విశారద' బిరుదు, చేమకూరి వెంకటకవి రచించిన 'విజయ విలాసం' కావ్యానికి చేసిన 'హృదయోల్లాస వ్యాఖ్య'కు 1971లో కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారము, మరెన్నో సాహిత్య పురస్కారములు పొందారు. ఆంధ్రులకొక మనవి, దేవాలయాలపై బూతుబొమ్మలు ఎందుకు? 1936, పెళ్ళి దాని పుట్టుపూర్వోత్తరాలు 1960, ఇనుప కచ్చడాలు, సాహిత్య మొర్మొరాలు, రాలూ రప్పలూ, మబ్బు తెరలు, పాతపాళీ కొత్తపాళీ, ఆలిండియా అడుక్కు తినేవాళ్ళ మహాసభ, విజయ విలాసం వ్యాఖ్య, అక్షర శారద ప్రశంస, హృదయోల్లాసము, భావ ప్రకాశిక, నల్లిపై కారుణ్యము, విలాసార్జునీయము, ఘంటా న్యాయము, అనా కెరినీనా, ద్యోయానము, భిక్షాపాత్రము, ఆంధ్ర తేజము, తప్తాశ్రుకణము తదితర రచనలు చేశారు. ధర్మారావు 1973 మే 8న మరణించారు. తెలుగు సినిమా దర్శకులు తాపీ చాణక్య ఆయన కుమారుడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## పచ్చదనం.. పంచాయతీలకు ఆదాయం

మంథని : తడి, పొడి చెత్తను వేరు చేయడంతో పాటు వర్మీ కంపోస్టును తయారు చేసి గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకు ఒంటున్నారు. పల్లెలను పరిశుభ్రంగా ఉంచుతూనే ఇంటి నుంచి సేకరించే చెత్తను వినియోగించి పంచాయతీలకు ఆదాయ వనరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఊరిలో అధికారులు సెగ్రిగేషన్ షెడ్లను ఏర్పాటు చేశారు.

**జిల్లాలో 261 సెగ్రిగేషన్ షెడ్లు**

పెద్దపల్లి జిల్లాలో మొత్తం 266 పంచాయతీలుండగా 261 సెగ్రిగేషన్ షెడ్లు వినియోగంలో ఉన్నాయి. మంథని మండలంలో కొత్తగా ఏర్పడిన తోటగోపయ్యపల్లి, ముత్తారం మండలం జిల్లాలపల్లిలో నిర్మాణాలు జరగలేదు. రామగిరి పెద్దంపేట గ్రామంలోని షెడ్డు సింగరేణి విస్తరణలో పోవడంతో ఉపయోగంలో లేకుండా పోయింది. జిల్లా పాలనాధికారి ఆదేశాలతో వర్మీ కంపోస్ట్ తయారీపై కార్యదర్శులకు అధికారులు విరివిగా అవగాహన కల్పించారు. జిల్లా కేంద్రంలో శిక్షణ అందించారు.

**తయారు చేసే విధానం..**

సెగ్రిగేషన్ షెడ్డులో తడి చెత్తను వేసి వాటికి కొన్ని వానపాములను కలుపుతారు. సుమారు 45 రోజుల నుంచి 60 రోజుల మధ్యలో ఒక విడతగా సేంద్రీయ ఎరువు తయారవుతుంది. రోజూ నీటిని చల్లుతారు.



రెండు నెలల అనంతరం ఎరువును బయటికితీసి ఆరబెట్టి జల్లెడ పడతారు. సంచుల్లో నింపి నిల్వ చేస్తారు. అనంతరం పంచాయతీ ఆధ్వర్యంలోని మొక్కలకు వేస్తారు. అవసరాలకంటే అధికంగా ఉన్నట్లైతే ఇతరులకు విక్రయిస్తారు. జిల్లా వ్యాప్తంగా గతనెల 30 వరకు 487.29 కిలోల ఎరువు తయారు చేశారు. అమ్మకం ద్వారా రూ.72,723ల ఆదాయం సమకూరింది.

**త్వరలో యాప్‌తో రిపోర్టు తయారీ**

నిత్యం అధికారులు, కార్యదర్శులు గ్రామాల్లో పర్యటిస్తూ అవగాహన కల్పిస్తుండటంతో వర్మీ కంపోస్ట్ తయారీకి అనుకూల వాతావరణం ఏర్పడింది. బహిరంగంగా చెత్తను పడేస్తే రూ.500, కాలిస్తే రూ.25 వేల జరిమానా విధిస్తామని ప్రచారం చేశాం. ప్రతి రోజు ఒక ఇంటి నుంచి 300 గ్రాముల చెత్త ఉండేలా చూస్తున్నాం. త్వరలో మొబైల్ యాప్‌తో చెత్త సేకరణ రిపోర్టును రూపొందిస్తాం.వీరబుచ్చయ్య, డీపీవో, పెద్దపల్లి

**50-100 కిలోల చెత్త సేకరిస్తాం**

రోజూ గ్రామంలో 50 నుంచి 100 కిలోల చెత్త సేకరణ జరుగుతుంది. చెత్తను బహిరంగంగా ఎవరు పడవేయకూడదని చాటింపు వేస్తున్నాం. ఇప్పటివరకు 100 కిలోల సేంద్రీయ ఎరువు తయారైంది. గ్రామంలోని మొక్కలకు వినియోగిస్తున్నాం.నరేశ్, కార్యదర్శి, సిరిపురం

**రూ.300-400 వరకు ఖర్చు**

చెత్త సేకరణకు రోజూ రూ.300 నుంచి రూ.400 వరకు ఖర్చవుతుంది. 40 నుంచి 60 రోజుల వ్యవధిలో 110-150 కిలోల సేంద్రీయ ఎరువును తయారు చేస్తున్నాం. ఇప్పటివరకు 110 కిలోలు తయారు చేశాం. 100 కిలోలు విక్రయించాం.వికాస్, కార్యదర్శి, నాగారం

## 'ఆదర్శ'లో అవకాశం..!

కనగల్: కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ విద్యను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను, కళాశాలను తీసుకొచ్చింది. ఆంగ్ల విద్యా బోధనకు అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు రాణిస్తున్నారు. ఈ యేడాది ఆదర్శ విద్యాలయాల్లో మొదటి సంవత్సరం ఇంటర్ ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. ఈనెల 5 నుంచి 20 వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించింది. ప్రస్తుతం పది పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ఇదో చక్కని అవకాశం.

**దరఖాస్తు ఇలా చేయాలి...**

టీఎస్ఆన్‌లైన్ లేదా మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేయాలి. వెబ్‌సైట్ ద్వారా లేదా సమీప ఆదర్శ విద్యాలయ ప్రధానచార్యులను సంప్రదించాలి. అనంతరం దరఖాస్తు కాపీ తీసుకుని ఆయా మండలాల్లో ఆదర్శ బడుల్లో ఇవ్వాలి. ఇంటర్ ప్రవేశాలు పొందిన బాలికలకు వసతి గృహాలు అందుబాటులో ఉన్నాయి.

**కావాల్సినవి...**

విద్యార్థి పాస్ ఫొటో, చిరునామా ధ్రువీకరణ పత్రం, పదో తరగతి హాల్‌టికెట్, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. దీనికి కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పదోతరగతి మార్కుల నకలు పత్రాలను కళాశాలలో అందజేయాల్సి ఉంటుంది. ఓసీ విద్యార్థులకు



రూ.100 బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రూ.50 ఫీజు చెల్లించాలి.

రిజర్వేషన్లు... ప్రతి తరగతిలో 15శాతం ఎస్సీలకు, 6శాతం ఎస్టీలకు 29 శాతం బీసీలకు కేటాయిస్తారు. దివ్యాంగులకు 3శాతం, బాలికలకు 33.33 శాతం కేటాయించారు. నిర్దేశించిన విభాగంలో విద్యార్థులు లేకపోతే ఇతర గ్రూప్‌ల నుంచి భర్తీ చేస్తారు. మిగిలిన 50 శాతం ఇతర కులాలకు నిర్దేశించారు.

**ఎంపికలు:** నల్గొండ జిల్లాలో 31 ఆదర్శ పాఠశాలలున్నాయి. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉంటాయి. ప్రతి గ్రూప్‌నకు 40 సీట్ల చొప్పున నాలుగింటికి 160 మందికి ప్రవేశాలు కల్పిస్తారు. పదిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుంది. ఎంపికలకు ఆదాయ పరిమితి నిబంధన లేకున్నా.. అల్పాదాయ వర్గాల వారికి ప్రాధాన్యం ఇస్తారు.సద్వినియోగం చేసుకోవాలి: థామస్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఇక్కడ ఎలాంటి రుసుములు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా విద్యనందిస్తుంది. మధ్యాహ్న భోజన వసతి, బాలికలకు వసతి గృహంలో మెరుగైన రక్షణ ఉంటాయి. పక్కా భవనాలు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు గ్రంథాలయాలు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఈఏడాది పాఠశాల విద్యార్థి మీనాక్షి ఎంపీసీ విభాగంలో 988/1000 మార్కులు సాధించింది.

# నమూనాకే తాత్సారం.. నిర్మాణానికి ఎంతకాలం?



బొంరాస్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు నీడ కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం అందించే రూ.5 లక్షలతోనే ఇంటిని నిర్మించుకోవచ్చని లబ్ధిదారుల్లో అవగాహన కల్పించడానికి నమూనా ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించింది. ప్రతి మండల కేంద్రంలో వీటి నిర్మాణ పనులను ప్రారంభించారు. నిర్మాణం పూర్తయితే వీటిని చూసి పేదలు అదే నమూనాలో అంతే ఖర్చుతో నిర్మించుకోవచ్చన్నది ప్రభుత్వ ఉద్దేశం. అయితే పనులు మందకొడిగా సాగుతున్నాయి. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళన తప్పడంలేదు.

**గృహ నిర్మాణ శాఖ పర్యవేక్షణ**

జిల్లాలోని 15 మండలాల్లో నమూనా ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. వికారాబాద్ నియోజకవర్గంలో 5, కొడంగల్‌లో 3, పరిగిలో 3, తాండూరులో 3 మండలాల్లో, నవాబ్‌పేటలో 1 ప్రారంభించారు. ఒక్కో నమూనా ఇంటికి రూ.5 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో ఒక పడక గది, హాలు, మరుగుదొడ్డి, స్నానపు గది, మెట్లు నిర్మించాలి. ఆపై రంగులు వేసి విద్యుత్, ఫ్యాన్లు, ఇతర సదుపాయాలు కల్పించాలి. పనులను గృహ నిర్మాణ శాఖ పర్యవేక్షిస్తుంది. నిర్మాణం చేపట్టిన వాటిలో రెండుచోట్ల పునాదుల వరకు, రెండు గోడల వరకు, ఐదు పునాదుల స్థాయిలో ఉన్నాయి.

**పైలట్ గ్రామాల్లోనూ అదే తీరు**

సంక్షేమ పథకాల అమలు కోసం గతంలో ప్రభుత్వం జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున నాలుగు నియోజకవర్గాల్లోని నాలుగు గ్రామాలను పైలట్ గ్రామాలుగా ఎంపిక చేసింది. వీటిలో అర్హులైన 2285 మందికి ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటి వరకు కేవలం 368 ఇళ్లకు మాత్రమే మార్కవుట్ ఇచ్చారు. మిగతా ఇంకా ప్రారంభం కాలేదు.

**ఇదీ పరిస్థితి**

జిల్లాలో చేపట్టిన ఇందిరమ్మ నమూనా ఇళ్లు: 15

చెత్తు వరకు నిర్మించినవి: 2

గోడల వరకు: 2 పునాదులు: 5నిర్మాణమే ప్రారంభం కానివి: 6

లబ్ధిదారులకు చెల్లించిన మొత్తం: రూ.35 లక్షలు

త్వరగా పూర్తి చేస్తాం : కృష్ణయ్య, గృహనిర్మాణ శాఖ పీడీ

జిల్లాలోని 15 మండలాల్లో ఇందిరమ్మ నమూనా ఇళ్ల నిర్మాణం చేపట్టాం. ఇవి వివిధ దశల్లో ఉన్నాయి. లబ్ధిదారులకు అవగాహన కల్పించడానికి చేపట్టిన వీటి నిర్మాణం త్వరగా పూర్తి చేస్తాం. పైలట్ గ్రామాల్లో మంజూరైన ఇళ్ల నిర్మాణం కూడా జరుగుతోంది. నిబంధనల మేరకు లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తున్నాం. నిర్మాణ పనులను వేగవంతం చేస్తాం.

# చెరువు మట్టి చోరీ



కోరుట్ల : కోరుట్ల పట్టణంలోని ప్రధాన నీటి వనరు అయిన తాళ్ల చెరువులో పూడికతీత పేరిట మట్టి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇంత జరుగుతున్నా పురపాలిక, నీటిపారుదల, మైనింగ్‌శాఖ అధికారులు తమకేమీపట్టనట్లు చోద్యం చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 నిధులతో చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ పట్టణ ప్రాంతాల్లోని చెరువులను ఎంపిక చేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 19 చెరువులను పునరుద్ధరించేందుకు గతేడాది జూన్‌లో నిధులు విడుదల చేసింది. కోరుట్ల పట్టణంలోని తాళ్ల చెరువును అభివృద్ధి చేసేందుకు రూ.3.14 కోట్ల నిధులు కేటాయించింది. ఇందుకోసం ఇటీవల రెండుసార్లు టెండర్లు పిలిచిన ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అమృత్ 2.0 పనులు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు.

పట్టణంలోని తాళ్ల చెరువులో పూడికతీతకు బల్దియా అనుమతులు ఉన్నాయంటూ నెల రోజులుగా ఓ వ్యాపారి మట్టి వ్యాపారం చేస్తున్నాడు. చెరువులో బహిరంగంగా యంత్రాలను ఏర్పాటు చేసి నాలుగు, అయిదు అడుగుల మేర మట్టి తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నాడు. ఇప్పటివరకు చెరువులో సుమారు 3-4 ఎకరాల విస్తీర్ణంలో మట్టి తవ్వి తరలించారు. రూ.లక్షల్లో అక్రమ మట్టి వ్యాపారం జరుగుతుంటే బల్దియా అధికారులు చోద్యం చూస్తున్నారు. కొద్దిరోజుల కిందట ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో కొద్దిరోజులపాటు మట్టి తవ్వకం నిలిపివేశారు. మట్టి తవ్వుకునేందుకు రాజకీయ నాయకుల నుంచి ఒత్తిడి రావడంతో పురపాలక సంఘ అధికారులు ఏప్రిల్ 21న చెరువులో పూడిక మట్టిని ఒక క్యూబిక్ మీటర్ మట్టికి రూ.162.56 డీడీ సమర్పించి తీసుకెళ్లాలని ప్రకటన ఇచ్చారు. దీనికి రైతుల నుంచి స్పందన కరవైంది. ఇప్పటివరకు రైతులు ఎలాంటి డీడీలు ఇవ్వలేదని బల్దియా అధికారులు చెబుతున్నారు.

**మైనింగ్ నిబంధనలు ఇలా..**

రోడ్లు, ఇతర కట్టడాలు, నిర్మాణాలకు మట్టి అవసరమున్న వారు ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. తహసీల్దార్, మైనింగ్‌శాఖ నుంచి అనుమతి లభిస్తే టన్నుకు రూ.20, డీఎంఎఫ్‌టీ 30 శాతం, ఐటీ 2 శాతం, ఎస్ఎంటీ 2 శాతం రుసుం డీడీ రూపంలో మైనింగ్‌శాఖకు చెల్లించిన తర్వాత మాత్రమే వారు చూపించిన గుట్టలు, ఇతర మట్టికుప్పల నుంచి తవ్వుకోవాల్సి ఉంటుంది. ఒక ట్రాక్టర్‌కు 5 టన్నులు, ఒక టిప్పర్‌లో 30 టన్నులకుపైగా మట్టి పడుతుంది. చెరువులలో మాత్రం మట్టి తవ్వకాలకు ఎలాంటీ అనుమతులు ఉండవు. పూడికను మాత్రమే రైతులు సంబంధిత బల్దియా, నీటిపారుదలశాఖకు రుసుం చెల్లించి తీసుకెళ్లాల్సి ఉంటుంది. తాళ్ల చెరువులో మట్టి తవ్వకాలపై కమిషనర్ మారుతిప్రసాద్‌ను వివరణ కోరగా పూడిక మట్టి తీసుకెళ్లేందుకు నిర్ణీత రుసుం విధించామన్నారు. రైతుల నుంచి స్పందన తక్కువగానే ఉందని, చెరువులో ఎస్సారెస్పీ నీటిని నింపేందుకు పూడిక తీయాలని నిర్ణయించామన్నారు. డీఈఈ సురేశ్ మాట్లాడుతూ రైతులు పూడిక మట్టిని తీసుకెళ్లాలన్నారు.

తాళ్ల చెరువు

విస్తీర్ణం : 53.30 ఎకరాలు

ఎఫ్‌టీఎల్ : 20.30 మీటర్లు

బఫర్‌జోన్ : 30 మీటర్లు

# నత్తనడకన కొనుగోళ్లు.. వెంటాడుతున్న వర్షాలు

ముత్తారం : ఓవైపు ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం.. మరోవైపు వెంటాడుతున్న అకాల వర్షాలు.. వెరసి ముత్తారం మండల రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. యాసంగిలో వరి పండించడం కన్నా ధాన్యాన్ని అమ్ముకోవడానికే ఎక్కువ కష్టపడాల్సి వస్తోంది. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. అరకొర వసతుల మధ్య మండే ఎండల్లో ఇబ్బందులు పడుతున్నారు.

ముత్తారం మండలంలో ఈ యాసంగిలో 10,200 ఎకరాల్లో వరి సాగు చేశారు. మొత్తం 2.55 లక్షల క్వింటాళ్ల దిగుబడి రానుంది. ఇందులో 25 శాతం విత్తన వరి ధాన్యం పోగా మిగిలిన 1,87,500 క్వింటాళ్ల ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తుందని మండల వ్యవసాయాధికారి అనూష తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలో 9, సహకార సంఘాల ఆధ్వర్యంలో 11 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాదాపు నెల రోజుల కిందట వరి కోతలు ప్రారంభం కాగా అప్పటి నుంచి ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి రైతులు నిరీక్షిస్తున్నారు. లారీలు రాక, హమాలీల కొరతతో లోడింగ్ సమస్య నెలకొంది. తూకం వివరాలను ఆన్‌లైన్ చేయడంలో సిబ్బంది తీవ్ర జాప్యం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కేంద్రాలకు సరఫరా చేసిన సంచులు మొత్తం చిరిగిపోయి ఉండటంతో ధాన్యం పోతోందని చెబుతున్నారు. **రోజుల తరబడి పడిగాపులు**అసలే కొనుగోళు ఆలస్యమవుతుండగా అకాల వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయి. గడిచిన వారం రోజుల్లో రెండు సార్లు ఈదురుగాలులతో కూడిన వర్షంతో కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన ఉగ్గె మల్లక్క, తీర్థాల మల్లయ్యలు 15 రోజుల కిందట ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొచ్చారు. అప్పటి నుంచి తూకం వేయకపోవడంతో వర్షాలకు దాదాపు ఎకరం విస్తీర్ణంలో పండించిన ధాన్యం కొట్టుకుపోయిందని మల్లక్క ఆవేదన వ్యక్తం చేశారు. వర్షానికి తడిసిన ధాన్యం తిరిగి నిర్ణీత తేమ శాతం వచ్చే వరకు రోజుల తరబడి ఆరబోయక తప్పడం లేదని మల్లయ్య వాపోయారు. మండలంలో మార్కెట్ యార్డు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. వర్షానికి ధాన్యం తడవకుండా ఉంటుందని, హమాలీల కొరత లేకుండా సజావుగా కొనుగోళ్లు జరుగుతాయని చెబుతున్నారు. ఇందుకు అవసరమైన స్థలం కూడా దర్యాపూర్ శివారులో అందుబాటులో ఉంది.

**25 రోజుల్లో పూర్తి చేస్తాం** ఈదురుగాలులతో కూడిన వర్షం రెండు సార్లు కురవడంతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. ధాన్యం తడిసి తేమ శాతం రాకపోవడంతో తిరిగి ఆరబెట్టాల్సి వస్తోంది. మిగిలిన ధాన్యాన్ని మరో 25 రోజుల్లో సేకరిస్తాం. ఐకేపీ ఏపీఎం పద్మ, ప్యాక్స్ సీఈవో ప్రసాద్

## వృత్తివిద్య.. ఉపాధికి భరోసా

సూర్యాపేట : ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ తరహాలోనే వృత్తివిద్య (ఒకేషనల్) కోర్సులకు మంచి ఆదరణ ఉంటోంది. ఇంటర్‌లో ఒకేషనల్ కోర్సు పూర్తి కాగానే ఉద్యోగ, ఉపాధిలో రాణించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీంతో ప్రస్తుతం పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఒకేషనల్ కోర్సు చేసుకుంటూనే ఎంపీసీ, బైపీసీ కూడా పూర్తి చేసే అవకాశం ఉంటుంది. వృత్తివిద్యలో పాఠ్యాంశాలు అత్యధికం ప్రయోగాలు ఉండటంతో స్వయంఉపాధికి ఎంతో దోహదం చేస్తుంది. అందులో ఉత్తీర్ణులైన వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉద్యోగవకాశాలున్నాయి. ఏడాది పాటు నెల నెలా వేతనంతో కూడిన అప్రెంటిస్‌షిప్ సౌకర్యం ఉంటుంది. ప్రతి కోర్సులో 50 సీట్లుంటాయి.

**కోర్సులు.. ఉద్యోగ అవకాశాలు ఇలా...**

మల్టీ పర్పస్ హెల్త్ వర్క్: ఈ కోర్సు పూర్తి చేస్తే ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నర్సుగా పనిచేసే అవకాశం ఉంటుంది. సొంతంగా



ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేసుకోవచ్చు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, బీఎస్సీ, బీకాం వంటివి చదువుకోవచ్చు.

డెయిరీ టెక్నాలజీ: ప్రభుత్వ పశువైద్యశాలతోపాటు మదర్ మిల్క్ డెయిరీ, విజయ, హెరిటేజ్ వంటి పరిశ్రమలలో ఉద్యోగ అవకాశం ఉంటుంది. ప్రైవేటు ప్రాక్టీస్‌తో స్వయంఉపాధి పొందనున్నారు. బీఎస్సీ డెయిరీ, బీఎస్సీ, బీఏ, బీకాం చదువుకోవచ్చు. మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్: ల్యాబ్ టెక్నీషియన్‌గా ప్రభుత్వ కొలువులు, మెడికల్ కళాశాలలు, ప్రైవేటు డయాగ్నోస్టిక్ సెంటర్ వంటి ప్రాంతాల్లో ఉద్యోగవకాశాలు ఉన్నాయి. స్వయంగా డయాగ్నోస్టిక్ కేంద్రాలు స్థాపించుకోవచ్చు. బీఎస్సీ ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ కూడా పూర్తిచేయొచ్చు.

ఎలక్ట్రికల్ టెక్నీషియన్: జూనియర్ లైన్‌మెన్, ఎలక్ట్రిసిటీ మెయింటెనెన్స్ ఇంజినీర్స్, సబ్‌స్టేషన్ ఆపరేటర్స్, మోటార్ వైండర్స్ ఉద్యోగం పొందే వీలుంటుంది. ఎలక్ట్రికల్ అప్లియన్సెస్ మాన్యుఫాక్చరర్స్, ఎలక్ట్రికల్ మోటార్స్, జనరేటర్ రిపేరింగ్, అప్లియన్స్ మరమ్మతుల దుకాణాలు స్థాపించే అవకాశం ఉంటుంది. ఎంపీసీ కూడా చదువుకోచ్చు.

ఫిజియోథెరపీ: ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో కొలువులు ఉండే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ప్రైవేటుగా ఫిజియెథెరపిస్ట్ ఆసుపత్రి ఏర్పాటు చేసుకోచ్చు. కంప్యూటర్ సైన్స్: ప్రోగ్రాం, కంప్యూటర్ ఆపరేటర్, డాటా ప్రాసెసింగ్, ప్రాజెక్ట్ రిపోర్టర్‌గా ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. కంప్యూటర్ సర్వీసింగ్ సెంటర్, కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ ఉపాధి రంగాల్లో రాణించే అవకాశం ఉంటుంది.

**అవగాహన కల్పిస్తున్నాం: భానునాయక్, డీఐఈవో, సూర్యాపేట**

పది పూర్తయిన విద్యార్థుల వద్దకు వెళ్లినప్పుడు ఒకేషనల్ విద్యపై కూడా అవగాహన కల్పిస్తున్నాం. అందులో లభించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై వివరించేలా అధ్యాపకులకు సూచించాం. ఈసారి ఒకేషనల్ కోర్సులో విద్యార్థులు అధికంగా చేరేలా ప్రచారం చేపడుతున్నాం.

## 'ఆయు'ష్..!

ఆలేరు : దేశీయ ప్రాచీన వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా.. నిర్వహణ కొరవడి కేంద్రాలకు చికిత్స అందించాల్సిన పరిస్థితి నెలకొంది. యాదాద్రి జిల్లాలో ఆయుష్ డెస్పెన్సరీలు మొక్కుబడిగా కొనసాగుతున్నాయి. 8 కేంద్రాలను పీహెచ్‌సీల్లోని ఒక గదిలో మండల వైద్యాధికారి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల వైద్యులు లేరు.. సరైన వసతులు చాలా చోట్ల లేవు. రూ.లక్షల వ్యయంతో నిర్మించిన యోగా మందిరాలు నిరుపయోగంగా ఉన్నాయి. 12 రెగ్యూలర్ ఆసుపత్రుల్లో ఒక్కోటి రూ.6 లక్షలతో షెడ్లు నిర్మించారు. ఒక్కో కేంద్రానికి ఒక మగ, ఒక ఆడ శిక్షకులను నియమించారు మూడు చోట్ల ఆరుగురు శిక్షకులు లేరు. భువనగిరి పట్టణంలో 10 పడకల హెూమియో ఆసుపత్రి కొనసాగుతుంది.

**ఫార్మాసిస్టే అన్నీ**

రాజపేటలోని యునాని ఆసుపత్రిని పీహెచ్‌సీ భవనంలోని ఓ గదిలో నిర్వహిస్తున్నారు. మూడు పోస్టులున్నప్పటికీ వైద్యాధికారి, ఫిమేల్ నర్స్



పోస్టులు బదిలీ కావడంతో ఏడాదిగా భర్తీ చేయలేదు. ఫలితంగా ఫార్మాసిస్ట్ అన్నీ చూసుకుంటున్నారు. స్వీపర్‌కూడా లేరు. రోజుకు 20 మంది వరకు రోగులు వస్తుంటారు. యోగా కేంద్రానికి శిక్షకులను నియమించక ప్రస్తుతం ఆసుపత్రి వర్గాలు నెలవారీ సమావేశాలు నిర్వహించుకుంటున్నారు.

**అలంకార ప్రాయం**

ఆత్మకూరు(ఎం)లోని ఆయుర్వేద వైద్యశాలకు రోజు 30 నుంచి 40 మంది వస్తుంటారు. ఆయుర్వేద వైద్యాధికారి, ఫార్మసిస్ట్, అటెండర్ విధులు నిర్వహిస్తున్నారు. యోగా శిక్షణకు ఆవరణలో రూ.6 లక్షలతో 2023 ఏప్రిల్‌లో షెడ్డు నిర్మించారు. శిక్షకుడి కోసం నోటిఫికేషన్లు వేసినా ఎవరూ ముందురాలేదని వైద్యాధికారి జయశ్రీ తెలిపారు.

**పది నెలలుగా మూత**

ఆలేరు మండలం కొలనుపాకలోని హెూమియో డిస్పెన్సరీ 40 ఏళ్లుగా సేవలు అందిస్తోంది. ఆలేరు, జనగామ, బచ్చన్నపేట మండలాలకు చెందిన వారు ఇక్కడికి వచ్చి వైద్యసేవలు పొందేవారు. నిత్యం వంద మంది రోగులు వస్తుంటారు. వైద్యురాలు డాక్టర్ లలిత పదోన్నతిపై గత ఏడాది జులైలో మేడ్చల్ జిల్లాకు బదిలీ అయ్యారు. నాటి నుంచి నేటి వరకు డిస్పెన్సరీ తెరచుకోలేదు. హెూమియో మందులకు అలవాటు పడిన వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**త్వరలో ఖాళీల భర్తీ : బూక్యా రవినాయక్, ప్రాంతీయ ఉప సంచాలకులు, ఆయుష్**

జిల్లాలోని నాలుగు డిస్పెన్సరీల్లో వైద్యులు లేరు. త్వరలో నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. రెగ్యులర్ ఆయుష్ డిస్పెన్సరీలకు అనుసంధానంగా యోగా కేంద్రాలను నిర్మించాం. యోగా కేంద్రాల్లో శిక్షకుల నియామకం చేపడతాం. మందుల కొరత లేదు.

# సహజ ప్రసవాలకు ప్రాధాన్యం

సిరిసిల్ల : గర్భిణులకు తొలి కాన్పులో సహజ ప్రసవాలను పెంచేందుకు వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ చేస్తున్న ప్రయత్నంలో ఒక ముందడుగు పడింది. దీనికోసం ప్రయోగాత్మకంగా 2017 నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లోని నర్సులకు ప్రైవేటు కళాశాలల్లో ప్రత్యేకంగా మిడ్‌వైఫరీ శిక్షణ ఇచ్చారు. వీరు ఆసుపత్రుల్లో స్త్రీ వైద్యనిపుణులతో కలిసి సహజ ప్రసవాలు చేయడంతో మంచి ఫలితాలు వచ్చాయి. ప్రభుత్వమే పూర్తిస్థాయిలో ఈ శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించింది. దీనికోసం టీజీఎన్ఎంసీ (రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్) రెండేళ్లుగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. రాష్ట్రంలో మిడ్‌వైఫరీ శిక్షకు అనువుగా ఉన్న కళాశాలలు, వాటిలోని వసతులను ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో రెండు సార్లు తనిఖీ చేశారు. గతేడాది ఐఎన్‌సీ (ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్) సిరిసిల్ల, సికింద్రాబాద్, హైదరాబాద్ కళాశాల్లో శిక్షణకు అనుమతినిచ్చింది. ఇవి మూడు వరంగల్ కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్‌సైన్స్‌కు అనుబంధంగా గుర్తింపు లభించింది. ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

**18 నెలల పాటు..**

హైదరాబాద్‌లోని ఫెర్నాండేజ్ నర్సింగ్ కళాశాలలో మాత్రమే మిడ్‌వైఫరీలకు శిక్షణ ఇచ్చేవారు. ప్రభుత్వమే ఈ శిక్షణను అందించేందుకు ప్రణాళికలు చేసింది. దానిలో భాగంగా కోర్సుకు అవసరమైన పాఠ్యాంశాల ప్రణాళికను రూపొందించారు. కాగా శిక్షణనిచ్చేందుకు



నిపుణుల కొరత ఉంది. దీనికోసం ఇప్పటికే మిడ్‌వైఫరీ శిక్షణ పూర్తిచేసుకున్న వారు హైదరాబాద్ నర్సింగ్ కళాశాలలో బోధకులుగా శిక్షణనిస్తున్నారు. సికింద్రాబాద్, సిరిసిల్లలో మిడ్‌వైఫరీలకు శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు.

బీఎస్సీ నర్సింగ్, డిప్లొమా పూర్తిచేసుకుని వృత్తిలో రెండేళ్ల అనుభవం ఉన్నవారు శిక్షణకు అర్హులు. ఒక్కో కళాశాలలో 30 మంది శిక్షణ ఇచ్చే అవకాశం ఉంది. నర్సింగ్ విధుల్లో ఉన్నవారికి వేతనంతోపాటు ప్రత్యేకంగా 18 నెలల శిక్షణ కాలానికి ఉపకార వేతనం అందజేస్తారు. : కళాశాలల్లో శిక్షణకోసం ప్రత్యేకంగా రెండు తరగతి గదులు, వసతిని సమకూర్చారు.

**శస్త్రచికిత్సలకు అడ్డుకట్ట**


ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల కోసం నమోదు చేయించుకునేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రసవ కోతలు (సిజేరియన్)జిల్లాలో 71 శాతం ఉండగా ప్రైవేటు ఆసుపత్రుల్లో 89 శాతం సిజేరియన్లు జరుగుతుండటం ఆందోళన కలిగించే విషయం. వీటివల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం పెరుగుతోంది. ప్రభుత్వాసుపత్రుల్లో సహజ ప్రసవాలను ప్రోత్సహించడం ద్వారా శస్త్రచికిత్సలకు అడ్డుకట్ట వేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసమే నర్సింగ్ కళాశాలల్లో ప్రత్యేకంగా మిడ్‌వైఫరీ శిక్షణకు ప్రభుత్వం సిద్ధమైంది. దీనికి ప్రవేశపరీక్షల్లో అర్హత సాధించిన వారికి ప్రవేశాల కోసం ముఖాముఖి జరుగుతోంది. త్వరలోనే సిరిసిల్ల నర్సింగ్ కళాశాలలో మిడ్‌వైఫరీలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

# పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు

ఎల్లారెడ్డిపేట : యాసంగి సీజన్‌లో వరి సాగుచేసిన రైతులు కోతలు ముగించుకొని ధాన్యాన్ని విక్రయించేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రా లకు తరలిస్తున్నారు. ఎండల తీవ్రత కారణంగా తూకాల్లో జాప్యం చోటుచేసుకుంటోంది. దీంతో కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. మరోవైపు తూకం వేసిన ధాన్యం బస్తాలను రైస్‌మిల్లులు, గోదాంలకు తరలించడంలోనూ ఆలస్యమవుతోంది. జిల్లాలో ఈనెల 3 వరకు రూ.205.96 కోట్ల విలువైన 88775.01 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. అందులో నుంచి 4870.84 మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాలను మిల్లులు, గోదాంలకు తరలించారు. 917 మంది రైతులకు రూ.10.09 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు.

**లక్ష్యం నెరవేరేనా!**

జిల్లాలో యాసంగి సీజన్‌లో 1,78,350 ఎకరాల్లో రైతులు వరిపంట సాగుచేశారు. ఇందులో 17505 ఎకరాల్లో సన్నరకాలున్నాయి. 402112 మెట్రిక్ టన్నుల దొడ్డురకం, 36760 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. దీనిప్రకారం జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేసి, అత్యధిక కేంద్రాలను ఐకేపీ మహిళా సంఘాలకు కేటాయించారు. సుమారు 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని లక్ష్యంగా పెట్టుకు న్నారు. అయితే అకాల వర్షాల భయంతో ఇప్పటికే చాలా మంది రైతులు దొడ్డు రకం ధాన్యాన్ని నేరుగా మిల్లర్లకు విక్రయించారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తుండటంతో ఎక్కువ శాతం సన్నరకాలను కొనుగోలు కేంద్రాలకు తరలించారు. అనేక కేంద్రాల్లో నిబంధనల మేరకు తేమశాతం రావడంతో



కుప్పగా పోసి, వాటిపై ప్లాస్టిక్ కవర్లను కప్పి ఉంచారు. తమవంతు క్రమ సంఖ్య కోసం నిరీక్షిస్తున్నారు. ఇటీవల జిల్లాలో ఎండల తీవ్రత పెరిగిపోయింది. మధ్యాహ్నం సమయంలో ధాన్యం తూకం వేయడం, లారీల్లో చేర్చడం హమాలీ కూలీలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ నేపథ్యంలో ఉదయం, సాయంత్రం, రాత్రి సమయాల్లో మాత్రమే వారు పనిచేయాల్సి వస్తోంది. అత్యధిక మంది రైతులు తక్కువ ధరకే ధాన్యాన్ని మిల్లర్లకు అమ్మడం వల్ల ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ లక్ష్యం నెరవేరుతుందా అనేది ప్రశ్నార్థకమే. ఆకాశం మేఘావృతం కావడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంటోంది.

**సేకరించిన సన్నరకం వడ్లు 369.30 మెట్రిక్ టన్నులు**

జిల్లాలో ధాన్యం సేకరణకు 246 కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రతిపాదించి, 244 కేంద్రాలను ప్రారంభించారు. అందులో 240 కేంద్రాల ద్వారా 88405.71 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం, 369.30 మెట్రిక్ టన్నుల సన్న వడ్లను సేకరించారు. 2955 మంది రైతులకు సంబంధించి రూ. 43.58 కోట్ల విలువైన 18784.52 మెట్రిక్ టన్నుల ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. 21 శాతం ఆన్‌లైన్ నమోదు, 45 శాతం ట్రక్‌షీట్ అందజేత ప్రక్రియలను పూర్తిచేశారు. అకాల వర్షాలు పొంచి ఉన్న ప్రస్తుత తరుణంలో కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం కుప్పల తూకాలు, బస్తాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేస్తే అన్నదాతలకు మేలు చేకూరనుంది.

# ఇంకేం చేద్దాం.. ఇంకిద్దాం



హైదరాబాద్: నగరంలో భూగర్భ జలాలు వేగంగా పడిపోతుండటమే కాకుండా నీరు ఇంకే పరిస్థితులు తగ్గుముఖం పడుతున్నాయి. మరోవైపు వర్షాకాలంలో భూమిలో ఇంకే జలాల శాతం తక్కువగా ఉండటం సమస్య తీవ్రతను మరింత పెంచుతోంది.

**ఇంకుడుగుంతలపై నిర్లక్ష్యం**

భవనాలు లేదా అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం పూర్తయిన తర్వాత నగరపాలక సంస్థ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చే ముందు విధిగా ఇంకుడు గుంత నిర్మాణం చేశారా? లేదా? అని పరిశీలించాలి. దీంతో సంబంధం లేకుండానే సర్టిఫికెట్‌ను జారీ చేస్తున్నారు. గతేడాది సెప్టెంబరులో జలమండలి 300 చదరపు మీటర్లు అంతకంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న 42,784 నివాసాలను తనిఖీ చేసింది. ఇందులో సగం ఇళ్లలోనూ ఇంకుడు గుంతలు లేవని గుర్తించారు.

గ్రేటర్ పరిధిలో నైరుతి రుతుపవనాల్లో సాధారణ వర్షపాతం 615.4 మిల్లీమీటర్లు కాగా ఈ సారి 825.5 మి.మీ.లు. కురిసింది. 30 శాతానికిపైగా సాధారణం కంటే ఎక్కువ వర్షం కురిసినా జనవరి నుంచే జలాలు అడుగంటాయి.

**నిర్వహణ లేక నిరుపయోగంగా మారి**

ఐదు నుంచి పదేళ్ల కిందట ఏర్పాటు చేసుకున్న ఇంకుడుగుంతలను పునర్నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని భూగర్భజల శాఖ అధికారులు సూచిస్తున్నారు. చాలాచోట్ల ఇవి మట్టి, ఇతర వ్యర్థాలతో ఆనవాళ్లు లేకుండాపోయాయి. గతంలో పార్కులు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో ఇంకుడు గుంతలను భారీగా ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణను పూర్తిగా విస్మరించడంతో అవి కూడా పూడిపోయి నిరుపయోగంగా మారాయి.

**వీరే ఆదర్శం..**నగరంలో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకున్న కాలనీల్లో భూగర్భజలాలు పెరిగి వేసవిలోనూ బోర్లలో నీరు పుష్కలంగా ఉండటం గమనార్హం. నగరంలో కొండాపూర్‌లోని గౌతమి ఎన్‌క్లేవ్, ముషీరాబాద్‌లోని పద్మశాలీ కాలనీలే ఇందుకు నిదర్శనం. కాలనీవాసులు ఇంకుడుగుంతల ఏర్పాటుపై కొన్నేళ్ల క్రితం చేపట్టిన కార్యక్రమం చక్కటి ఫలితాలను ఇస్తోంది.

# ఆహ్లాదం ఆవిరి.. నిర్వహణ గాలికి



హైదరాబాద్: గ్రేటర్‌లో పార్కుల నిర్వహణ అధ్వానంగా మారింది. నీటి వసతి లేక మొక్కలు ఎండుతున్నాయి. విరిగిన కుర్చీలు, పిల్లల ఆట వస్తువులు, కాలిబాటలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. పచ్చదనం, బోరుబావుల పేరుతో పలువురు అధికారులు ప్రజాధనాన్ని దోచేస్తున్నారు. ఫలితంగా.. కాలనీ పార్కులు, రెండు ఎకరాల విస్తీర్ణానికి మించిన ఉద్యానాలు వెలవెలబోతున్నాయి. కాలనీ సంఘాల నిర్వహణలోని పార్కులనూ సమస్యలు వెంటాడుతున్నాయి. ఇంత జరుగుతున్నా.. బల్దియా కేంద్ర కార్యాలయం నిద్రమత్తు వీడట్లేదు. ఉన్నతాధికారులు కాలక్షేపానికే పరిమితమవుతున్నారనే విమర్శలొస్తున్నాయి.

మల్కాజిగిరి సర్కిల్ జ్యోతినగర్‌లో సుమారు రూ.3.75లక్షల జీహెచ్ఎంసీ నిధులతో 2016లో అన్ని హంగులు సమకూర్చుకున్న ఉద్యానం నేడు నిర్వహణ లోపంతో కొట్టుమిట్టాడుతోంది. దాదాపు 350 గజాల స్థలంలో జీహెచ్ఎంసీ, ఉద్యానశాఖ విభాగం అధికారులు దీనిని సుందరంగా తీర్చిదిద్దారు. చిన్నారులు ఆడుకునేందుకు పరికరాలు ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం అవన్నీ విరిగిమూలన పడ్డాయి.

కూకట్‌పల్లిలోని రంగధాముని చెరువు కట్టపై రూ.9.50కోట్లతో అభివృద్ధి చేసిన పార్కు ప్రధాన ద్వారం గేటు మాయమైంది. లోపల విద్యుత్ దీపాల ఫ్యూజ్‌బాక్సులకు మూతలు లేక ప్రమాదక పరిస్థితులు నెలకొన్నాయి. మొక్కలు, పచ్చనిగడ్డి ఎండిపోతోంది. హెచ్ఎండీఏ అధికారులు సర్కిల్ యూబీడీ వారికి అప్పగించడంతో నిర్వహణ గాలికొదిలేశారు. బాలాజీనగర్‌లోని మహిళా, పిల్లల పార్కులో వ్యాయామ పరికరాలు ఒక్కొక్కటిగా పడకేస్తున్నాయి.

రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లి పెద్దతాళ్లకుంట పార్కును 2016లో రూ.63 లక్షలతో అభివృద్ధి చేశారు. మొక్కలు నాటారు. వాకింగ్ ట్రాక్, విద్యుద్దీపాలు పెట్టారు. అధికారులు ఒకవైపు పూర్తిగా అభివృద్ధి చేయడానికి యత్నించగా స్థల సమస్య ఏర్పడింది. దీంతో అభివృద్ధికి నోచుకోలేదు. గతంలో పెట్టిన దీపాలు పాడైపోయాయి.

ఏఎస్‌రావునగర్ డివిజన్ జమ్మిగడ్డ బీజేఆర్ కాలనీ పార్కు అస్తవ్యస్తంగా మారింది. అర ఎకరంలో దీన్ని ఏర్పాటు చేశారు. కనీసం నడకదారులు, దీపాలు, మరుగుదొడ్లు, బోరు సౌకర్యం, మొక్కలూ నాటలేదు. స్థానికులు చెత్తను రిక్షాకు వేయకుండా పార్కులో వేస్తున్నారు. డంపింగ్ యార్డుల తయారైంది. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.

సనతనగర్‌లోని ఎస్ఎన్ఆర్ పార్కు దారుణంగా ఉంది. ఆహ్లాదంగా కనిపించాల్సిన ఈ ఉద్యానంలో ప్రస్తుతం కాలు మోపే అవకాశం లేకుండా పోయింది. పార్కులో ఊడ్చిన చెత్తను అక్కడే కుప్పగా పోస్తున్నారు. చేతిపంపు పాడైపోయింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ఉద్యానంలో ఎక్కడ చూసినా మద్యం సీసాలు కనిపిస్తున్నాయి.ఆసిఫ్‌నగర్ జిర్రా రోడ్డులోని హుడాకాలనీ(సీటీ డైమండ్ హోటల్ వెనక) ఉద్యానం గతంలో పచ్చదనంతో కళకళలాడేది. ప్రస్తుతం నిర్వహణ లేక ఎండిపోయింది. కొందరు పార్కు స్థలాన్ని కబ్జాకు యత్నించగా.. స్థానికుడు అడ్డుకొని కాపాడారు. చుట్టూ ప్రహరీ నిర్మించి, మొక్కలు నాటి, బెంచీలు ఏర్పాటు చేశారు. పార్కు స్థలంపై కన్నేసిన కొందరు మొక్కలు తొలగించి పనిచేయకుండా చేశారు.

నగరంలో జీహెచ్ఎంసీ నర్సరీలు: 600

కాలనీ పార్కులు: 1032

రెండెకరాలకు మించినవి: 19

ట్రీ పార్కులు: 528

**కేటాయింపులే**

బడ్జెట్‌లో ఏటా రూ.350కోట్ల మేర హరిత పద్దుకు కేటాయింపు జరుగుతోంది. ఆర్థిక సంవత్సరం చివర్లో.. జరిగిన ఖర్చులు చూస్తే రూ.90కోట్లకు మించట్లేదు. రెవెన్యూ వ్యయంలో కనీసం 10శాతం నిధులు ఖర్చు చేయాలని మున్సిపల్ చట్టం చెబుతుండగా.. జీహెచ్ఎంసీ 3-4శాతం నిధులనే వెచ్చిస్తోంది.

**నిధుల దుర్వినియోగం**

పార్కుల్లో మొక్కలు నాటడానికి నర్సరీల నిర్వహణ పేరుతో రూ.కోట్లు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మూణ్నాళ్లకే వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట వస్తువులు, ఓపెన్ జిమ్ పరికరాలు దెబ్బతింటున్నాయి. ఆరున్నర అంగుళాల వ్యాసంతో 800 అడుగుల లోతున బోరుబావి తవ్వేందుకు బల్దియా రూ.7లక్షల నుంచి రూ.8లక్షలు ఖర్చు చేస్తోంది. మార్కెట్లో దాని విలువ రూ.4 లక్షలు. చెట్లకు ట్యాంకర్లతో నీరు పడుతున్నామని, మరమ్మతుల పేరుతో కొందరు అధికారులు ప్రజాధనాన్ని దోచేస్తున్నారు.

# సుందరయ్య 'విజ్ఞాన' కేంద్రం

హైదరాబాద్: నగరంలోని బాగ్‌లింగంపల్లిలో ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య జ్ఞాపకార్థంగా 1988లో ఆయన పేరు మీదుగా సుందరయ్య విజ్ఞాన కేంద్రాన్ని(ఎస్వీకే) స్థాపించారు. ఆనాటి నుంచి ఈ కేంద్రంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. కాలక్రమేణా నగరంలోని యువత, మహిళలకు పలు కోర్సులు, నృత్యం, సంగీతం, చేతిరాతలో మెరుగుదల, గణితాన్ని సులభంగా చేయడం, సంభాషణా చాతుర్యం, మ్యాజిక్ లాంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఆయా కోర్సులకు నెలకు నామమాత్ర రుసుం చెల్లించి, నగరంలోని యువత సద్వినియోగం చేసుకోవచ్చని ఎస్వీకే మేనేజర్ రమణారావు సూచించారు.

**గ్రంథాలయం:** విద్యార్థులు ప్రశాంతంగా చదువుకోవడానికి కేంద్రంలో విశాలమైన గ్రంథాలయం అందుబాటులో ఉంది. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువత, విద్యార్థులు ఉచితంగా చదువుకోవచ్చు.

కూచిపూడి నృత్యం: ఆసక్తి ఉన్న బాలలకు కూచిపూడి నృత్యం నేర్పుతారు. నాలుగేళ్లు నుంచి పన్నెండేళ్ల వయసు వారు అర్హులు. శాస్త్రీయ సంగీతంపైనా తర్ఫీదునిస్తారు. వేసవి సెలవుల్లో కూచిపూడి నృత్యం కోసం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తారు.

జూట్ బ్యాగులు కుట్టడం: ప్లాస్టిక్ సంచులు పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో ఇక్కడ జూట్ బ్యాగులు కుట్టడంపై శిక్షణ ఇస్తారు. వ్యవధి మూడు నెలలు.

టైలరింగ్ : స్థానిక మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఇది మధ్యాహ్నం 1.30 నుంచి 3.30 గంటలకు వరకు ఉంటుంది.



బ్యూటీషియన్ శిక్షణ : మహిళల కోసం బ్యూటీషియన్ శిక్షణలో ప్రాథమిక అంశాలపై ఇక్కడ శిక్షణ ఇస్తారు. 3 నెలల కాలవ్యవధి ఉంటుంది. ఇందులో ఐబ్రోస్, మెహందీ, పెడిక్యూర్, ఫేషియల్, మేకప్ తదితర వాటిపై నిపుణుల ద్వారా శిక్షణ ఇస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నేర్చుకోవచ్చు.

పిల్లలకు సమ్మర్ క్యాంపులు: వేసవి సెలవుల్లో పిల్లలు చరవాణి చెరలో చిక్కుకోకుండా సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు సోమయ్య తెలిపారు. పిల్లలకు సైన్స్ ప్రయోగాలు, నాటకాలు, కథలు చెప్పడం, భాషా నైపుణ్యం లాంటి 8అంశాలను నేర్పిస్తారు.

# సేవల్లో కూర్పు కరవు

వెల్గటూరు : పరిపాలన సౌలభ్యం కోసం కొత్త మండలాల ఏర్పాటు ఆ మూడు గ్రామాలకు కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. ఆయా గ్రామస్థులు రెండు జిల్లాలు.. మూడు మండలాల పరిధిలో సేవలు పొందుతూ రెండున్నరేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పోలీస్‌స్టేషన్ దూరంగా ఉండటంతో తక్షణ సేవలు పొందలేని పరిస్థితి నెలకొంది. దీంతోపాటు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో తంటాలు తప్పడం లేదు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని ముంజంపల్లి, మారేడుపల్లి,

**ఆరేళ్లలో రెండు సార్లు మార్పు**

2016లో జిల్లాల పునర్విభజనప్పుడు వెల్గటూరు మండలంలోని ముంజంపల్లి, మారేడుపల్లి, ఉండెడ గ్రామాలను విడదీసి కొత్తగా ఏర్పాటు చేసిన పెద్దపల్లి జిల్లాలోని పాలకుర్తి మండలంలో కలిపారు. అన్ని సర్దుకునేలోపే 2022లో మరోసారి కొత్త మండలాల ఏర్పాటు.. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా ఈ మూడు గ్రామాలను తిరిగి జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలో చేర్చారు. దీంతో సమస్యలు తలెత్తుతున్నాయి.

**పోలీసు సేవలకు దూరాభారం**

ఆ మూడు గ్రామాలు వెల్గటూరు నుంచి పాలకుర్తి మండలంలో చేరిన తర్వాత పోలీస్‌స్టేషన్ పరిధి బసంత్‌నగర్‌లోకి వచ్చింది. వెల్గటూరు



పోలీస్‌స్టేషన్ సుమారు 15 కి.మీ దూరంలో ఉండగా ఈ మార్పుతో 25 కి.మీ దూరాభారం పెరిగింది. కేసులు నమోదైతే గోదావరిఖని, పెద్దపల్లి న్యాయస్థానాలకు వెళ్లాల్సి వస్తోంది. కొత్తగా ప్రతిపాదించిన ఎండపల్లి ఠాణాను త్వరగా ఏర్పాటు చేస్తే కేవలం 10 కిలోమీటర్ల లోపే పోలీస్ సేవలు అందుబాటులోకి వస్తాయి. పైగా ధర్మపురి, మేడారం న్యాయస్థానాలకు దీని పరిధి మారడం వల్ల మెరుగైన రవాణా సౌకర్యంతో ఇబ్బందులు తీరే అవకాశం ఉంది.

**రెండు జిల్లాలు.. మూడు మండలాలతో సతమతం**

ఉపాధిహామీకి సంబంధించి సేవలు పాలకుర్తిలోనే కొనసాగుతున్నాయి. దీంతో కూలీలకు ముందస్తు పనుల గుర్తింపునకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ గ్రామాల పంచాయతీ కార్యదర్శులను పెద్దపల్లి జిల్లాలో సర్దుబాటు చేసుకున్నారు. దీంతో ఎండపల్లి మండల పరిధిలోని కార్యదర్శులకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఏడాదిలో ముగ్గురు కార్యదర్శులు మారడం వల్ల గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రతిబంధకాలు ఏర్పడుతున్నాయి. స్వశక్తి మహిళా సంఘాలకు సంబంధించి పనులకు పాలకుర్తికి వెళ్లాల్సి వస్తుంది. సెర్ప్‌లో విభజన జరగకపోవడం వల్ల అక్కడే సేవలు కొనసాగుతున్నాయి.

మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు పాత మండలం నుంచే జరుగుతున్నాయి. కానీ నివేదికలు మాత్రం రెండు మండలాలకు పంపించాల్సిన పరిస్థితి. యూడైస్ పరంగా పెద్దపల్లి జిల్లా పరిధిలోనే ఉండటం వల్ల పాఠశాల నిర్వహణ గ్రాంటులు మంజూరులో జాప్యం జరిగి ఒకే విడత నిధులు వచ్చాయి. రామగుండం ఎస్టీవో పరిధిలో ఉండటం వల్ల ఉపాధ్యాయుల జీతాలకు సంబంధించి 2024 ఏప్రిల్‌లో ఆడిటర్ మ్యాపింగ్ జరిగే వరకు హైదరాబాద్ ట్రెజరీల ద్వారా సమస్య పరిష్కరించుకోవాల్సి వచ్చింది.రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల సమయంలో సైతం ఈ గ్రామాలకు బ్యాంకుల ఎంపిక విషయంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ చొరవతో సమస్య పరిష్కారం అయింది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఈ మూడు గ్రామాల్లో జాప్యం జరిగింది. చివరికి ఎండపల్లి అధికారులు ప్రక్రియ పూర్తి చేశారు.

# 42 ఏళ్ల కల సాకారం..!

నల్గొండ : ఎలిమినేటి మాధవరెడ్డి ఎస్ఎల్‌బీసీ(ఏఎమ్మార్పీ) ప్రాజెక్టు కాలువ లైనింగ్‌కు మోక్షం లభించింది. 42 ఏళ్ల పోరాట ఫలితం కాల్వ కాంక్రీటు లైనింగ్ నిర్మించాలని ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా రూ.442 కోట్ల నిధులను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రభుత్వ యంత్రాంగం పనులు ప్రారంభించేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.

**కాలువ లైనింగ్‌కు నిధులు మంజూరు**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలైన 516 గ్రామాలకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో నలభై ఏళ్ల కిందట అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎలిమినేటి మాధవరెడ్డి ఎస్ఎల్‌బీసీ(ఏఎమ్మార్పీ) ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయించింది. పుట్టగండి నుంచి 136 కి.మీ. మేర ప్రధాన కాల్వ తవ్వించారు. కానీ ప్రధాన కాల్వకు లైనింగ్ నిర్మించకపోవడంతో నీరు భారీగా వృథా అవుతోంది. కాల్వకు ఇరువైపులా ముళ్ల పొదలు ఏపుగా పెరిగి, గట్లు కోతకు గురై చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. దీనిని అధిగమించేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఏటా లైనింగ్ నిర్మించాలని



ప్రభుత్వాలకు ప్రతిపాద నలు పంపిస్తున్నా ప్రాధాన్యం ఇవ్వకపోడంతో ప్రాజెక్టు పరిధిలోని రైతులు ఆందోళన చెందారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించారు. కాల్వకు 112.65కి.మీ. మేర ఇరువైపులా కాంక్రీటు లైనింగ్ నిర్మాణానికి ప్రభుత్వాన్ని ఒప్పించి నిధులు విడుదల చేయించారు. వారి చొరవతో 42ఏళ్ల కల సాకారం కానుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. **టెండర్ల ప్రక్రియకు కసరత్తు**జిల్లాలో కీలకమైన ఏఎమ్మార్పీ కాల్వ లైనింగ్ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికారులు ముమ్మరం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో టెండర్ల ప్రక్రియ ప్రారంభించేందుకు కసరత్తు ప్రారంభించారు. సాధ్యమైనంత వరకు ఈ ఏడాదిలోనే కాంక్రీటు పనులు పూర్తి నీటి వృథాను నివారించి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని ప్రయత్నాలు ప్రారంభించారు.

# అంతా బాధ్యులే.. అన్నీ బాధలే..!

భువనగిరి : ప్రభుత్వ సంక్షేమశాఖల పాలన ఏళ్లతరబడి ఇన్‌ఛార్జి అధికారులతో కొనసాగుతోంది. బీసీ సంక్షేమశాఖ మినహా అన్ని శాఖలకు పలువురు అధికారులు అదనపు బాధ్యతలతో పనిభారం మోస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, గిరిజన, మైనార్టీ సంక్షేమశాఖల పరిధిలోని వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, కళాశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇన్‌ఛార్జులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులు నిర్ణీత వ్యవధిలో అందుబాటులో లేకపోవడంతో ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఉపకార వేతనాలు, ఇతర పాలనాపరమైన పనులు కుంటుపడుతున్నాయి. సేవలు, పనుల్లో జాప్యం పర్యవేక్షణ లోపంతో పాలనపై పరోక్ష ప్రభావం పడుతోంది. గిరిజన సంక్షేమశాఖ పరిధిలో ఎనిమిది వసతి గృహాలు, ఒక ఆశ్రమ పాఠశాల ఉంది. ఆయా వసతి గృహాలు, పాఠశాలల్లో 520 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. 11 మంది బోధన, 52 మంది బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. సంక్షేమ అధికారిగా పనిచేస్తున్న మంగ్తానాయక్ 2022లో ఏసీబీకి పట్టుబడటంతో నాటి నుంచి నేటి వరకు విడతల వారీగా డీఆర్‌డీవో నాగిరెడ్డి ఇన్‌ఛార్జిగా పనిచేశారు. మండది ఉపేందర్‌రెడ్డి, కృష్ణన్ తదుపరి మళ్లీ నాగిరెడ్డి ఇన్‌ఛార్జిగా



వ్యవహరిస్తున్నారు. మైనార్టీ సంక్షేమశాఖ అధికారిగా 2016 నుంచి నవంబరు 2022 వరకు సత్యనారాయణ పనిచేశారు. ప్రస్తుతం బీసీ సంక్షేమశాఖ అధికారి యాదయ్య ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. శాఖ పరిధిలో ఆలేరు, భువనగిరి, చౌటుప్పల్‌లో మైనార్టీ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో వెయ్యి మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. బోధన సిబ్బంది 120 మంది, బోధనేతర సిబ్బంది 30 మంది వరకు ఉన్నారు.

ఎస్సీ సంక్షేమశాఖకు ప్రస్తుతం ఏఎస్‌డబ్ల్యూవో ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 19 ఎస్సీ వసతి గృహాలు, రెండు కళాశాల వసతి గృహాలు పనిచేస్తున్నాయి. 19 వసతి గృహాల్లో 1127 మంది విద్యార్థులు, రెండు కళాశాల వసతి గృహాల్లో 263 మంది విద్యార్థులు ఉన్నారు. 11 మంది వార్డెన్లు, 85 మంది బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. రామారావు, జైపాల్‌రెడ్డి రెగ్యులర్ జిల్లా అధికారులుగా పనిచేశారు. రామారావు తదుపరి ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన సజ్జన్ కుమార్ రెండు పర్యాయాలు, బాలసింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, జడ్పీ డిప్యూటీ సీఈవో విష్ణువర్ధన్‌రెడ్డి ఇన్‌ఛార్జులుగా పనిచేయడం గమనార్హం. ప్రస్తుతం ఏఎస్‌డబ్ల్యూవోగా పనిచేస్తున్న వసంతకుమార్ ఇన్‌ఛార్జిగా ఉన్నారు.

# పంట పండింది.. గల్లాపెట్టె నిండింది

ఆదిలాబాద్ : ఉమ్మడి జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు భారీగా జరగడంతో ఉమ్మడి జిల్లాలోని పలు మార్కెట్లలో లక్ష్యానికి మించి ఆదాయం సమకూరింది. గతేడాది మార్కెట్లవారీగా ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.48.62 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించగా మార్చి 31 నాటికి రూ.60.90 కోట్లు వసూలయ్యాయి. ప్రైవేటు వ్యాపారులతోపాటు ప్రభుత్వరంగ సంస్థలు సైతం విక్రయాలు జరపడంతో మార్కెట్ ఫీజుల రూపంలో మార్కెట్లకు భారీగా ఆదాయం చేకూరింది.ఉమ్మడి జిల్లాలో 18 మార్కెట్లు ఉన్నాయి. ఈ ఏడాది ప్రైవేట్‌లో పత్తికి మద్దతు ధర కంటే తక్కువగా ఉండటంతో 25 కేంద్రాలు ఏర్పాటు చేసి సీసీఐ పత్తిని కొనుగోలు చేసింది. పత్తి తర్వాత ఎక్కువగా సోయా, కందులు, శనగ తదితర వాటిని మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. వరి పంటకు బోనస్ ఇవ్వడంతో రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పంట విక్రయించారు.

**రికార్డుస్థాయిలో 65.65 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు**

ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు ఎక్కువగా ఉంటుంది. గతేడాది 10.30 లక్షల ఎకరాల్లో పత్తి సాగుకాగా రికార్డు స్థాయిలో విక్రయాలు



జరిగాయి. గతంలో 46.88 లక్షల క్వింటాళ్ల పత్తి విక్రయాలుకాగా ఈ ఏడాది ప్రైవేట్, సీసీఐ కలిపి 65.65 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశాయి. మరోవైపు పంట ఉత్పత్తుల ధరలు ఎక్కువగా ఉండటంతో ఆదాయం ఎక్కువ మొత్తంలో సమకూరింది. మార్కెట్లలో జరిగిన విక్రయాల్లో సగానికిపైగా ఆదాయం పత్తితో వచ్చింది.

ఉమ్మడి జిల్లాలో అయిదు మార్కెట్లకు కలిపి రూ.19.57 కోట్ల ఆదాయం వస్తే అందులో ఆదిలాబాద్ మార్కెట్‌కు రూ.11.59 కోట్ల ఆదాయం వచ్చింది. జైనథ్ మార్కెట్‌కు రూ.1.60 కోట్లు లక్ష్యంకాగా రూ.1.25 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. నిర్మల్ జిల్లా పరిధిలో అయిదు మార్కెట్లు ఉండగా ఇక్కడ పత్తితోపాటు సోయా, మొక్కజొన్న, కంది పంటల విక్రయాలు జరుగుతాయి. భైంసా మార్కెట్‌లో పత్తి విక్రయాలు ఎక్కువగా జరుగుతుండటంతో మార్కెట్‌కు రూ.6.49 కోట్ల ఆదాయం వచ్చింది. మంచిర్యాల జిల్లాలో అయిదు మార్కెట్లు ఉండగా రూ.8.73 కోట్ల లక్ష్యం నిర్దేశించగా రూ.13.18 కోట్ల ఆదాయం సమకూరింది. అత్యధికంగా చెన్నూరు మార్కెట్‌కు రూ.6.20 కోట్ల ఆదాయం వచ్చింది. కుమురంభీం జిల్లా పరిధిలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, జైనూర్ మార్కెట్లు ఉన్నాయి. ఆసిఫాబాద్‌లో పత్తితోపాటు ఇతర పంట ఉత్పత్తుల విక్రయాలు ఎక్కువగా ఉండటంతో మార్కెట్ ఆదాయం రూ.7.21 కోట్లు వచ్చింది. జైనూర్‌లో లక్ష్యం మేరకు ఆదాయం రాలేదు.

# ఉపాధి కూలీలకు వసతులు కరవు



గంగాధర : జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో పని ప్రదేశాల్లో ఉపాధి కూలీలకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికార యంత్రాంగం కనీస వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చూపుతుంది. ప్రస్తుతం జిల్లాలో సుమారు 15 వేల మంది పనులకు హాజరవుతున్నారు.

**ఎండదెబ్బతో ముప్పు**

జిల్లాలో ఆయా గ్రామాల్లోని పని ప్రదేశాల్లో వడదెబ్బ తగిలి ఏటా ఆరెడుగురు మృత్యువాత పడుతున్నారు. మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానుంది. అప్పుడు కూలీల సంఖ్య ఒక్కసారిగా పెరుగుతోంది. ఉపాధి కూలీలు భోజనం చేయడానికి, అలసటగా ఉన్నప్పుడు సేద తీరడానికి ప్రభుత్వం గతంలో గుడారాలు (టెంట్లు)పంపిణీ చేసేది. ఏడేళ్ల నుంచి వాటి పంపిణీ పక్కన పెట్టింది. ఈ సారైనా వాటిని అందిస్తే కూలీలకు ఉపశమనం కలుగుతుంది.

**ఇంటి నుంచే తాగునీరు**

పని ప్రదేశాల్లో తాగునీటి సదుపాయం లేక ఇళ్లనుంచే నీటి డబ్బాలు వెంట తెచ్చుకుంటున్నారు. మరికొందరు తడారిన గొంతులతో తల్లడిల్లుతున్నారు. పని ప్రదేశాల్లో నేల గట్టిగా ఉండటంతో.. భూమిని తడిపేందుకు ట్యాంకర్లతో నీరు పట్టే వెసులుబాటు ఉంటున్నప్పటికి అలా చేయడం లేదు. పదేళ్లుగా పనిముట్లు అందించడం లేదు. దీంతో కూలీలే ఎవరికి వారు పనిముట్లు తెచ్చుకుంటున్నారు.

**అందుబాటులో లేని చికిత్స కిట్లు**

పనులు చేసే సమయంలో కూలీలకు గాయాలు జరిగిన సందర్భంలో ప్రాథమిక చికిత్స కిట్లు సమకూర్చాలి. కిట్‌లో అయోడిన్, బ్యాండేజి, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, కొన్ని రకాల మాత్రలు అందుబాటులో ఉంచాలి. ఎనిమిదేళ్లుగా వీటి పంపిణీ నిలిచిపోయింది. ఎండలు తీవ్రమైన వెంటనే గుడారాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో అధికారులు పేర్కొన్నారు.

జిల్లాలో వివరాలు ఇలా..

గ్రామ పంచాయతీలు: 313మొత్తం జాబ్ కార్డులు: 1,24,002 నమోదైన కూలీలు: 2,32,569100 రోజుల పనిదినాలు పూర్తి చేసిన కుటుంబాలు: 3268

# భూసేకరణతో సరి.. పరిశ్రమల ఏర్పాటేదీ?




సిరిసిల్ల : ఎక్కడైనా పరిశ్రమలు స్థాపించాలంటే భూసేకరణ పెద్దసవాలు.. చాలాచోట్ల భూముల లభ్యత లేక ప్రభుత్వాలకు ఇబ్బందులు తప్పడం లేదు. గంభీరావుపేట మండలం నర్మాల, దేశాయిపల్లి గ్రామాల్లో 2019లో పరిశ్రమల ఏర్పాటుకు 410 ఎకరాలు సేకరించారు. ఆహారశుద్ధిలో భాగంగా భారీ పరిశ్రమలు. 150 ఎకరాల్లో ఎంఎస్ఎంఈలో వ్యవసాయ అనుబంధ రంగాలకు ఉపయోగపడేలా ప్లాట్లు చేశారు. పరిశ్రమలు నెలకొల్పితే.. జిల్లాలో పంటల సాగులో వైవిధ్యం నెలకొంటుంది. సాగులో నూతన ఒరవడి ప్రారంభమవుతుందని అందరూ భావించారు. పరిసర గ్రామాల్లోని యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని భావించారు. కాగా ఆరేళ్లలో ఒక్క పరిశ్రమ మాత్రమే ఏర్పాటైంది. మరో రెండు పరిశ్రమలు భూకేటాయింపులకే పరిమితమయ్యాయి. ప్రారంభించిన ఒక్క ఆహారశుద్ధి పరిశ్రమలో దానికి తగిన విద్యార్హతలు.. నైపుణ్యాలు లేవంటూ యువతకు ఉపాధి అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

**ప్రభుత్వం దృష్టి సారిస్తేనే..**

నర్మాల, దేశాయిపల్లి గ్రామాల్లో వ్యవసాయ భూమి తక్కువ. పరిశ్రమలతోనైనా ఉపాధి లభిస్తుందని స్థానికులు ఉన్న కాస్తభూమిని ప్రభుత్వానికి అప్పగించారు. వారు పరిహారం అందజేసి చేతులు దులుపుకొన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇక్కడి పరిశ్రమల ఊసే లేకుండా పోయింది. గత ప్రభుత్వ హయాంలో మూడు పరిశ్రమలు ఎంవోయూ చేసుకుంటే ఇక్కడి మాత్రమే నిర్మాణం పూర్తిచేసింది. మరికొన్ని పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వంతో ఒప్పందదశలోనే ఉండిపోయాయి. ప్రభుత్వం మారడంతో రూ.10కోట్లతో టీజీఐఐసీ ఆధ్వర్యంలో మౌలిక వసతుల కల్పన మినహా పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియ అటకెక్కింది.

**ఊసేలేని నైపుణ్య శిక్షణకేంద్రం**

జిల్లాలో ఆహారధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతోంది. ఆయా రంగాలకు అవసరమైన నిపుణులు అవసరం. గతంలో జిల్లా యువతకు ఇక్కడ విస్తరించబోయే వివిధ రకాల పరిశ్రమల్లో పనిచేసేందుకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. పరిశ్రమల స్థాపన జరగకపోగా నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు ఊసేలేకుండా పోయింది.

**ఆరేళ్లలో ఒక్కటే ప్రారంభమైంది**

ఇదివరకు మా తాత చిన్నతనంలోనే ఎగువమానేరు జలాశయంలో భూములు కోల్పోయాము. ఉన్న కొద్ది భూమిలోనే వ్యవసాయం చేసుకుంటున్నాం. పరిశ్రమలు ఏర్పాటైతే ఉద్యోగ అవకాశాల్లో గ్రామస్థులకే తొలి ప్రాధాన్యమని చెప్పారు. ఆరేళ్లుగా ఒక్క పరిశ్రమనే ఏర్పాటు చేశారు. పరిశ్రమల రాకకోసం చాలా మంది యువకులు ఎదురుచూస్తున్నారు. ఎడబోయిన రాజు, నర్మాల

**పదిగుంటలు వచ్చే పరిస్థితిలేదు**

ప్రభుత్వం సేకరించిన భూములకు ఎకరానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పరిహారం చెల్లించింది. పక్కగ్రామాల్లో భూములు కొందామంటే ఈ డబ్బులతో పది గుంటలు కూడా వచ్చే పరిస్థితిలేదు. ఇప్పటికే చాలా మంది వీటిని సొంత ఖర్చులకు వాడుకున్నారు. గ్రామంలో సాగుభూమి తగ్గింది. పనులకోసం పక్కగ్రామాలకు వెళున్నారు. గొర్రె దేవరాజు, నర్మాల

# మాధ్యమాలపై.. పోలీస్ నిఘా..!


నాంపల్లి : గతంలో చేతి గడియారం ధరిస్తే గంభీరంగా ఉండేది. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఆభరణంగా మారింది. ఆదే సమయంలో సామాజిక మాధ్యమాల వినియోగం పెరిగింది. వాస్తవం తెలుసుకోకుండా ఇష్టారీతిన పోస్టులు పెడుతుండటంతో విభేదాలు ఏర్పడి గొడవలు జరుగుతున్నాయి. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల పోస్టుల కారణంగా పల్లెల్లో శాంతి భద్రతల సమస్య ఏర్పడే అవకాశం ఉంది. దీనిపై నిర్ధారణకు వచ్చిన పోలీసులు కట్టడికి కార్యాచరణ రూపొందించారు. గ్రామాల్లో నిఘా నిమిత్తం 'వాట్సాప్' తదితర సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో సాధారణ వ్యక్తుల మాదిరి నమోదవుతున్నారు.

**తప్పుడు పోస్టులపై చర్యలు..**

అసత్యాల ప్రచారం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెట్టే వారికి పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇటీవల నల్గొండ జిల్లాలోని ఓ కేంద్రం నుంచి పదో తరగతి ప్రశ్నపత్రం బయటికి వచ్చిన కేసులో పలువురిపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేసిన విషయం విధితమే. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో జరగని ఘటనలు జరిగినట్టుగా పోస్టులు పెడుతున్న వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించారు. తీరు మారకపోతే చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

**'వీపీవో'ల నియామకాలు..**

క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ఘటనలు తెలుసుకోవడం, ప్రజలతో మమేకమయ్యే ఉద్దేశంతో జిల్లా పోలీస్ బాస్ వీపీవో (విలేజ్ పోలీస్



ఆఫీసర్) వ్యవస్థను పునరుద్ధ రించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని గ్రామాల్లో వీపీవోల నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. వీరికి నేరాల నియంత్రణతో పాటు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలకు అడ్డుకట్ట వేసే బాధ్యతనూ అప్పగిస్తున్నారు. దీనికి తోడు సైబర్ నేరాలపై గ్రామీణులకు అవగాహన కల్పించే బాధ్యతనూ అప్పగించింది. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల అడ్మిన్‌లు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది.

# కుంటాలలో.. కుంటుపడిన అభివృద్ధి

ఇచ్చోడ : జిల్లాలోని కుంటాల జలపాతం రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందింది. చుట్టూ అడవి అందాల నడుమ జాలువారే జలపాత దృశ్యాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తాయి. కానీ ఇక్కడ పర్యాటకులకు సరైన వసతులు లేవు. సమస్యలు పరిష్కరిస్తే మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుంది.

నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతానికి తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర నుంచి పర్యాటకులు వస్తారు. మహాభారత కాలంలో కుంతిదేవి అరణ్యమార్గంలో విహారయాత్రకు వచ్చిన క్రమంలో ఇక్కడే కొద్దిరోజులు గడిపిందని, ఆ క్రమంలో ఇక్కడ శివలింగంను ఏర్పాటు చేసి పూజలు చేసినట్లు ఇక్కడి ప్రజలు కథలుగా చెప్పుకొంటారు. ఈ క్రమంలో ఈ జలపాతంపేరు కుంతాల నుంచి కుంటాలగా మారిందంటారు.

**ఇవి చేస్తే మరింత ఆదాయం**

దశాబ్దాలుగా ఇక్కడి అభివృద్ధికి నిధుల కేటాయింపు కోసం ప్రతిపాదనలు పంపిస్తుండగా కాగితాలకే పరిమితమైపోతున్నాయి. జలపాతాన్ని దగ్గరి నుంచి వీక్షించేందుకు తీగల వంతెన ఏర్పాటుతో పాటు జలపాతం కింది భాగంలో ఆనకట్ట ఏర్పాటు చేసి బోట్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాలను కోరినా నేటికీ ఆ దిశగా అడుగులు పడటం



లేదు. వీటి నిర్మాణం పూర్తయితే పర్యాటకుల తాకిడి పెరగడంతోపాటు జిల్లాకు ఆదాయ వనరు పెరిగే అవకాశం ఉంది. గతంలో పలు సినిమా షూటింగ్‌లు సైతం ఇక్కడ జరిగాయి.

**సమస్యలు ఇవి..**

రెండేళ్ల క్రితం గుడారాలను ఏర్పాటు చేసినా ఆశించిన ప్రయోజనం చేకూరలేదు. గతేడాది రూ.3.81 కోట్లతో రిసార్ట్ మంజూరైంది. ప్రస్తుతం పనులు కొనసాగుతుండగా ఈ ఏడాది వినియోగంలోకి తీసుకువస్తే పర్యాటకులకు ఇబ్బందులు తీరే అవకాశం ఉంది.

ఇక్కడికి వచ్చేవారు జలపాతం అందాలను వీక్షించేందుకు దాదాపు 400 మెట్లు కిందకి దిగి వెళ్లాలి. కింది భాగంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు, వస్త్రాలను మార్చుకునేందుకు గదులను ఏర్పాటు చేయాలి. తాగు నీటి సౌకర్యం కల్పించాలి.

మెట్ల మార్గంలో వెళ్లే క్రమంలో వర్షం కురిస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంకేతాలు అందకపోవడంతో ఎలాంటి సమాచారం బయటకు అందే పరిస్థితి లేదు. పైన ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు సైతం అధ్వానంగా ఉండగా వీటిని వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలి.

# రూ. 7కోట్ల వ్యయం.. నిర్వహణ అధ్వానం

మంచిర్యాల : మంచిర్యాల పట్టణంలో రెండేళ్ల కిందట అప్పటి మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సుందరీకరణ పేరుతో ఏర్పాటు చేసిన పార్కుల నిర్వహణ లేక ఆ నిధులు మట్టిపాలయ్యాయి. ప్రజలకు ప్రయోజనం కలిగించే అభివృద్ధి పనులు చేయకుండా కమీషన్లకు కక్కుర్తిపడి సుందరీకరణ పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వినవస్తున్నాయి. పాతమంచిర్యాల, హైటెక్‌సిటీ, రాంనగర్, రెడ్డికాలనీలో పార్కులు నిర్మించి అందులో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో కొన్ని చోట్ల ఓపెన్ జిమ్‌లు నిర్మించారు. ఆ పార్కుల్లో పూల మొక్కలు, ఆకర్షణీయమైన మొక్కలు పెంచకపోవడంతో అందులో గడ్డి ఏపుగా పెరిగి సందర్శకులకు ఆహ్లాదం అందకుండా పోయింది. రాముని చెరువు కట్టపై సుందరీకరణ, రాజీవ్‌నగర్, గర్మిళ్లలో చేపట్టిన పార్కులు నిర్మాణం మధ్యలోనే ఆపేశారు. జిల్లా కేంద్రంలో అప్పుడు రూ.7 కోట్ల వ్యయంతో ఏడు పార్కులు నిర్మాణం చేపట్టినా అందులో ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తేవాలని నగరవాసులు కోరుతున్నారు.

మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో రెండేళ్ల కిందట పార్కు ఏర్పాటు చేశారు. అక్కడి మున్సిపల్ లేఔట్ స్థలంలో రూ.60 లక్షలతో వాకింగ్



ట్రాక్, పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. పూల మొక్కలు కూడా నాటలేదు.వాచ్‌మెన్ గదికి, చుట్టూ గోడకు మరమ్మతులు చేసి రంగులు వేశారు. ఆ పార్కు నిర్వహణపై నగరపాలక సంస్థ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అందులో గడ్డి పెరిగింది.

పాతమంచిర్యాలలోని మున్సిపల్ లేఔట్ స్థలంలో రెండేళ్ల కిందట రూ.90 లక్షలతో పార్కు నిర్మించారు. అందులో టైల్స్‌తో వాకింగ్ ట్రాక్‌లు, ఓ వాచ్‌మెన్ గది నిర్మించారు. పూల మొక్కలు కూడా నాటలేదు. గతంలో పెద్ద చెట్లు పెంచారు. వాటి ఆకులు ఎండి వాకింగ్ ట్రాక్‌పై పడి అపరిశుభ్రంగా ఉన్నా శుభ్రం చేయడం లేదు. నగరపాలక సంస్థ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అందులో అన్ని పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. నడకమార్గంలో టైల్స్ అక్కడక్కడ కుంగిపోయాయి. అందులో మరో రూ.10 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. వాటి పరికరాలు కొన్ని ఊడిపోయినా అధికారులు మరమ్మతులు చేయించడం లేదు.

# అకాల వర్షం.. అపార నష్టం

చిత్తూరు : ప్రకృతి వైపరీత్యాలు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి.. వేసవి వచ్చిందంటే ఈదురు గాలులు ఎప్పుడు వీస్తాయోనన్న భయం వెంటాడుతోంది.. అసలే ఈ ఏడాది మామిడి పూత ఆలస్యం.. ఆపై అంతంత మాత్రంగానే మామిడి పంట.. కాయలు పక్వానికి వచ్చేదశ.. మరో నెలరోజుల్లో చేతికొచ్చే సమయంలో పెనుగాలుల వర్షంతో తోటల్లోని పంట నేల రాలడంతో ఉద్యాన రైతులకు తీరని నష్టం వాటిల్లింది.

**550 టన్నులు నేలపాలు**

జిల్లాలో గాలివాన బీభత్సానికి చిత్తూరు గ్రామీణ మండలం, యాదమరి, గంగాధరనెల్లూరు, పెనుమూరు, తవణంపల్లె, బంగారుపాళ్యం తదితర



ప్రాంతాల్లో 550 టన్నుల కాయలు నేల రాలినట్లు ఉద్యానశాఖ అంచనా. గాలుల తీవ్రతకు 10–15 ఏళ్ల వయసుగల చెట్లు సైతం కూలిపోయినట్లు చిత్తూరు గ్రామీణ మండలం సిద్ధంపల్లెకు చెందిన ఉద్యాన రైతు సాంబశివనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా వందకు పైగానే మామిడి చెట్లు కూలిపోయాయని అధికారులు చెబుతున్నారు.

**టన్ను రూ.5 వేలు..:** రాలిన మామిడి కాయలను రైతులు ట్రాక్టర్లు తదితర వాహనాల్లో పెద్దఎత్తున చిత్తూరు మామిడి యార్డుకు తరలించారు. టన్ను రూ.5 వేలకు వ్యాపారులు కొనుగోలు చేశారని, కనీసం కూలి, రవాణా ఖర్చులు రాలేదని రైతులు వాపోతున్నారు.

**ఈదురు గాలుల వర్షబీభత్సం**

జిల్లాలో ఈదురుగాలుల వర్షం కురిసింది. చిత్తూరు నగరంలోని పలు పాంతాల్లో చెట్లు కూలిపోవడం, విద్యుత్తు లైన్లు తెగిపోవడంతో రాకపోకలు, విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నగర వీధులు జలమయమయ్యాయి. శనివారం రాత్రి జిల్లాలోని నాలుగు మండలాల్లో అకాల వర్షం కురిసింది. వెదురుకుప్పం మండలంలో 17.4 మి.మీటర్లు, పులిచెర్ల 11.2, సదుం 5.2, రొంపిచెర్ల మండలంలో 1.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

**నేలకూలిన 15 విద్యుత్తు స్తంభాలు**

చిత్తూరు నగరంలో 15 విద్యుత్తు స్తంభాలు నేలకూలాయి. సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తక్షణమే ఈఈ మునిచంద్ర పర్యవేక్షణలో సరఫరా పునరుద్ధరించారు.

# మట్టి వేసి.. కనికట్టు చేసి

నంద్యాల : నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి, ప్రకాశం, నెల్లూరు జిల్లాల తాగు, సాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు చెన్నై నగరవాసుల దాహార్తి తీర్చే వెలుగోడు జలాశయం నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇటీవల చేసిన పనుల్లో నాణ్యత కరవైంది. పైపైన చేసి మమ అనిపించేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరవైందన్న విమర్శలున్నాయి. వెలుగోడు జలాశయాన్ని దశాబ్దాల కిందట 476 హెక్టార్లలో 16.323 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఒక్క పైసా కేటాయించ లేదు. కనీసం నిర్వహణ నిధులు కూడా మంజూరుచేయకపోవడంతో నిర్వహణ అధ్వానంగా మారింది. 11.64 కి.మీ పొడవున్న ఆనకట్టపై అడుగడుగునా గుంతలు పడ్డాయి. కంపచెట్లు ఏపుగా పెరిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం కొంతమేర నిధులు కేటాయించింది. పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో నాసిరకంగా జరిగాయి. ఫలితంగా నిధులు ఖర్చయినా ప్రయోజనం లేకపోయిందన్న విమర్శలున్నాయి.

**ప్రమాదకరంగా మారి..** జలాశయం కట్టపై 3.2 కి.మీ నుంచి 11 కి.మీ వరకు గుంతలు పూడ్చేందుకు వేసిన మట్టి ఇటీవల కురిసిన వర్షాలకు చాలాచోట్ల జారిపోయి గుంతలు పడ్డాయి. కట్ట 4.5–5.2 మీటర్ల వెడల్పు ఉండగా కొన్నిచోట్ల 3.5 మీటర్ల వరకే మట్టి వేశారు. దీంతో కట్టకు ఒకవైపు ప్రయాణించాలంటే ప్రమాదకరంగా మారింది. కొన్నిచోట్ల కోతకు గురైంది. కొన్నిచోట్ల ముళ్లపొదలను తొలగించకుండా తగులబె ట్టారు. రాతికట్టలోకి వెళ్లిన చెట్ల వేర్లను పూర్తిగా తొలగించకుండా వదిలేశారు.

**కొన్నాళ్లకే నాణ్యత జారి..**

జలాశయం కట్టపై వాహనాలు తిరిగేందుకుగాను రహదారి ఏర్పాటుకు నిధులు అవసరమని ప్రతిపాదించారు. కట్టపై గుంతలు పడ్డాయి. 0.3 కి.మీ నుంచి 0.6 కి.మీ వరకు మొరుసుతో గుంతలు పూడ్చి చదును చేయడంతోపాటు మట్టి పేర్చే పనులకు ఎస్‌డీఎంఎఫ్ కింద రూ.19 లక్షలు మంజూరయ్యాయి. 3.2 కి.మీ నుంచి 11 కి.మీ వరకు పడిన గుంతలను పూడ్చడంతో పాటు కంపచెట్లు తొలగించేందుకు రూ.9 లక్షలు ఇచ్చారు. రెండు ప్యాకేజీలుగా చేసి రూ.28 లక్షల అంచనాతో చేపట్టి మార్చిలో ప్రారంభించి పూర్తి చేశారు. కట్టపై వేసిన మట్టి అప్పుడే కిందకు జారిపోతుండటం గమనార్హం.

**రూ.21 లక్షలే మంజూరు** జలాశయం కట్ట పటిష్టత, నిర్వహణకు రెండు ప్యాకేజీల కింద రూ.28 లక్షలు మంజూరు చేసినట్లు దస్త్రాలు చెబుతున్నా విడుదలైంది మాత్రం రూ.21 లక్షలే. మొదటి ప్యాకేజీలో భాగంగా రూ.19 లక్షలు మంజూరు చేసినా జీఎస్టీ, సీనరేజీ ఛార్జీలు, మినరల్ ఫండ్ తదితరాలు పోగా రూ.14 లక్షలు మాత్రమే గుత్తేదారుకు చెల్లించారు. రెండో ప్యాకేజీలో రూ.9 లక్షలు మంజూరైనా వాస్తవంగా వచ్చింది రూ.7 లక్షలే. రూ.28 లక్షలకు ప్రతిపాదించి రూ.21 లక్షలు మాత్రమే మంజూరు చేయడంతో పనుల నాణ్యతపై ప్రభావం చూపింది.**కానరాని పర్యవేక్షణ**

స్పిల్‌వే గేట్ల మరమ్మతులు, నీటి నియంత్రణ పనులు, గేర్ బాక్సులు మార్చేందుకు మరో రూ.35 లక్షలు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఈ పనులు జరుగుతున్నాయి. గత కొన్నేళ్లుగా స్పిల్‌వేకు సంబంధించి గేర్ బాక్సులు సరిగా పనిచేయడం లేదు. వాటిని మార్చేందుకు వైకాపా ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. ప్రస్తుతం నిధులు వచ్చినా పనులపై సరైన పర్యవేక్షణ కరవైంది. గతంలో ఇదే ప్రాంతంలో ఆనకట్ట తెగిపోయింది. మరోవైపు 1ఆర్ తూము వద్ద తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. వీటిని నియంత్రించేందుకు ప్రస్తుతం రూ.10 లక్షలు విడుదల చేశారు. కట్టకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలంటే పెద్ద మొత్తంలో నిధులు అవసరమవుతాయి. ప్రస్తుతం కొంతమాత్రమే ఇచ్చారు. ఈ పనులు సైతం నాసిరకంగా జరుగుతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# నడిరోడ్డుపై విగ్రహాలు.. అరచేతిలో ప్రాణాలు



కొత్తచెరువు : నడిరోడ్డుపై విగ్రహాలు ప్రజలకు దినదినగండంగా మారుతున్నాయి. ప్రయాణ సమయంలో పెనుముప్పుగా పరిణమిస్తున్నాయి. వాటిని తగిలి చాలామంది గాయాలపాలవుతున్నా అధికారులు తీసేయకుండా మొద్దునిద్ర వీడటం లేదు. కొత్తచెరువులో ప్రధాన రహదారి మధ్యలో ఎలాంటి అనుమతులు లేని విగ్రహాలు పెనుముప్పులు తెచ్చిపెడుతున్నాయి. పుట్టపర్తికి చెందిన విద్యార్థిని సాయివర్షిణి ఆదివారం నీట్ పరీక్ష రాయడానికి బస్సులో అనంతపురం వెళుతూ విగ్రహం దిమ్మె తగిలి తీవ్రంగా గాయపడిన ఘటన పలువురిని తీవ్రంగా కలచివేసింది. ఇరుకు రహదారుల్లో విగ్రహాలున్న ప్రదేశాల్లో అప్రమత్తత చర్యలు తీసుకోవాలనే హెచ్చరికల ఆవశ్యకత చెప్పకనే చెబుతున్నాయి. అనంతపురం, కదిరి, హిందూపురం, గోరంట్లకు వెళ్లే మార్గాలు కొత్తచెరువులో కలుస్తాయి. నిత్యం ఈ కూడలి మీదుగా వాహనాల రద్దీ ఉంటుంది. నడిరోడ్డులో ఏర్పాటు చేసిన విగ్రహాలు ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారాయి. ఎటువైపు నుంచి వచ్చినా మండల కేంద్రంలో దాదాపు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు ప్రయాణించాల్సి ఉంది. ఐదారు దశాబ్దాల కిందట నాలుగు రోడ్లు కలిసే చోట కూడలిలో నెహ్రూ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ధర్మవరం రోడ్డులో రెండు, పుట్టపర్తి రోడ్డులో రెండు, బుక్కపట్నం రోడ్డులో మూడు విగ్రహాలను నడిరోడ్డుపై దిమ్మెలు నిర్మించి ఏర్పాటు చేశారు. వీటికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులు కనీసం స్పందించకపోవడం గమనార్హం. మూడు దశాబ్దాలుగా రోడ్ల ఆక్రమణల తొలగింపునకు పలుమార్లు సర్వేలు చేసి మార్కింగ్ వేసినా చర్యలు శూన్యం.

**ఆక్రమణలతో ఇరుకుగా మారి**

కొత్తచెరువులో నాలుగు ప్రధాన రహదారులు ఇరువైపులా ఆక్రమణకు గురయ్యాయి. కొంతమేర శాశ్వత నిర్మాణాలు, దుకాణాల ముందు తాత్కాలిక షెడ్లతోపాటు ఎత్తుగా మట్టి వేసుకోవడంతో రోడ్డు ఇరుకుగా మారాయి. ఆటోలను అడ్డదిడ్డంగా నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తప్పడం లేదు. దుకాణాల ముందు అన్‌లోడింగ్, లోడింగ్ పేరుతో గంటల తరబడి వాహనాలు నిలుపుతున్నారు. ఇప్పటికే ఇరుకు దారుల్లో జరిగిన ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. కూడలిలో కనీసం ట్రాఫిక్ నియంత్రణ చర్యలు కనిపించడం లేదన్న విమర్శలు వ్యక్తవుతున్నాయి.

**ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులకు నివేదిస్తాం: ఇన్‌ఛార్జి సీఐ సురేశ్, కొత్తచెరువు**

కూడలిలో ప్రధాన రహదారులు ఇరుకుగా ఉన్నాయి. రోడ్ల మధ్యలో విగ్రహాలు ప్రమాదకరంగా మారాయి. ప్రతిరోజూ దుకాణాలు, రోడ్లపై నిలిపిన వాహనదారులపై చర్యలు తీసుకుని హెచ్చరిస్తున్నాం. రోడ్ల మధ్యలో విగ్రహాల ఏర్పాటుపై ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులకు నివేదిస్తాం. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతాం.

# క్యూఆర్ కోడ్‌కు 'రైట్‌రైట్'



నర్సీపట్నం : ఆర్టీసీ బస్టాండుల్లో క్యూఆర్ కోడ్‌తో సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ఆర్టీసీ సేవలపై ప్రయాణికుల అభిప్రాయం తెలుసుకునేందుకు కోసం ఇటీవల ప్రవేశపెట్టిన దీనికి స్పందన బాగుంది. ప్రయాణికులు తమ ఎదురైన ఇబ్బందులకు తోడు సంతృప్తికర సేవల సమాచారాన్ని తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లగలుగుతున్నారు. ప్రభుత్వ సంస్థలు తదితర వాటిలో ఇప్పటికే క్యూఆర్ కోడ్‌తో వినియోగదారుల ఫీడ్‌బ్యాక్‌ను ఆహ్వానిస్తున్నారు. ఆర్టీసీలోనూ నెల రోజుల కిందట ఇది అమల్లోకి వచ్చింది.

**సేవల్లో పారదర్శకతకు..** ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర సంస్థల్లో పారదర్శకత కోసం క్యూఆర్ కోడ్ అమలవుతోంది. ప్రస్తుతం జిల్లా కేంద్రాల్లోనే ఆర్టీసీ వీటిని ప్రవేశపెట్టింది. తొలి దశలో అనకాపల్లి, నర్సీపట్నం డిపోలోనూ ఇవి అందుబాటులోకి వచ్చాయి. బస్టాండుల్లోని పలుచోట్ల, దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లోనూ ఉన్నాయి. కోడ్ స్కాన్ చేయగానే తాగునీరు, పరిశుభ్రతకు సంబంధించిన పలు అంశాలు సెల్‌ఫోన్ తెరపై కనిపిస్తాయి. వాటికి ఎదురుగా ఉన్న అవును, కాదు అనేచోట తాకడం ద్వారా మన అభిప్రాయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్తుంది. జిల్లాలోని రెండు డిపోల్లో నెల రోజుల్లోనే 250 మంది స్కాన్ చేసినట్లు సమాచారం.

**పరిష్కారమైన సమస్యలివీ..**

ః బస్సుల రాకపోకల వేళలు తెలియక ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఓ ప్రయాణికుడు ఫిర్యాదు చేయగా.. అన్ని ప్లాట్‌ఫాంలపై పాఠశాల యాజమాన్యాల సహకారంతో బోర్డులను ఏర్పాటు చేశారు.

ః బస్టాండులో ఫ్యాన్లు తిరగడం లేదంటూ గతంలో ఫిర్యాదులు వచ్చేవి. క్యూఆర్ కోడ్‌లో ఈ విషయాన్ని ప్రస్తావించడగా అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు.

నర్సీపట్నం బస్టాండులో గతంలో సీఎంఆర్ సంస్థ ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు కాలక్రమంలో మూలకుచేరింది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన ఓ ప్రయాణికుడు ఈ అంశాన్ని ప్రస్తావించడంతో దాతల సాయంతో వినియోగంలోకి తీసుకువచ్చారు.

**ఫిర్యాదూ చేయవచ్చు...** నర్సీపట్నం బస్టాండులో క్యూఆర్ కోడ్ ద్వారా నెల రోజుల్లో 105 మంది పలు సమస్యలను ప్రస్తావించారు. వాటన్నింటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాం. అభిప్రాయాలతోపాటు ఫిర్యాదులూ చేయవచ్చు. సేవలు బాగుంటే బాగున్నాయని, లేకుంటే లేదని నిర్మొహమాటంగా తెలియజేయవచ్చు.

ధీరజ్, ఆర్టీసీ డీఎం, నర్సీపట్నం

# 'పురిట్లోనే' పుట్టెడు శోకం



అనకాపల్లి : మాతా, శిశు మరణాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. గత మూడు నెలల్లో జిల్లాలో నలుగురు తల్లులు ప్రసవ సమయంలో మృతి చెందగా, పురిట్లోనే 29 మంది శిశువులు మరణించారు. ఒక్క మరణమూ సంభవించకూడదని ప్రభుత్వం రూ.కోట్లలో నిధులు ఖర్చు చేస్తున్నా.. ఆశించిన ఫలితాలు ఉండటం లేదు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలకు మెరుగైన సదుపాయాలున్నా.. కొంతమంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. చివరి నిమిషంలో సరైన వైద్యం అందక తురకలపూడి, మాకవరం గ్రామాలకు చెందిన ఇద్దరు తల్లులు ప్రసవ సమయంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు సంబంధించి విశాఖపట్నంలోని సూర్య ఆసుపత్రి, ఆరాధ్య సంతాన సాఫల్య కేంద్రంపై కలెక్టర్ విజయకృష్ణన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తొలిసారిగా రెండు ప్రైవేటు ఆసుపత్రులపై కేసు నమోదు చేసేందుకు వైద్యారోగ్య శాఖాధికారులు సన్నద్ధమయ్యారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్యం.. సదుపాయాలపై పర్యవేక్షించాల్సిన వైద్యారోగ్య శాఖాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్ల సంఖ్య పెరిగేందుకు ఇదో కారణంగా కనిపిస్తోంది. నెలలు నిండాక ఏదోఒక కారణం చెప్పి సిజేరియన్ చేస్తూ రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు బిల్లు వేస్తున్నారు. దీంతో అవసరం లేకపోయినా ఆపరేషన్లు చేస్తున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్సకు వచ్చే గర్భిణులకు నెలవారీగా అందించే చికిత్సతోపాటుగా వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. బిడ్డ ఎదుగుదలతోపాటు తల్లి ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీస్తున్నారు. సాధారణ ప్రసవం కోసం ఫిజియోథెరపిస్టుతో వ్యాయామం చేయిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇదేమీ కానరావడం లేదు. రూ.వేలల్లో బిల్లుల రూపేణా దండుకోవాలన్నదే తప్ప.. తల్లీబిడ్డ క్షేమం గురించి ఆలోచన చేయడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిజేరియన్ చేయాల్సి వచ్చినా, ప్రసవ సమయంలో మాతా, శిశు మరణాలు సంభవించినా కారణమేంటని ప్రభుత్వ వైద్యులు ఉన్నతాధికా రులకు నివేదిక ఇవ్వాలి. ప్రైవేటు ఆసుపత్రులకు ఇవేమీ లేవు, ఇటీవల కాలంలో పిల్లలు పుట్టక చాలామంది సంతాన సాఫల్య కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. మందుల నుంచి డెలివరీ వరకు ప్యాకేజీ మాట్లాడు కుని చికిత్స అందిస్తున్నారు. ప్రసవ సమయంలో ఏదైనా తేడా వస్తే రిఫర్ చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో గర్భిణులు ప్రసవమయ్యే వరకు వారికి ఆరోగ్య సలహాలు, సూచనలు అందించడం ఆశా కార్యకర్తల పని. వీరిలో కొందరు ప్రోత్సాహకాలకు ఆశపడి ప్రైవేటు ఆసుపత్రులకు పంపుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ సిజేరియన్లు జరిగేలా వైద్యులతో మాట్లాడుతున్నారన్న ఫిర్యాదులున్నాయి. అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో వైద్యురాలు ప్రసూతి శస్త్రచికిత్సలకు డబ్బులు తీసుకుం టున్నారని ఫిర్యాదు రావడంతో కలెక్టర్ ఆమెను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. **రెండు ఆసుపత్రు లపై కేసులు..:** సక్రమంగా వైద్యం అందించక మాతృ మరణాలకు కారణమైన విశాఖపట్నంలోని రెండు ప్రైవేటు ఆసుపత్రు లపై తురకలపూడి, మాకవరం పీహెచ్‌సీ వైద్యులతో పోలీసులకు ఫిర్యా దు చేయించనునానం. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, సిబ్బం ది ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవు. మాతా, శిశు మరణాలపై మూడు నెలలకోసారి సమీక్ష నిర్వహిస్తున్నాం. అనవ సరంగా శస్త్రచికిత్సలు చేస్తున్నారని తేలితే కఠినంగా వ్యవహ రిస్తాం. నిఘా కొనసాగుతుంది. డాక్టర్ శాంతిప్రభ, ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వో

# కూరగాయలు దరిచేరవా..?

పుత్తూరు : ఉద్యోగ, ఉపాధి కోసం పిల్లల చదువుల నిమిత్తం పట్టణాలకు వచ్చి నివసిస్తున్న, స్థిరపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నా సరిపడా రైతుబజార్లు అందుబాటులో లేవు. ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చిత్తూరు, తిరుపతి, పలమనేరు, గూడూరులో తప్ప మరెక్కడా ఇవి లేవు. గత ప్రభుత్వ హయాంలో పుత్తూరు, నగరి, పలమనేరు, తిరుచానూరు, చంద్రగిరిలో వీటి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పలమనేరులో పూర్తిచేసి ప్రారంభించారు. తిరుచానూరులో నిర్మాణం పూర్తయినా నేటికీ ప్రారంభించ లేదు. ప్రస్తుతం వాటి ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు మొలుస్తున్నాయి. చంద్రగిరిలో పునాదుల దశలోనే వదిలేశారు. పుత్తూరులో స్థల పరిశీలన చేశారు. నగరిలో స్థలం కూడా చూపలేదు. ప్రజాప్రతినిధులు చొరవ చూపకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

**ప్రజలకు ఒనగూరే మేలు..**

మార్కెటింగ్ శాఖ నిధులతో నిర్మించే ఈ రైతుబజార్లలో నామమాత్రపు అద్దెలకు రైతులు, స్వయం సహాయక సంఘాలకు దుకాణాలు కేటాయిస్తారు. వీటి నిర్వహణకు ఎస్టేట్ ఆఫీసర్, ఒక అటెండర్ ఉంటారు. జేసీ, డీఎస్వో, మార్కెటింగ్, ఉద్యానశాఖల అధికారులతో కమిటీ ఉంటుంది. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే కిలోకి రూ.5 నుంచి రూ.10 తక్కువ ధరకు ఇక్కడ కూరగాయలు లభ్యమవుతాయి.



టమాటా, ఉల్లిపాయలు తదితరాల ధరలు పెరిగినపుడు రాయితీపై ఆయా ఉత్పత్తులు ప్రజలకు అందించే వెసులుబాటు ఉంటుంది.

**నిధుల కొరతతోనే..**

ప్రభుత్వం మార్కెట్ యార్డుల నిర్మాణాలకు పచ్చజెండా ఊపింది. అయితే సీఎంఎఫ్ ద్వారా బ్యాంకు రుణాలు తీసుకుని నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో మంజూరు అయినా నిర్మాణాలు పూర్తి చేయలేదు. ఈ నేపథ్యంలో వీటి నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని నిధులు మంజూరయ్యేలా కృషిచేస్తేనే ఆయా ప్రాంతాల్లో రైతుబజార్లు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

ఉమ్మడి జిల్లాలో నగరపాలక సంస్థలు: 2
పురపాలికలు: 10
ప్రస్తుతం ఉన్న రైతుబజార్లు: 4
నిత్యం వినియోగదారులు: 2 వేలకు పైచిలుకు
అవసరమైన ప్రదేశాలు: శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, కుప్పం, పుంగనూరు, పుత్తూరు, నగరి

# ఉపాధి.. సంతృప్తి

కర్నూలు : నలుగురు మహిళా సభ్యులను ఒక యూనిట్‌గా ఏర్పాటుచేసి తృప్తి క్యాంటీన్లు అప్పగిస్తారు. దీనిని నడిపేందుకుగాను 20 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో కంటెయినర్‌ను ప్రభుత్వం సమకూరుస్తుంది. వంట, నిర్వహణ అంశాలపై శిక్షణ ఇస్తుంది. పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ ఎలక్ట్రిక్ పరికరాలు అందిస్తారు. సౌరశక్తిని ఉపయోగిస్తారు. ప్రస్తుతం విపణిలో ఆహార పదార్థాలకు మంచి డిమాండు ఉంది. ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజూ రూ.కోట్లల్లో వ్యాపారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మహిళలకు ఉపాధి చూపేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పట్టణ ప్రాంతాల్లో 'తృప్తి' క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఏపీ మెప్మా, ఓ సంస్థ ఉమ్మడి భాగస్వామ్యంతో వీటిని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థ, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, గూడూరు పురపాలక సంఘాలతోపాటు బేతంచెర్ల నగర పంచాయతీలో కలిపి 25,300 స్వయం సహాయక పొదుపు సంఘాలున్నాయి. 2,58,823 మంది మహిళలున్నారు.

**ఒక్కొక్కరు రూ.3.10 లక్షల చొప్పున..**

క్యాంటీన్ నిర్వహణకు పెట్టుబడి రూ.16.40 లక్షలుగా నిర్ణయించారు. ఒక్కో క్యాంటీన్‌కు సంబంధించి నలుగురు స్వయం సహాయక సంఘాల సభ్యులుంటే ఒక్కొక్కరు రూ.3.10 లక్షల చొప్పున రూ.12.40 లక్షలు పెట్టుబడి పెట్టాలి. మిగతా పెట్టుబడి మొత్తం.. కంటెయినర్, యంత్ర పరికరాలు, సౌర విద్యుత్తు, ఇతర అవసరాల రూపంలో మెప్మా, ఓ



సంస్థ ప్రతినిధులు చేయూతనిస్తారు. ఒక్కో క్యాంటీన్ నెలవారీ టర్నోవర్ రూ.6.39 లక్షలు ఉండేలా.. ప్రతినెలా లాభం రూ.2.46 లక్షలు వచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.

**కాలుష్య రహితంగా..**

వంట కోసం వంద శాతం ఎలక్ట్రిక్, పీఎం సూర్యఘర్ కింద సౌర విద్యుత్తు వినియోగిస్తారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజన సదుపాయం ఉంటుంది. అనుభవజ్ఞులైన చెఫ్‌లు, ఎప్పటికప్పుడు అధికారుల ఆహార తనిఖీలు నిర్వహించి పలు సూచనలు అందిస్తారు. ఎప్పటికప్పుడు ఖాతాదారుల అభిప్రాయాలు తెలుసుకుని క్యాంటీన్లను సమర్థంగా నడిపిస్తారు. సంతృప్తి చెందేలా ఆహారం అందిస్తారు.

**24 గంటలు పనిచేసేలా..**

ఈ ఏడాది మార్చి 8 నుంచి జూన్ 8వ తేదీలోగా కర్నూలులో 10, ఆదోని 02, ఎమ్మిగనూరు 01 తృప్తి క్యాంటీన్లను స్వయం సహాయక పొదుపు మహిళలతో ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నంద్యాల జిల్లాలోనూ పది వరకు ఏర్పాటు చేయనున్నారు. వీటిని నగరంతోపాటు పట్టణ ప్రాంతాల్లోని ముఖ్యమైన ప్రధాన కూడళ్లు, హైవేను ఆనుకుని ఉన్న ప్రదేశాలను ఎంపిక చేయడంతోపాటు 24 గంటలు పనిచేసేలా చూస్తారు.

చురకలు



# చెరువు మట్టి దోచేస్తున్నారు!

తాడిపత్రి : వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రకృతి వనరులను కొల్లగొట్టేశారు.. కొండలనే కాకుండా చెరువులనూ చెరబట్టి మట్టిని అక్రమంగా తరలించి కోట్లాది రుపాయలు సంపాదించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వారి ఆగడాలు కొనసాగుతూనే ఉన్నాయి. యాడికి మండలంలోని రాయలచెరువు గ్రామంలోని చెరువు మట్టిని కొంతమంది అక్రమార్కులు యథేచ్ఛగా భారీ వాహనాలతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**500 ఎకరాల్లో దోపిడీ**

గ్రామ పరిసరాల్లో సుమారు 500 ఎకరాల్లో చెరువు విస్తరించి ఉంది. ఇందులోని మట్టిని తవ్వి కొందరు అక్రమార్కులు భారీ వాహనాలలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వైకాపా ప్రభుత్వం నుంచే ఈ అక్రమ మట్టి వ్యాపారం కొనసాగుతూ వస్తోంది. ప్రస్తుతం చెరువులో నలుగురు మట్టి వ్యాపారులు రెండు ఇటాచీలు, 30 టిప్పర్లతో రోజూ మట్టిని తవ్వుతూ తరలిస్తున్నారు. మట్టిని స్థానికంగా ఉన్న రైతులకు, నంద్యాల జిల్లాలోని పలు గ్రామాల్లోని రైతుల పొలాల్లోకి ఇతర పనుల నిమిత్తం తరలిస్తున్నారు. నంద్యాల జిల్లాకు తరలిస్తే టిప్పర్‌కు రూ.6



నుంచి 10వేల వరకు ధర పలుకుతోంది. అంతేకాకుండా యాడికి ప్రాంతంలోని రైతుల పొలాల్లోకి మట్టిని తరలిస్తే రూ.3 నుంచి 6వేల వరకు విక్రయిస్తున్నారు. రోజుకి సుమారు వంద ట్రిప్పులకుపైగా ఇతర ప్రాంతాలకు తరలిపోతోంది.

**గ్రామీణ రహదారులు అధ్వానం**

గ్రామీణ రహదారులు గుండా తరలించడంతో మార్గాలన్నీ అధ్వానంగా మారాయని స్థానికులు వాపోతున్నారు.దీనిపై యాడికి తహసీల్దారు కె.ప్రతాప్‌రెడ్డిని వివరణ కోరగా చెరువులో మట్టి తవ్వకాలకు ఎవరికీ అనుమతులు లేవన్నారు. ఇటీవల కొందరు రైతులు అనుమతులు కోరగా కలెక్టర్, ఇరిగేషన్ శాఖ అధికారులకు నివేదిక పంపామన్నారు.

# ఖజానా శాఖకు కొత్త భవనాలు

నక్కపల్లి : జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఉప ఖజానా కార్యాలయ భవనాల పనులను తుదిదశకు చేరాయి. ఇవి పూర్తయితే దీర్ఘకాలంగా ఆయా శాఖల ఉద్యోగులు పడుతున్న కష్టాలకు తెరపడనుంది. పాయకరావుపేట, కోటవురట్ల, నర్సీపట్నంలో ప్రస్తుతం ఉన్న ఉప ఖజానా కార్యాలయాల స్థానే నూతన భవనాలను గతేడాది ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో దానికి రూ.75 లక్షల చొప్పున కేటాయించారు. పాయకరావుపేట ఖజానా కార్యాలయ భవనాన్ని నక్కపల్లిలో నిర్మించాలని నిర్ణయించారు. పూర్వం ఈ కార్యాలయం నక్కపల్లిలోనే ఉండగా, పదేళ్ల కిందట 'పేట'కు తరలించారు. తిరిగి నక్కపల్లిలో నిర్మించేలా మంత్రి అనిత ఆదేశాలిచ్చారు. దీంతో స్థల



సేకరణ పనులు మొదలు కాలేదు. మిగిలిన రెండు భవనాల పనులను ప్రారంభించారు. నర్సీపట్నంలో కార్యాలయ భవనాన్ని ప్రస్తుతం ఉన్న కార్యాలయానికి సమీపంలోనే నిర్మిస్తుండగా, కోటవురట్లలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ స్థలంలో చేపట్టారు. ప్రతి చోటా రెండంతస్తుల్లో విశాలమైన గదులతో నిర్మిస్తున్నారు. వీటిలో కార్యాలయ ఆవరణ, ముఖ్య అధికారి గది, స్ట్రాంగ్ రూం, కారిడార్, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులన్నీ తుదిదశకు చేరాయి. కోటవురట్ల భవనం ప్లాస్టింగులు పూర్తిచేసి, సున్నం వేశారు. మరికొన్ని పనులు పూర్తి చేస్తే వినియోగానికి సిద్ధమవుతుంది. నర్సీపట్నంలో నిర్మాణం కొనసాగుతోంది.త్వరలోనే పూర్తి.. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనాలు తుది దశకు చేరాయి. గుత్తేదారుకు బిల్లుల చెల్లింపులు చేయాల్సి ఉంది. త్వరలోనే బిల్లులు జమవుతాయి. పనులు పూర్తిచేసి త్వరలోనే అందుబాటులోకి తెస్తాం. నక్కపల్లిలో భవన నిర్మాణానికి గతంలో ఉన్న ఖజానా కార్యాలయ స్థలాన్నే పరిశీలించాం. తహసీల్దారు అనుమతు లు ఇచ్చారు. టెండర్లు పూర్తికాగానే పనులు చేపడతాం. ప్రసాద్, డీఈఈ

# స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల వెల్లువ

సూళ్లూరుపేట : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వాటిని క్రమబద్ధీకరించాలని తలచింది. ప్రత్యేకంగా జీవో 30 విడుదల చేసింది. క్రమబద్ధీకరణ పథకం-2025కు సూళ్లూరుపేట, గూడూరు డివిజన్లలో ఎక్కువమంది దరఖాస్తు చేసుకుంటున్నారు. వీటిని క్షేత్రస్థాయిలో వీఆర్వోలు విచారిస్తున్నారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూముల్లో చాలామంది స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో క్రమబద్ధీకరణ పథకం-2025 కింద ఆక్రమణలోని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకున్నవారు పట్టా కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. అయితే 2019 అక్టోబరు 15వ తేదీకి ముందు ప్రభుత్వ స్థలంలో నిర్మించుకుని ఉండాలి.

మూడు రకాలుగా: విభజన పథకం కింద 150 చదరపు గజాల లోపు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని ఇల్లు కట్టుకుంటే అలాంటి వాటిని ఉచితంగా క్రమబద్ధీకరణ చేసి, పట్టా మంజూరు చేస్తారు.151 నుంచి 300 చదరపు గజాల ప్రభుత్వ స్థలంలో ఇల్లు ఉంటే బీపీఎల్ అయితే 15 శాతం బేసిక్ వాల్యూ(బీవీ), 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు (ఆర్‌ఎఫ్) చెల్లించాలి. మిగిలవారైతే 15 శాతం బేసిక్ వాల్యూ, యథావిధిగా రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. 301 నుంచి 450 చదరపు గజాల్లో బీపీఎల్ లబ్ధిదారులు వందశాతం బీవీ, 50 శాతం ఆర్‌ఎఫ్, ఏపీఎల్ 200 శాతం బీవీ, ఆర్‌ఎఫ్ చెల్లించాలి.

451 చదరపు గజాలపైన అయితే బీవీపై ఐదు రెట్లు, ఆర్‌ఎఫ్ చెల్లిస్తే క్రమబద్ధీకరణ చేస్తారు. ఈ ఏడాది ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణకు ఈ ఏడాది చివరిలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. వీఆర్వో, సచివాలయ సిబ్బంది వాటిని విచారించి తహసీల్దార్, పుర కమిషనర్, ఆర్డీవోకు నివేదిస్తారు. వారు సబ్ డివిజన్ కమిటీలో ఆమోదించి, అర్హులకు పట్టాలు మంజూరు చేయనున్నారు.

**వీటిని చేయరు:** మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, లేఅవుట్ స్థలాలు, కాలువలు, నదీ పరివాహక ప్రాంతాలు, చెరువులు, గుంతలు, తదితర వాటిల్లో ఇల్లు నిర్మించిన వాటిని క్రమబద్ధీకరించరు.

# నిఘా నీడలో.. రైల్వే డివిజన్




గుంతకల్లు : ప్రయాణికుల భద్రత, సంఘ వ్యతిరేక శక్తులను కట్టడి చేయడానికి గుంతకల్లు రైల్వే డివిజన్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దొంగలనే కాకుండా రకరకాల నేరాలు చేసే వారి కదలికలను గుర్తించి వారి చిత్రాలను నిక్షిప్తం చేసే దిశగా సౌర సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని స్టేషన్లలో విద్యుత్తు సాయంతో పనిచేసే కెమెరాలను ఏర్పాటు చేశారు.

**ఒక్కో కెమెరాకు రూ.25 వేలు వ్యయం**

విద్యుత్తు సరఫరా లేని సమయంలో దొంగలు, సంఘ వ్యతిరేక శక్తులను కెమెరాలు గుర్తించలేక పోతుండటంతో తాజాగా అధికారులు సౌరశక్తితో పని చేసే కెమెరాలను ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. దీనికిగాను సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ అధికారులు డివిజన్‌లో సౌర సీసీ కెమెరాలను రూ.2 కోట్లతో ఏర్పాటు చేస్తున్నారు. ఒక కెమెరాకు రూ.25 వేలు ఖర్చు చేస్తున్నారు.

చకచకా పనులు: రైల్వే డివిజన్‌లో మొత్తం 160 రైల్వే స్టేషన్లున్నాయి. ఇందులో మొదటి విడత కింద 90 రైల్వే స్టేషన్లతో పాటు డీఆర్‌ఎం కార్యాలయం, రైల్వే డివిజనల్ ఆసుపత్రి, డీజిల్ లోకో షెడ్లలో కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే డీఆర్‌ఎం కార్యాలయం, ఆసుపత్రిలో కెమెరాలు అమర్చారు. రైల్వే జంక్షన్‌లో పనులు కొనసాగుతున్నాయి. ఒక్క గుంతకల్లులోనే 90 సౌర కెమెరాలను ఏర్పాటు చేయగా డివిజన్‌లోని 90 స్టేషన్లలో దాదాపు 500 కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

**2026 మార్చి నాటికి పూర్తి చేస్తాం**

ప్రస్తుతం సౌరశక్తి ఆధారంతో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు నాలుగు రోజులు ఎండ లేకపోయినా పని చేస్తాయి. కెమెరాలకు బ్యాటరీలను అనుసంధానం చేస్తున్నాం. సౌరశక్తి తగ్గిపోగానే బ్యాటరీల సాయంతో పని చేస్తాయి. విద్యుత్తు సరఫరా లేని సమయంలో ఇంతకు ముందు ఏర్పాటు చేసిన కెమెరాలు పనిచేయలేక పోతున్నాయి. డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తా, ఏడీఆర్‌ఎం సుధాకర్ ఆధ్వర్యంలో సౌర కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. 2026 మార్చి నాటికి పనులు పూర్తి చేస్తాం.చంద్రశేఖర్, సీనియర్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజినీరు

# కేంద్రం ప్రారంభించినా... ధాన్యం కొనుగోళ్లలో జాప్యం



కణేకల్లు: ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కేంద్రాన్ని ప్రారంభించి వారం రోజులు గడిచినా.. క్షేత్రస్థాయిలో కొనుగోళ్లు చేయడం లేదు. వర్షం భయంతో అన్నదాతలు బహిరంగ విపణిలో తక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 30 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంతో పౌరసరఫరాల శాఖ అధికారులు గత నెల 25న కణేకల్లులో ఆదర్శ భారతి సొసైటీ నిర్వహణలో కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడు రూ.2,320, కామన్ రకం రూ.2,300 చొప్పున కొనుగోలు చేస్తామన్నారు. గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని చెప్పినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. మిల్లర్ల బ్యాంకు గ్యారెంటీ, కొనుగోలు కేంద్రానికి ఐడీ కేటాయింపు వంటి ప్రక్రియ పూర్తైనప్పటికీ, ధాన్యం తరలించే వాహనాలకు జీపీఎస్ తప్పనిసరిగా ఉండాలన్న ప్రభుత్వ నిబంధనతో నేటికీ వాహనాలు సిద్ధం కాకపోవడం గమనార్హం. దీనికితోడు వ్యవసాయ శాఖ నిర్లక్ష్యంతో ఆన్‌లైన్‌లో నమోదు కాని ఈ పంటతో రైతుల్లో గందరగోళం నెలకొని కొనుగోళ్లపై ప్రభావం చూపింది. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రత్యేక చొరవ తీసుకొని వ్యవసాయ అధికారులతో రైతుల వివరాలు సేకరించారు. 524 మంది రైతుల 1,486 ఎకరాల వరి పంటను కొనుగోలు చేసేలా అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించారు. అయినా కొనుగోళ్లు ప్రారంభించడంలో ఎడతెగని జాప్యం నెలకొంటోంది.

**బహిరంగ విపణిలో తక్కువ ధరకు అమ్మకం**

వర్షం భయం, నిల్వ చేసే చోటు లేక రైతులు ధాన్యాన్ని బహిరంగ విపణిలో తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. దళారులు వ్యాపారులతో కుమ్మకై నాణ్యత పేరిట క్వింటాలు రూ.1,800-1,900 లోపు కొనుగోలు చేస్తున్నారు. అధికారులు వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

**వర్షం భయంతో అమ్మేశా: నాగరాజు, రైతు, 43ఉడేగోళం**

నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశా. కేంద్రంలో ధాన్యం విక్రయించాలని వారం రోజులుగా ఎదురు చూశా. వర్షం భయంతో దళారులను ఆశ్రయించి వ్యాపారులకు క్వింటాలు రూ.1,930 చొప్పున అమ్మేశా. క్వింటాకు రూ.400 వరకు నష్టపోయాను. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి.

**వెంటనే ప్రారంభిస్తాం: రమేశ్‌రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజరు**

ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. రవాణా వాహనాల ట్రాకింగ్‌కు జీపీఎస్ కలిగిన లారీలను సమకూర్చుతున్నాం. సోమ లేదా మంగళవారం క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించేలా చర్యలు తీసుకొంటాం. రైతులు దళారులకు విక్రయించి నష్టపోవద్దు.

# మెగా సప్లిమెంటరీ ఫలితాలు ఎప్పుడో?

ధర్మవరం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన మెగా సప్లిమెంటరీ ఫలితాల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అభ్యర్థులు ఫలితాల కోసం ఆరు నెలలుగా ఎదురు చూస్తున్నారు. ఎస్కేయూ పరిధిలో 68 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. డిగ్రీ కోర్సు మూడు సంవత్సరాల్లో పూర్తవుతుంది. పరీక్షలు తప్పితే ఆ తరువాత మూడు సంవత్సరాల్లో ఉత్తీర్ణులు కావాలి. చాలా మంది విద్యార్థులు సకాలంలో పరీక్షలు రాయకపోవడంతో డిగ్రీ మానేశారు. అలాంటి వారి కోసం ఎస్కేయూ అధికారులు మెగా సప్లిమెంటరీ పరీక్షలకు ప్రకటన జారీ చేశారు. 1994-95 నుంచి 2013 సంవత్సరాల మధ్యలో పరీక్షలు తప్పిన అభ్యర్థుల కోసం ఈ మెగా సప్లిమెంటరీ గత సంవత్సరం ప్రకటించారు. అప్పట్లో ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల డిగ్రీ కళాశాలలు ఎస్కేయూ పరిధిలోనే ఉండేవి. ఆయా జిల్లాల నుంచి సుమారు 6 వేల మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేశారు. వారికి గతేడాది అక్టోబరు, నవంబరు నెలల్లో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. నేటికీ ఫలితాలు విడుదల చేయకపోవడంతో అభ్యర్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**అవకాశాలు కోల్పోతున్న పరిస్థితి**

డిగ్రీ ఉంటేనే పీజీ, బీఈడీ, లా తదితర కోర్సులు చేయడానికి అవకాశ ముంటుంది. ఇప్పటికే వయసు పైబడిన అభ్యర్థులు ప్రైవేటుగానైనా ఉన్నత విద్య అభ్యసించవచ్చనే భావనతో డిగ్రీ పరీక్షలు రాశారు. కొన్ని రిజర్వేషన్ వర్గాల అభ్యర్థులు ఉద్యోగాలు వస్తాయని ఆశతో పరీక్షలకు దరఖాస్తు చేశారు. ఉమ్మడి ప్రవేశ పరీక్షల ప్రకటనలు వెలువడ్డాయి. ఉద్యోగ ప్రకటనలు కూడా వెలువడుతున్నాయి. ఎస్కేయూ నుంచి డిగ్రీ ఫలితాలు రాకపోవడంతో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




ధర్మవరం మండలానికి చెందిన ఓ అభ్యర్థి 1999లో డిగ్రీ పరీక్ష తప్పాడు. రెండు, మూడు సార్లు ప్రయత్నించినా ఉత్తీర్ణత కాలేదు. దీంతో డిగ్రీ వదిలేశాడు. ఇలా పరీక్షలు తప్పిన వారి కోసం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మెగా సప్లిమెంటరీ నిర్వహించింది. డిగ్రీ పూర్తి చేస్తే ఏదైనా ఉద్యోగం వస్తుందని ఆ అభ్యర్థి గత సంవత్సరం అక్టోబరులో సప్లిమెంటరీ పరీక్షలు రాశాడు. ఆరు నెలలు గడిచినా ఫలితాలు విడుదల చేయలేదని వాపోయాడు.

వారం రోజుల్లో విడుదలకు చర్యలు: లోకేశ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, ఎస్కేయూ

మెగా సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు సాంకేతిక కారణాలతో ఆలస్యమయ్యాయి. వరుసగా వివిధ పరీక్షలు, మూల్యాంకనం నిర్వహించడంలో నిమగ్నమయ్యాం. వారం రోజుల్లో ఫలితాలు విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

# వరి దిగుబడుల్లో నాతవరం ముందంజ

అనకాపల్లి : జిల్లాలో ఈ ఏడాది వరి దిగుబడుల్లో నాతవరం మండలం ముందుండగా దేవరాపల్లి వెనుకబడింది. గత సీజన్ కంటే 818 కేజీల ధాన్యం అదనంగా పడింది. ఖరీఫ్‌లో హెక్టారుకు 5,331 కేజీలు ధాన్యం రాగా, 2023-24 సీజన్‌లో 4,513 కేజీల దిగుబడి వచ్చింది. నాతవరంలో హెక్టారుకు 6,022 కేజీల దిగుబడులొచ్చాయి. గత సీజన్‌లోనూ ఈ మండలంలోనే అధిక దిగుబడులు వచ్చాయి. అన్ని మండలాల కంటే ఇక్కడే సాగు విస్తీర్ణం ఎక్కువ. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 55,985 హెక్టార్లలో వరి సాగు చేయగా నాతవరం మండలంలో 6,492 హెక్టార్లలో సాగైంది. ఏడాదిలో 120 రోజులు అంటే వరి సాగు చేసినన్ని రోజులు తాండవ జలాశయం నుంచి పంటలకు నీరు విడుదలైంది.

**హెక్టారుకు 71 బస్తాలు...** ఖరీఫ్‌లో అన్ని పంటలు కలిపి 63,286 హెక్టార్లలో సాగు చేయగా.. వరి ఒక్కటే 55,985 హెక్టార్లలో సాగైంది. ఎక్కువగా వర్షాధారంగానే సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో సగటున హెక్టారుకు 71 బస్తాల దిగుబడి వచ్చింది. గత సీజన్‌లో సరాసరి దిగుబడి హెక్టారుకు 60 బస్తాలే.నాతవరం తర్వాత పాయకరావుపేట మండలంలో అధిక దిగుబడులు వచ్చాయి. ఇక్కడ



హెక్టారుకు 5,877 కేజీల ధాన్యం దిగుబడి వచ్చింది. ఇక్కడ పలు ఆనకట్టలు ఉండటంతో పొలాలకు నీరు పుష్కలంగా అందుతోంది. ఎస్.రాయవరం, గొలుగొండ, కోటవురట్ల, మునగపాక, నక్కపల్లి, రావికమతం, ఎలమంచిలి, బుచ్చెయ్యపేట మండలాల్లోనూ వరి దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయి. ఇక్కడ 5,400 కేజీలకు పైగా దిగుబడులు వచ్చాయి. నీటి ఎద్దడితోపాటు పంటకు చీడపీడలు సోకడంతో దేవరాపల్లి మండలంలో హెక్టారుకు 4,710 కేజీల దిగుబడే వచ్చింది. సుడిదోమ అధికంగా సోకడంతో కొన్ని మండలాల్లో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. మాడుగుల, రోలుగుంట మండలాల్లో ఐదు వేల కేజీల కంటే తక్కువ దిగుబడులు వచ్చాయి.

దిగుబడులు బాగున్నాయి... రెండు ఎకరాల్లో వరి సాగు చేశా. ఎకరాకు 32 బస్తాల దిగుబడి వచ్చింది. నారు నుంచి కోత వరకు వాతావరణం అనుకూలంగా ఉంది. కోత సమయంలో వర్షం వస్తే భయపడ్డాం. పెద్దగా ఇబ్బంది పడలేదు. గత ఏడాది 25 బస్తాలకు మించి రాలేదు.పిట్ట శ్రీనివాసరావు, నాగవరం, రైతు

# నిగ్గు తేల్చండి.. పరిహారం ఇవ్వండి

అచ్యుతాపురం : ఏపీఐఐపీ పైపులైన్ ప్యాకేజీ పంపిణీలో అవకతవకలు జరిగాయని నిర్ధారించి ఏళ్లు గడుస్తున్నా బాధ్యులపై చర్యల్లేవు. ప్యాకేజీ పంపిణీలో చోటుచేసుకున్న అవినీతిపై అప్పట్లో మత్స్యకారులు నిలదీసినా పాలకులు పట్టించుకోలేదు. అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో ఏర్పాటు చేసిన రసాయన పరిశ్రమల వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాతే సముద్రంలోకి విడుదల చేయాలని, పూడిమడక మత్స్యకారుల్లో 18 ఏళ్లు నిండిన వారికి ఒక్కొక్కరికి రూ.1.25 లక్షల చొప్పున పరిహారం ఇచ్చేందుకు గతంలో అంగీకారం కుదిరింది. దీన్ని అవకాశంగా మార్చుకునేందుకు వీధికొకరు దళారులుగా అవతారమెత్తారు.

రెవెన్యూ అధికారులతో లాలూచీ పడి 485 మందికి ప్యాకేజీ అందకుండా చేశారు. ఒకే పేరుతో రెండు ప్యాకేజీలు, ఆడపిల్లల పేరుతో కొంత, అత్తవారి ఇంట్లోనూ, పుట్టింట్లోనూ ఒకే పేరుతో ఉన్న వారికి ప్యాకేజీ అందజేశారు. ఇలా దళారులు రూ.4 కోట్ల వరకు అవినీతికి



పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి.

280 మంది సింగిల్ యూనిట్ రేషన్ కార్డులు, 40 మందికి వయసు లేకపోయినా 18 ఏళ్లు నిండినట్లు చూపి పరిహారం పొందారని రెవెన్యూ అధికారులు నివేదిక అందజేసినా ఇప్పటికీ అతీగతి లేదు. ప్యాకేజీ పంపిణీకి ముందు గుర్తించిన జాబితాలో పేర్లు లేని 30 మందికి పరిహారాన్ని అందించారు. రాజకీయ నాయకుల సిఫార్సులతో 280 మంది ప్యాకేజీ పొందినట్లు సమాచారం.

బ్రాండిక్స్ పైపులైను ఏర్పాటు సమయంలో 2,700 మందికి ప్యాకేజీ ఇవ్వగా ఏపీఐఐసీ ప్యాకేజీ వచ్చే సమయానికి ఈ సంఖ్య 4,828కి పెరగడం గమనార్హం. ఇప్పటికే 4,331 మందికి ప్యాకేజీ అందించిన అధికారులు రూ.2.5 కోట్ల మేర అవినీతి జరిగిందని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు.

కూటమి సర్కారు చర్యలు తీసుకోవాలి... న్యాయంగా రావాల్సిన ప్యాకేజీ ఇవ్వడంలో వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు కాలయాపన చేసింది. కూటమి ప్రభుత్వం న్యాయం చేసి ప్యాకేజీ ఇవ్వాలని మత్స్యకారులు కోరుతున్నారు. తెదేపా ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీని తీసుకోవద్దని గతంలో మోసగించి ఎన్నికల్లో లబ్ధి పొందిన జగన్.. అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఒక్కమాటా మాట్లాడలేదని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాడు మోసపోయిన వారంతా ఎన్నికల్లో కూటమికి మద్దతిచ్చామని, అవినీతిపై విచారణ చేపట్టి అర్హులందరికీ పరిహారం అందజేయాలని పూడిమడకకు చెందిన మత్స్యకారులు కోరుతున్నారు.

**ఐదేళ్లు కాళ్లరిగేలా తిరిగినా..** పరిహారం ఇవ్వాలని గత ఐదేళ్లు కాళ్లరిగేలా తిరిగినా అధికారులు పట్టించుకోలేదు. పంపిణీకి రూ.60 కోట్లు అవసరంకాగా ప్రభుత్వం రూ.68 కోట్లు విడుదల చేసినా అందరికీ అందలేదు. 31 మంది తక్కువ వయసు వారు, ఆరుగురు మూడుసార్లు ప్యాకేజీ తీసుకున్న వారు, 14 మంది భార్యాభర్తలు ఇద్దరూ ప్యాకేజీ పొందిన వారున్నా చర్యల్లేవు.వాసుపల్లి రాజేశ్, పూడిమడక

# త్రిపుల్ ఐటీ.. ఈ కష్టాలేంటీ!

ఒంగోలు : నిద్ర లేచి ముఖం కడుక్కోవాలన్నా.. కాలకృత్యాలు తీర్చుకోవాలన్నా నీరు లేదు. ఎప్పుడొస్తాయో తెలియదు.. దీంతో తరగతులకు వెళ్లడం మానేసి నీటి కోసం నిరీక్షించాల్సిన దుస్థితి ఒంగోలు నగరంలోని ట్రిపుల్ఐటీ విద్యార్థులది. తరచూ నీటి సమస్య తతెత్తుతోంది. ప్రతిసారీ పాత మోటార్లకు మరమ్మతులు చేయించి మమ అనిపిస్తున్నారు. సుమారు రూ.5 లక్షలు వెచ్చిస్తే కొత్తవి ఏర్పాటు చేసుకునే వీలున్నా ఆ దిశగా చేపడుతున్న చర్యలు శూన్యం. అదే సమయంలో మరమ్మతులకు రూ. వేలు ఖర్చు పెడుతుండటం గమనార్హం.

**పండగ రోజు స్నానాలే లేవు:** ఒంగోలు నగరంలో రెండు ట్రిపుల్ఐటీ ప్రాంగణాలున్నాయి. రెండూ అద్దె భవనాల్లో సాగుతున్నాయి. వీటిలో ఒకటైన రావ్ అండ్ నాయుడు ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో మొదటి(1,000), ద్వితీయ(360) సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులు ఉంటున్నారు. శ్రీరామనవమి ముందురోజు మోటార్లు పనిచేయలేదు. దీంతో అవసరాలకు నీరు లేక విద్యార్థులు ఇబ్బందులెదుర్కొన్నారు. పండగ రోజు స్నానాలు లేవని, సమస్యను వాట్సప్ గ్రూప్ ద్వారా అధికారులకు తెలిపినా స్పందన లేకపోయిందని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.



**ట్యాంకర్లతో అరకొర సరఫరా**

ట్రిపుల్ఐటీకి ఒకటో వేసవి చెరువు వద్ద నుంచి పైపులైను ఉంది. రెండున్నర అంగుళాల సామర్థ్యం గల పైపుల్లో ఒక అంగుళం నీరు మాత్రమే వస్తోంది. పైపు ద్వారా వచ్చిన నీటిని సంపులో నింపి అక్కడ నుంచి మోటారు ద్వారా ఓవర్హెడ్ ట్యాంక్కు ఎక్కిస్తారు. ఇందుకోసం అమర్చిన రెండు మోటార్లు పనిచేయక ఈ సమస్య తలెత్తింది. దీంతో గడిచిన రెండు రోజుల నుంచి ట్రిప్పునకు రూ.800 చెల్లించి ప్రైవేట్ ట్యాంకర్లతో నీరు తెప్పిస్తున్నారు. అవి సరిపోవడం లేదని, తరగతుల నిర్వహణ సమయంలో ట్యాంకరు వస్తే పట్టుకోవడం ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ట్రిపుల్ఐటీ డైరెక్టర్ భాస్కర్ పటేల్ మాట్లాడుతూ.. విద్యుత్తు హైవోల్టేజీ కారణంగా మోటార్లు కాలిపోయినట్లు తెలిపారు. నీటి ఇబ్బందులను దృష్టికి తేవడంతో వెంటనే మెకానిక్లను పిలిపించి మరమ్మతు పనులు చేయించా మన్నారు. ఒక మోటారు కొత్తది బిగించామని.. ఆలోపు విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ట్యాంకర్ల ద్వారా నీరు తెప్పించినట్లు వివరించారు.

# పురంలో కాన్పులు తగ్గుముఖం

మార్కాపురం : మార్కాపురం సర్వజన వైద్యశాల పరిస్థితి నానాటికీ దిగజారుతోంది. వైద్యశాలలో గతంలో నలుగురు స్త్రీల వైద్య నిపుణులుండేవారు. ప్రస్తుతం ఇద్దరే సేవలందిస్తున్నారు. దీంతో కాన్పులు గణనీయంగా తగ్గిపోయాయి. ఒక్కరు ఓపీ చూస్తుంటే మరొకరు శస్త్రచికిత్స కేంద్రంలో ఉంటారు. అన్ని వేళల్లో అందుబాటులో ఉండలేని పరిస్థితి. దీంతో గర్భిణులు ప్రైవేట్ బాట పడుతున్నారు. మరికొందరు ఒంగోలుకు వెళ్తున్నారు.

**నాడు ప్రథమం..:** సాధారణ కాన్పులు, శస్త్రచికిత్స కాన్పులు విషయంలో మార్కాపురం ప్రభుత్వ వైద్యశాల జిల్లాలోనే ప్రథమంగా




ఉండేది. ఉత్తమ వైద్యసేవలకుగాను వైద్యులు అవార్డులు పొందారు. కాన్పుల కోసం మార్కాపురంతో పాటు సమీపంలోని యర్రగొండపాలెం, గిద్దలూరు, దర్శి నియోజకవర్గాల్లోని గ్రామాలు, నంద్యాల జిల్లా శ్రీశైలం, సున్నిపెంట తదితర ప్రాంతాల నుంచి కూడా వచ్చేవారు. ఇదంతా గతం. జీజీహెచ్గా మార్పు చెందిన అనంతరం ఆ పరిస్థితి మారింది. ఇప్పుడు కాన్పుల సంఖ్య సగానికి సగం తగ్గింది. ఈ విషయమై మార్కాపురం సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ.. వైద్యశాలలో ప్రస్తుతం 22 మంది వైద్యులు, 150 మంది సిబ్బందితో వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. వైద్యశాలకు వచ్చే గర్భిణులకు స్థానికంగానే సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అత్యవసరమైతే ఒంగోలుకు రిఫర్ చేస్తున్నామన్నారు.

# బకాయిలిచ్చినా.. జాప్యమెందుకు?

శ్రీకాకుళం : సామాజిక ఆసుపత్రుల్లో భవనాలు శిథిలావస్థకు చేరడంతో అధునాతన వసతులతో కొత్త నిర్మాణాలకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలో 8 చోట్ల పనులు ప్రారంభించినా బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు అర్ధాంతరంగా నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వాటిని చెల్లించినా ప్రారంభం కాలేదు. ఆసుపత్రుల్లో భవనాల నిర్మాణాలకు 2022లో నాబార్డు నుంచి రూ.42.89 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయి. సోంపేట, పొందూరు, ఆమదాలవలస, నరసన్నపేట, కోటబొమ్మాళి, కొత్తూరు, పలాస, బారువ, పాతపట్నం ఆసుపత్రుల్లో అధునాతన వసతులతో నిర్మించడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

**వేధిస్తున్న సమస్యలు**

జిల్లాలో ఇప్పటివరకు శిథిల భవనాల్లో ఆసుపత్రులు కొనసాగుతున్నాయి. మరుగుదొడ్లు, నీటి సదుపాయం లేని దుస్థితి. ఇరుకైన గదుల్లో అరకొర వసతులతో నెట్టుకొస్తున్నారు. డ్రైనేజీ సమస్యలు వేధిస్తున్నాయి. వందల సంఖ్యలో వచ్చే రోగులు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం రూ.8 కోట్ల వరకు బకాయిలు చెల్లించింది. కొత్త భవనాల నిర్మాణ పనులు చాలావరకు చివరి దశలో ఉన్నాయి. త్వరితిగతిన పూర్తి చేస్తే రోగులకు అవస్థలు తప్పుతాయి.

**నోటీసులు జారీ చేశాం..**

బకాయిల కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. పనులు ప్రారంభించాలని గుత్తేదారు సంస్థకు నోటీసులు జారీ చేశాం. జూన్ నాటికి అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం. సత్య ప్రభాకర్, ఈఈ, ఏపీహెచ్ఎంఐడీసీ

# అనంతపై డ్రోన్ కన్ను



రాయదుర్గం : నేరాలు జరగక ముందే వాటిని పసిగట్టి నివారణకు చర్యలు తీసుకుంటే నేరాల తీవ్రత చాలా వరకు తగ్గుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నేరాల కట్టడికి డ్రోన్ల వినియోగానికి మొగ్గు చూపింది. జిల్లాకు మూడు చొప్పున డ్రోన్లను అందజేసింది. వీటి వినియోగం వల్ల నేరాలకు చెక్ పడుతోంది. ముఖ్యంగా బహిరంగ మద్యం తాగడం, గంజాయి, జూదం, వ్యభిచారం వంటివి తగ్గుముఖం పట్టాయి. పలు ప్రైవేటు సంస్థల సాయంతో మరిన్ని డ్రోన్లను సమకూర్చుకుని జిల్లా పోలీసు శాఖ ప్రజల రక్షణకు ముందడుగు వేసింది.

**కంపెనీల సాయం:** ఇప్పటికే పలు కంపెనీలు డ్రోన్లు అందజేశాయి. తాడిపత్రిలోని అర్జాస్ కంపెనీ రూ.18.17 లక్షలతో 10 డ్రోన్లు, జిందాల్ స్టీల్ కంపెనీ రూ.10 లక్షలతో 6, సప్తగిరి క్యాంఫర్ సంస్థ రూ.3.10 లక్షలతో 2 డ్రోన్లను అందించాయి. వాటితోపాటు అల్ట్రాటెక్ సోలార్ లైట్లు, మొబిస్ ఇండియా రూ.33 లక్షలతో 300 సోలార్ ఆధారిత సీసీ కెమెరాలు, అదానీ సంస్థ ఎల్ఈడీ డిస్ప్లే వాహనం సమకూర్చాయి.

**ప్రతి రెండు స్టేషన్లకు ఒకటి:** డ్రోన్ల వినియోగం జిల్లాలో గతేడాది నవంబర్ 24 నుంచి పోలీసు శాఖ అందుబాటులోకి తెచ్చింది. జిల్లా కేంద్రంతోపాటు పలు పట్టణాల్లో ఈ కార్యక్రమం సత్ఫలితాలివ్వడంతో డ్రోన్ల సేవలను విస్తరించడానికి ఉన్నతాధికారులు పూనుకున్నారు. మొత్తం 42 పోలీసు స్టేషన్లు ఉండగా 21 డ్రోన్లు అందుబాటులో ఉన్నాయి. సబ్ డివిజన్ల వారీగా అనంతపురం అర్బన్కు 3, అనంతపురం రూరల్కు 4, కళ్యాణదుర్గం 4, గుంతకల్లుకు 4, తాడిపత్రికి 4, హెడ్క్వార్టర్లో 2 వినియోగిస్తున్నారు. ప్రతి పోలీసు స్టేషను నుంచి ఒకరు చొప్పున ఇప్పటికే డ్రోన్ల ఆపరేటింగ్పై శిక్షణ తీసుకున్నారు.

**నేర ప్రాంతాలపై దృష్టి:** జిల్లా వ్యాప్తంగా స్టేషన్ల వారీగా అసాంఘిక కార్యకలాపాలు, నేర ప్రాంతాలను ఇప్పటికే గుర్తించారు. శిక్షణ పొందిన కానిస్టేబుల్ డ్రోన్ ఎగిరే సమయంలో అగుపించే దృశ్యాలను, వ్యక్తులు, ఆయా స్థావరాలను వీడియో ద్వారా గుర్తించి.. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని అనుమానం వస్తే టాస్క్ బృందానికి పంపుతారు. పోలీసులు దాడులు నిర్వహించి నిందితులను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు.

**తక్కువ సమయంలోనే ఫలితాలు:** డ్రోన్లు ఎగుర వేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారు బెంబేలెత్తుతున్నారు. ఈ కార్యక్రమంపై పత్రికలు, టీవీల్లో విస్తృతంగా ప్రచారం జరగడంతో ప్రజల్లో చైతన్యం కలుగుతుంది. పలువురు పోలీసులకు ఫోన్లు చేసి తమ ప్రాంతాలపై కూడా డ్రోన్లు ప్రయోగించాలని కోరుతున్నారు. భద్రత విషయంలో పోలీసులకు డ్రోన్లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. జాతరలు, ర్యాలీలు, ఉత్సవాల్లో ఓ చోట కూర్చుని బందోబస్తుకు సూచనలు చేస్తూ చక్కబరుస్తున్నారు. ఇటీవల సంక్రాంతి, శివరాత్రి, ఉగాది, శ్రీరామనవమి, పరుషల్లో డ్రోన్లను ప్రయోగించి రద్దీని క్రమబద్ధీకరించారు.

అందుబాటులో ఉన్న డ్రోన్లు : 21
ప్రయోగించే పోలీసుస్టేషన్లు : 42
ఇప్పటి వరకు నమోదైన కేసులు : 70

# మేమింతే.. అవసరం లేదంతే!



చిత్తూరు : ఒక గ్రానైట్ క్వారీ కార్యకలాపాలు చేపట్టాలంటే రెవెన్యూ, గనులు, కాలుష్య నియంత్రణ శాఖ అనుమతులు, ప్రజాభిప్రాయ సేకరణ వంటి అనేక తంతులు ఉంటాయి. దరఖాస్తు ఫీజు, డెడ్రెంట్, సీనరేజీ, పర్మిట్ ఇలా రకరకాల ఫీజులు చెల్లించాలి. అవన్నీ కట్టినా ముందస్తుగా ఎవరు అర్జీ ఇస్తారో.. నిబంధనలు పాటిస్తారో వారికే అనుమతులు వస్తాయి. నెలల తరబడి ఓపికగా కార్యాలయాల చుట్టూ తిరగాలి. ఇవేవీ లేకుండానే నియమాలు పాటించకుండానే చిత్తూరు గ్రామీణ మండలంలో అక్రమంగా క్వారీ నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా రోడ్డు వేసుకుని మరీ పొరుగునే ఉన్న తమిళనాడుకు తరలిస్తున్నారు. అధికార యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంటే తప్ప అక్రమార్కులు దారిలోకి వచ్చేలా లేరు. చిత్తూరు గ్రామీణ మండలం తుమ్మింద రెవెన్యూ మర్రిగుంటలో దాదాపు రెండు ఎకరాల్లో అక్రమంగా గ్రానైట్ క్వారీ నిర్వహిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నేత కావడంతో అటువైపు వెళ్లేందుకు ఎవరూ సాహసం చేయడం లేదు. పచ్చటి పొలాల మధ్య దారి ఏర్పాటు చేసుకున్నా అభ్యంతరం చెప్పే నాథుడే లేరు. పైపెచ్చు మధ్యాహ్నం సమయంలో పేలుళ్లు జరుపుతున్నారు. దీంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. 24 గంటలూ పొక్లెయిన్, ఇతర యంత్రాలు అక్కడే మోహరించి సహజ సంపదను వెలికి తీస్తున్నారు. రాత్రిళ్లు గ్రానైట్ను తమిళనాడులోని పరధరామికి తరలిస్తున్నారు. దాదాపు రెండు నెలలుగా ఈ వ్యవహారం జరుగుతోంది. ఇప్పటివరకు రూ.4 కోట్ల విలువైన బ్లాక్లను అక్రమంగా రవాణా చేశారని సమాచారం.

**యంత్రాంగానికి తెలిసినా..** మర్రిగుంట కేంద్రంగా జరుగుతున్న దందా గురించి స్థానిక రెవెన్యూ యంత్రాంగానికి తెలుసు. గనుల శాఖ అధికారులకు సైతం స్థానికులు ఫిర్యాదు చేశారు. అయినా తనిఖీలు చేసి బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు మాత్రం ముందుకు రావడంలేదు. అక్రమార్కుల పలుకుబడికి తలొగ్గారా? లేదంటే కాసులకు కక్కుర్తి పడ్డారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగితే అప్పుడే స్పందిస్తారా? అని రైతాంగం ప్రశ్నిస్తోంది.

**ఖజానాకు గండి పడుతున్నా..**

క్వారీకి అనుమతులు తీసుకోవాలంటే కనీసం రూ.70 లక్షలు– రూ.80 లక్షల వ్యయమవుతుంది. ఇదంతా ప్రభుత్వ ఖజానాకే జమ అవుతుంది. ఆపై పర్మిట్ల రూపంలో నెలకు ప్రభుత్వానికి కనిష్ఠంగా రూ.6 లక్షలు– రూ.8 లక్షలు చెల్లించాలి. జిల్లా ఖనిజ నిధి (డీఎంఎఫ్) కింద కొంత కట్టాలి. ఆ డబ్బుతో గని పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారు. ఇలా అటు సర్కార్కు ఇటు స్థానిక సంస్థలకు చేయూత అందినట్లవుతుంది. ప్రస్తుతం అనుమతులు తీసుకోనందున ఇప్పటికే రూ.కోటి వరకు ఆదాయానికి గండి పడింది. మరోవైపు పర్యావరణ విధ్వంసం జరుగుతోంది. **చర్యలకు వెనుకంజ** గత జగన్ పాలనలో చిత్తూరు మండలంలో అచ్చంగా ఇలాగే అక్రమ రవాణా జరిగింది. అప్పట్లో వైకాపా నేతలే ఇందులో భాగస్వాములు కావడంతో అప్పుడు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గనులు, రెవెన్యూ, పోలీసు శాఖ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి వచ్చింది. అయినా కూడా మీనమేషాలు లెక్కించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# కుక్కలున్నాయ్... పిక్కలు జాగ్రత్త

పుత్తూరు : నగరం అడవి తక్కెళ్లపాడులో ఐజక్(4)ను ఊరకుక్కలు గొంతు కొరికి చంపేశాయి. దీంతో ఆ తల్లిదండ్రుల ఆవేదన వర్ణనాతీతం. ఇలా నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఇలాంటివి జరుగుతునే ఉన్నాయి. కుక్కల వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ ప్రక్రియ అంతా రికార్డులకే పరిమితం అవుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. పుత్తూరు మున్సిపాలిటీలో మొత్తం 1000 పైచిలుకు కుక్కలున్నాయి. గత మూడేళ్లలో 567 కుక్కలకు వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేశారు. మిగిలినవి అలానే తిరుగుతున్నాయి. దీంతో వాటి సంతతి ఏటా పెరుగుతోంది. పలమనేరు మున్సిపాలిటీలో ఈ ఒక్క ఏడాదే 50 మంది కుక్కకాటుకు గురై ఆస్పత్రిలో చేరారు.

న్యూస్టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏటా ఊర కుక్కలకు వ్యాక్సినేషన్, స్టెరిలైజ్ చేస్తున్నట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. ఇదంతా రికార్డులకే పరిమితం అన్నది అక్షర సత్యం. నగరిలో వెయ్యి కుక్కలు, పుత్తూరు 499, పలమనేరులో 1200, పుంగనూరులో 500, కుప్పంలో 1250 వీధికుక్కలు ఉన్నట్లు అధికారుల లెక్క. తిరుపతి జిల్లాలోని నగరపాలక, మున్సిపాలిటీల్లో 15 వేలు ఉన్నాయి. వాటి నియంత్రణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు నామమాత్రమే. నగరపాలక సంస్థ, మున్సిపల్ అధికారులు కుక్కల సంతతి పెరగకుండా వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేపడుతున్నట్లు లెక్కలు చూపుతున్నారు. అయితే నగర, పట్టణాల్లో వీటి సంతతి పెరుగుతోంది తప్ప తగ్గడంలేదు. నిత్యం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కుక్కకాటుకు గురై మృతి చెందిన సంఘటనలు గతంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాటి నియంత్రణకు అధికారులు సక్రమంగా చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. అధికారులు కుక్కల నియంత్రణకు అధిక



ప్రాధాన్యం ఇచ్చి వాటి నుంచి ప్రజలను రక్షించాల్సిన అవసరం ఉంది. **నియంత్రణే మార్గం..:** వీధికుక్కల నియంత్రణకు స్టెరిలైజేషన్ ఒక్కటే మార్గం. కుక్కల పునరుత్పత్తి ప్రక్రియను నియంత్రించేలా శస్త్రచికిత్స చేయడం. ఆడవాటన్నింటికీ ఒకేసారి సంతాన నిరోధక శస్త్రచికిత్స జరిగితేనే వాటి సంతతి తగ్గుతుంది. నగరాల్లో వేలాదిగా, పట్టణాల్లో వందలాది శునకాలకు శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు కార్పొరేషన్, మున్సిపల్, వెటర్నరీ విభాగాల అధికారులు చెబుతున్న మాటలన్నీ డొల్లలేనని పెరుగుతున్న వీటిసంఖ్య చెబుతోంది.

**చర్యలు చేపట్టాలి** నగరాలు, పట్టణాల్లో కుక్కల సంతతి పెరగకుండా నిధులు కేటాయించుకుని వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ పూర్తిగా చేపట్టాలి. అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి. ఏటా కొన్నింటికి మాత్రమే చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. ఒక్కో మున్సిపాలిటీ పూర్తి స్థాయిలో చేపడితే వాటి సంతతి పెరగదు. ఆ దిశగా చర్యలు చేపట్టాలి. విశ్వనాథ్, ఆర్డీ, అనంతపురం

# రాపాక వారి రోడ్డు పంచాయితీ

కాకినాడ: ఖరీదైన నివాసం..చుట్టూ ప్రహరీ.. విశాలమైన సిమెంటు రోడ్డు.. లోనికి ఎవరూ వెళ్లకుండా పెద్ద గేటు.. ఆ భవనం యజమాని పేరు రాపాక వరప్రసాద్. ఆయన వైకాపా నేత, రాజోలు మాజీ ఎమ్మెల్యే.. ఈ రోడ్డు నిర్మాణానికి వెచ్చించింది రాపాక సొంత సొమ్ము కాదు ఎంపీ ల్యాడ్స్ నిధులు.. నాడు వైకాపా ప్రభుత్వ హయాంలో ఇలాంటి పోకడలు ఎన్నో. ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకోలేదు. కూటమి వచ్చాక ఫిర్యాదుదారు మరోసారి గుర్తుచేశారు. దీంతో రోడ్డు పంచాయితీ మళ్లీ తెరమీదికి వచ్చింది.

**అడ్డు చెప్పేదెవరంటూ..**

మలికిపురం మండలం కత్తిమండలోని సర్వే నంబర్ 2/2లో రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్కు 1.60 ఎకరాల స్థలం ఉంది. ఆయన నిర్మించుకున్న ఇంటికి రోడ్డు అవసరం. 2019–20 నాటి ఎంపీ ల్యాడ్స్ నిధులు ఉండడంతో రూ. 4 లక్షల చొప్పున మూడు పనులు (మొత్తం రూ.12లక్షలు) కేటాయించేలా అప్పటి అమలాపురం ఎంపీ చింతా అనురాధ ఆమోదం పొందారు. 2021–22లో రోడ్డు పనులు సాగాయి. వైకాపా నేత సొంతింటికి ఎంపీ ల్యాడ్స్ ఎలా వాడుతారంటూ ఇదే జిల్లాకు చెందిన ఎన్ఆర్ఐ యనుముల వెంకటపతిరాజా అభ్యంతరం తెలిపారు. అప్పటి కలెక్టర్, అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. కేంద్ర ప్రభుత్వ గణాంకాలు– ప్రగతి అమలు మంత్రిత్వశాఖ (ఎంపీ ల్యాడ్స్ డివిజన్)ను ఆయన ఆశ్రయించడంతో తాజాగా ఆరాలు మొదలయ్యాయి.



**ప్రజలు వినియోగిస్తున్నారట..**


వాస్తవమేమిటో నిర్ధారించడానికి జిల్లా పంచాయతీ అధికారి, ఆర్డీవోతో గతయేడాది జనవరిలో కలెక్టర్ ఓ కమిటీ వేశారు. రూ.100 నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్పై రాపాక రాత పూర్వకంగా ఈ భూమిని పంచాయతీకి ఉచితంగా ఇచ్చారని.. భవిష్యత్తులో ఎలాంటి అభ్యంతరం లేవనెత్తబోమని వెల్లడించడంతో తీర్మానం చేసి.. పీఆర్ శాఖ పర్యవేక్షణలో రోడ్డు వేశారని గుర్తించింది. ప్రజలు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగిస్తున్నారని నివేదికలో పేర్కొనడం గమనార్హం. కేంద్ర మంత్రిత్వ శాఖ మళ్లీ ఆరా తీయడంతో..మలికిపురం ఎంపీడీవో, తహసీల్దార్, క్షేత్ర సిబ్బందితో తనిఖీ చేయించారు. ఈ బృందం సైతం ఈ రోడ్డును ప్రజలు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాడుతున్నట్లు జనవరిలో నివేదిక ఇచ్చింది. ఇదే విషయాన్ని ఫిబ్రవరిలో ఎంపీల్యాడ్స్ విభాగం దృష్టికి కలెక్టర్ తీసుకెళ్లారు. ఇంటి చుట్టూ ప్రహరీ, భారీ గేట్లు, ఆ ప్రాంగణం మధ్యలో రోడ్డు ఉంటే స్థానికులు ఎలా వినియోగించుకుంటారనే ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేదు. ప్రజల కోసం ఉచితంగా రోడ్డు నిర్మాణానికి భూమి ఇచ్చారనుకుంటే.. దానిపై యాజమాన్య హక్కులు నేటికీ పంచాయతీకి దక్కలేదు. పంచాయతీ పేరిట భూమి రిజిస్ట్రేషన్ చేశాకే రోడ్డు వేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. నాటి ఉల్లంఘనలు ప్రభుత్వం దృష్టికి వెళ్లకుండా తొక్కిపెట్టే ప్రయత్నాలు నేటికీ సాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# సొంతింటి కల.. సాకారమయ్యేనా..?

కాకినాడ : గత ప్రభుత్వంలో పట్టాలు పొంది, ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ఆర్థిక సమస్యలతో మధ్యలో నిలిపివేసినవాటిని పూర్తిచేసి పేదల కల సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. అయితే లబ్ధిదారుల నుంచి మిశ్రమ స్పందన కనిపిస్తోంది. బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75, రూ.లక్ష చొప్పున అదనపు సాయం మంజూరు చేసినా చాలా మంది ముందుకు రావడం లేదు. **7,742 మందితో..** జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు నిలిపివేసిన 7,742 మంది లబ్ధిదారులను గుర్తించి గత నెలలో వారి నుంచి అంగీకార పత్రాల సేకరణకు గృహ నిర్మాణ సంస్థ అధికారులు సర్వే నిర్వహించారు. 4,002 మంది మాత్రమే అంగీకారం తెలపగా 3,740 మంది ఆసక్తి చూపలేదు. గుర్తించిన పేదలంతా అదనపు సాయంతో గృహాలు పూర్తిచేసుకోవాలనే సంకల్పంతో మరోసారి సర్వేకు ప్రభుత్వం ఆదేశించి ంది. గృహ నిర్మాణ సంస్థ అధికారులు, సిబ్బంది మళ్లీ వెళ్లి అవగాహన కల్పించాలని సూచించింది. దీంతో అధికారులు మళ్లీ ఈనెలలో లబ్ధిదారుల గృహబాట పట్టారు. ఇప్పటికే అంగీకారం తెలిపిన వారికి తొలి విడతగా రూ.4 కోట్ల మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశామని, వెంటనే ఇళ్లు నిర్మించుకోవాలని సూచిస్తున్నారు.

**సరైన సదుపాయాలు లేక..**

జగనన్నకాలనీల్లో సరైన సదుపాయాలు లేవని, అక్కడకు వెళ్లి ఎలా ఉండాలని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.



అప్పట్లో 60 శాతం మంది ఆవాసం ఉంటేనే మౌలిక సదుపాయాలు కల్పించాలనే నిబంధన విధించారు. చాలా కాలనీల్లో ఈ పరిస్థితి లేదు. అరకొరగా విద్యుత్తు, తాగునీరు, రహదారులు కల్పించారు. కొన్నిచోట్ల తాగునీటి సరఫరా, వీధి దీపాల వ్యవస్థను సక్రమంగా తీర్చిదిద్దలేదు. దీంతో చాలా మంది ఆయా కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు. అదనపు సాయంతో నిర్మించుకోవాలని అవగాహన కల్పించినా.. సదుపాయాలు లేవని చెబుతున్నారని సర్వే సిబ్బంది వాపోతున్నారు.

**అంగీకార పత్రాలు తీసుకుంటున్నాం..**

ఈ విషయమై జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి ఎన్వీవీ సత్యనారాయణను వివరణ కోరగా మరోసారి లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఇళ్ల నిర్మాణాలకు అంగీకార పత్రాలు తీసుకుంటున్నామని చెప్పారు. అదనపు ఆర్థికసాయంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అదనపు సాయం కింద జిల్లాకు రూ.12 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. గృహ నిర్మాణానికి అంగీకారం తెలిపిన వెంటనే సంబంధిత పత్రాన్ని లబ్ధిదారులకు అందిస్తున్నామని, ఆ వెంటనే తొలి విడత ఆర్థికసాయాన్ని ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. ఇంకా మిగిలిన 3,740 మంది ఇళ్లకు వెళుతున్నామని, ఈసారి ఎక్కువ మంది అంగీకారం తెలిపే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# లక్ష్యానికి దూరంగా.. గత ఆదాయానికి చేరువగా..!

తిరుపతి : జిల్లాలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ తన ఆదాయ లక్ష్యంలో 65 శాతమే చేరుకోగలిగింది. గత పాలకుల తప్పిదాలు సరిదిద్దే క్రమంలో ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం, నిబంధనలు పకడ్బందీగా అమలుపరచడంతోపాటు స్థిరాస్తి రంగంలో నెలకొన్న స్తబ్ధతతో ఈ పరిస్థితి ఎదురైనట్లు తెలుస్తోంది. శ్రీకాళహస్తి, సత్యవేడు సబ్ డివిజన్‌లో డీకేటీ భూములు.. గూడూరు సబ్ డివిజన్లో చుక్కల భూములకు సంబంధించి దాదాపు రెండువేల ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లు గత ఏడాది జరిగాయి. పేద రైతుల భూములను వైకాపా పెద్దలు లాక్కున్నారనే ఆరోపణలపై ప్రస్తుత ప్రభుత్వం మే 15వ తేదీ వరకు



నిషేధం విధించింది. అలాగే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో క్రయవిక్రయాల ఊపు తగ్గడం మరో కారణమైంది. ప్రపంచ దేశాల్లో ఉన్న తెలుగువారి సంపాదన తగ్గడంతో.. జిల్లాలో వారి కుటుంబ సభ్యులు ఆస్తుల కొనుగోలు తగ్గినట్లు సమాచారం. ఇదివరకు తితిదే ఉద్యోగులకు ఇంటి స్థలాల కేటాయింపుతో దాదాపు ఐదువేలు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ప్రస్తుతం అవి ఆగిపోవడం కొంత ప్రతికూలంగా మారింది.

**సగానికిలోపే రిజిస్ట్రేషన్లు..** 2023-24లో 1,823 దస్త్రాలు రిజిస్ట్రేషన్ చేయగా 2024-25లో 880 పత్రాలు మాత్రమే సాధ్యమైంది. ఆ మేరకు దస్త్రాల రిజిస్ట్రేషన్ తగ్గింది. రూ.521.74 కోట్లు రాగా ఈసారి రూ.507.18 కోట్లు వచ్చింది. పూర్వ ఏడాది ఆదాయంతోపోల్చితే రూ.14.56 కోట్ల ఆదాయం తగ్గింది.

# కృష్ణమ్మ చేరాలి.. కరవు తీరాలి

డోన్ : రాయలసీమ జీవనాడి హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాల్వ విస్తరణపై దృష్టి సారించింది. ఇందుకు ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో రూ.660 కోట్లు వెచ్చించాలని నిర్ణయించారు. 6.35 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పనులు మొదలయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 134 కి.మీ మేర కాల్వ విస్తరించి ఉంది.. 35 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. కాల్వలో నీటి ప్రవాహ సామర్థ్యాన్ని 2,100 క్యూసెక్కుల నుంచి 3,850 క్యూసెక్కులకు పెంచేలా పనులు జూన్ 15 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ కాల్వ నీటి ఆధారంగా నీటిని తరలించే చెరువులను బాగు చేయాలని స్థానిక రైతులు విన్నవిస్తున్నారు.

**ట్రయల్ రన్‌తో సరిపెట్టిన వైకాపా**

ఏటా కరవు పరిస్థితులు నెలకొనే పశ్చిమ ప్రాంతానికి సాగు నీరు అందించాలని గతంలో తెదేపా హయాంలో నిర్ణయించింది. 68 చెరువుల్లోకి హంద్రీనీవా ప్రధాన కాల్వ ద్వారా కృష్ణాజలాలు తరలించి బీడు భూములను సస్యశ్యామలం చేయాలన్నది ప్రాజెక్టుల లక్ష్యం.. ఇందుకు రూ.224.31 కోట్లు కేటాయించి 60 శాతం పనులు పూర్తి చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా.. చెరువుల సంఖ్యను 77కు పెంచింది.. పనులు పూర్తి చేయకుండానే ఎన్నికల ముందు



ప్రారంభోత్సవం చేసి ట్రయల్ రన్‌తో సరి పెట్టారు.

**నిర్వహణకు నిధులు కావాలి**

చెరువుల ద్వారా పొలాలకు నీరందాలంటే ఏటా రూ.1.69 కోట్ల నిర్వహణ (ఓఅండ్ఎం) నిధులు తప్పనిసరిగా విడుదల చేయాల్సి ఉంది. విడుదల చేయకుంటే రూ.242 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు నిరుపయోగమయ్యే ప్రమాదముంది. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు.

**చెరువుకు చేరని నీరు**

హంద్రీ ప్రధాన కాల్వకు ఇరువైపులా ఉన్న రైతులు కి.మీ. మేర పైపులు ఏర్పాటు చేసుకుని, విద్యుత్తు లేదా డీజిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని పంటలకు నీరందిస్తున్నారు.

ఇప్పటి వరకు ఒక్క చెరువు వద్ద కూడా పూర్తిస్థాయి పనులు చేపట్టలేదు. అధికారులు మాత్రం పనులన్నీ పూర్తైనట్లు.. వంద శాతం మేరకు నీటిని నింపుతున్నట్లు ఉన్నతాధికారులకు నివేదికలు ఇస్తున్నారు. ప్యాపిలి మండలం నాయనిచెరువు, గుడిపాడు, కలచట్లలో నీటి జాడనే లేదు. డోన్ మండలం వెంకటాపురం చెరువు కింద 1740 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇలాంటి వాటి విస్తీర్ణం పెంచాలని రైతులు విన్నవిస్తున్నారు. చాలా చెరువులో పూడిక తీయలేదు. కనీసం ముళ్లపొదలు తొలగించ లేదు. కట్టల బలోపేతం మరిచారు. హంద్రీ కాల్వ నుంచి చెరువులకు నీళ్లు వెళ్లే మార్గం(గ్రావిటీ)లో పూడిక తీయలేదు.. ఇరువైపులా ముళ్లపొదలు ఉండటంతో సాగు నీరు ముందుకెళ్లని పరిస్థితి నెలకొంది. పైపులైన్లు పూర్తిగా వేయలేదు. కృష్ణగిరి మండలం ఆలంకొండ- కటారుకొండ గ్రామాల మధ్య ఇప్పటికీ అలాగే వదిలేశారు.

ఎంపిక చేసిన చెరువులు : 77
డోన్ (36), పత్తికొండ (35), ఆలూర (4), పాణ్యం (2)
నీటి కేటాయింపు : 1.238 టీఎంసీలు
మొత్తం ఆయకట్టు : 10,450 ఎకరాలు
లబ్ధి పొందే గ్రామాలు : 61
వేయాల్సిన పైపులైన్ల పొడవు : 192.76 కి.మీ.లు

# ఉచితం మాటున ఇసుక దందా



తాడిపత్రి : తాడిపత్రి నియోజకవర్గ వ్యాప్తంగా పెన్నానది వేదికగా ఇసుకను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని ఆసరాగా తీసుకొని ఇసుకను సరిహద్దులు దాటిస్తున్నారు. పెన్నానది నుంచి పగలు ట్రాక్టర్లతో తరలించి రహస్య ప్రదేశాల్లో నిల్వ చేస్తున్నారు. రాత్రి కాగానే టిప్పర్లు, లారీల్లో అనుకున్న ప్రాంతానికి తరలిస్తున్నారు. పెన్నానదిలో పొక్లెయిన్లను సైతం వినియోగించి తవ్వకాలు చేపడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.

**ఈ గ్రామాల్లోనే అధికంగా..**

తాడిపత్రి మండలంలోని గంగాదేవిపల్లి, ఇగుడూరు, ఆలూరు, సజ్జలదిన్నె, చిన్నపొడమల నందలపాడు, శ్రీనివాసపురం, పెద్దపప్పూరు మండలంలోని జోడీ ధర్మాపురం, చింతలపల్లి, చాగల్లు, కుమ్మెత, బొందలదిన్నె, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలంలోని కొండూరు, చిట్టూరు, చిత్రచేడు, నాగలాపురం, ఈరన్నపల్లి తదితర ప్రాంతాల నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు.

**దర్జాగా సరిహద్దులు దాటిస్తూ..**

నది నుంచి ఇసుకను తోడి రహస్య ప్రదేశాల్లో నిల్వ చేస్తున్నారు. ఆతర్వాత టిప్పర్లు, లారీల ద్వారా బళ్లారి, కర్నూలు, నంద్యాల, అనంత పురం, బెంగళూరు ప్రాంతాలకు తరలించి రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇసుక అక్రమంగా తరలించే వాహనాలు కళ్లెదుటే వెళుతున్నా నియంత్రించాల్సిన కొందరు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

**60 కి.మీ. పరిధిలో దోపిడీ**

తాడిపత్రి నియోజకవర్గం పరిధిలో మండలం, పట్టణం, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల పరిధిలో దాదాపు 60 కి.మీ మేర పెన్నానది విస్తరించింది. నది నుంచి ఆయా మండలాల పరిధిలో నిత్యం వందలాది ట్రాక్టర్లతో పట్టపగలే ఇసుకను తరలిస్తున్నారు. స్థానికంగా ఉన్న వారైనా తరలించాలంటే అధికారుల అనుమతి ఉండాల్సిందే అని నిబంధన ఉన్నా ఎవరూ పాటించడం లేదు.

**అనుమతులు ఉండాల్సిందే** -ఓబుళరెడ్డి, భూగర్భ గనులశాఖ, ఏడీ, తాడిపత్రి

భూగర్భ గనుల శాఖ నుంచి పెన్నానదిలో ఇసుక తవ్వుకోవాలని తాడిపత్రి నియోజకవర్గ పరిధిలో ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. స్థానికంగా ఉన్న తహసీల్దార్లు వాల్టా చట్టం ప్రకారం ప్రభుత్వ నిబంధనలు అనుసరించి తవ్వకాలకు అనుమతులు ఇవ్వొచ్చు. మరి అనుమతి ఇచ్చారో లేదో తెలియదు. నియోజకవర్గంలోని తహసీల్దార్లు, పోలీసు అధికారులతో చర్చించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

# నిషేధిత ప్లాస్టిక్ విక్రయాల అడ్డా ధర్మవరం!



ధర్మవరం : ధర్మవరం నిషేధిత పాలిథిన్ కవర్లు, సామగ్రి సరఫరా చేసే కేంద్రంగా మారింది. జిల్లాలోని పలు పట్టణాలకు, మండల కేంద్రాలకు, పల్లెలకు ఇక్కడి నుంచే వాటిని రహస్యంగా చేరవేస్తున్నారు. రోజూ సుమారుగా రూ.20 నుంచి రూ.25 లక్షల విలువచేసే మూడు టన్నుల నిషేధిత కవర్లు, గ్లాసులు, ఇతర సామగ్రి దుకాణాలకు సరఫరా చేస్తూ.. కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ధర్మవరంలో వివిధ వస్తువుల డీలర్‌షిప్ తీసుకున్న కొందరు డీలర్లు నిషేధిత పాలిథిన్ కవర్లు, సామగ్రి దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. మున్సిపాలిటీలో నిషేధిత ప్లాస్టిక్ వ్యర్థాలు రోజూ 0.5 - 1 టన్నుల వరకు పారిశుద్ధ్య కార్మికులు సేకరిస్తున్నారంటే వాటి విక్రయాలు ఏ స్థాయిలో ఉందోఅంచనా వేయవచ్చు.

**తనిఖీలు చేయకుండా కట్టడి చేస్తున్న డీలర్లు**

పట్టణంలోని ఎన్టీఆర్, అంజుమన్, మదీనా మసీదు సర్కిల్‌లో సిండికేట్‌గా ఏర్పడిన కొందరు వ్యాపారులు శివారు ప్రాంతంలో రహస్యంగా గోదాములు బాడుగకు తీసుకుని ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తున్నారు. ప్రధానంగా ముగ్గురు డీలర్లు నిషేధిత వస్తువులను పెద్ద మొత్తం వాటిని ఇక్కడికి తెప్పించుకుని జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. పట్టుబడితే రాజకీయ నాయకులను ఆశ్రయించి కేసులు లేకుండా చేస్తున్నారనే విమర్శలున్నాయి. తమ గోదాములు తనిఖీ చేయకుండా అధికారులను ధనం.. రాజకీయ బలంతో కట్టడి చేస్తున్నారని తెలిసింది. బల్క్‌లో ఆర్డర్ ఇచ్చిన వారికి డీలర్లే డెలవరీ చేస్తున్నారు. తక్కువ మొత్తంలో కావాల్సిన వారు డీలర్ల దగ్గరకు వచ్చి తీసుకెళ్తున్నారు.

**కలెక్టర్ ఆదేశాలతో ..**

పర్యావరణానికి, మానవాళి మనుగడకు నష్టం కల్గిస్తున్న వాటిని నిషేధిస్తూ.. విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని ఇటీవల వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆ మరుసటి రోజే కలెక్టర్ శ్రీసత్యసాయి జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, శానిటేషన్ శాఖాధికారులతో సమావేశం నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ విక్రయం, వినియోగంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధర్మవరం నుంచే జిల్లాలోని మున్సిపాలిటీలకు ఎక్కువగా ప్లాస్టిక్ వస్తువులు చేరుతున్నాయని కలెక్టర్ దృష్టికి వచ్చింది. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారని సమాచారం. దీంతో పట్టణంలోని గోదాముల్లో మున్సిపల్ అధికారులు తనిఖీలు చేశారు. 600 కిలోల నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. రూ.లక్ష దాకా జరిమానా విధించారు.

**కఠిన చర్యలు తప్పవు**

ప్రమోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, ధర్మవరం

ధర్మవరం పట్టణంలో కొందరు వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు బల్క్‌గా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో వారి గోదాములపై దాడి చేసి అన్నింటిని సీజ్ చేశాం. భారీగా జరిమానాలు విధించాం. ఎవరైనా వాటిని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోము. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

# పంట కుంట.. రైతులకు ఊరట



రాయదుర్గం : కరవు జిల్లాలో వర్షపు నీటిని పొదుపు చేసి భూగర్భ జలాలను పెంచటానికి కూటమి ప్రభుత్వం పంట కుంటలను ప్రోత్సహిస్తోంది. ప్రతి రైతు తన పొలంలో పంట కుంటలను తవ్వుకుని వర్షపు నీటిని పొదుపు చేస్తే వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. వర్షాభావ, బెట్ట పరిస్థితుల్లో కుంటల్లోని నీటితో వివిధ రకాల పంటలు పండించవచ్చు. కూలీలకు ఆ గ్రామాల్లోనే ఉపాధి పనులు కూడా లభిస్తాయి. వేసవిలో బోర్లలో భూగర్భజలాలు సమృద్ధిగా లభిస్తాయి.

**లక్ష్యానికి మించి మంజూరు :** జిల్లాలో ప్రభుత్వం 9,000 పంట కుంటలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే రైతుల నుంచి సానుకూల స్పందన రావటంతో 10,561 పంట కుంటలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఉగాది, రంజాన్ పండగలు పూర్తి కావటంతో కుంటల తవ్వకం పనులు ఊపందుకున్నాయి. మరో రెండు వారాల్లో వాటిని పూర్తి చేసేందుకు డ్వామా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కువ పొలం ఉన్న రైతులు 10 అడుగుల వెడల్పుచ 10 అడుగుల పొడవు, ఆరడుగుల లోతు వరకు కుంటలను తవ్వుకోవచ్చు. లోతు ఎక్కువగా తవ్వాలనుకునే రైతులు మరో నాలుగడుగులకు వారే సొంతంగా భరించాల్సి ఉంటుంది. ఒక్కో పంట కుంటకు ప్రభుత్వం రూ.46,800 చెల్లిస్తుంది. సన్న, చిన్నకారు రైతులు 5 అడుగుల పొడవు, 5 అడగుల వెడల్పుతో తక్కువ పరిమాణంలో కుంటలను నిర్మించుకోవచ్చు. ఈ కుంట నిర్మాణానికి ప్రభుత్వం రూ.24,000 మంజూరు చేస్తుంది.

**సద్వినియోగం చేసుకోవాలి**

- సలీంబాషా, డ్వామా పీడీ, అనంతపురం

జిల్లాల్లో ఎర్రనేలలు ఎక్కువగా ఉంటాయి. వర్షాలు కురిసిన సమయంలో నీటిని కుంటల్లో నిల్వ ఉంచితే భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల్లో నీరు సమృద్ధిగా లభిస్తాయి. పంటల సాగుతోపాటు ఇతర అవసరాలకు ఉపయోగపడతాయి. వర్షాభావ పరిస్థితుల సమయంలో ఈ నీటి ద్వారా పంటలకు రక్షక తడులు ఇచ్చుకోవచ్చు. ఫారంపాండ్ల చుట్టూ పండ్లు, కూరగాయల మొక్కలు సాగు చేసుకొని అదనపు ఆదాయాన్ని రైతులు పొందేందుకు అవకాశం ఉంటుంది.

జిల్లాలో మంజూరు చేసిన పంట కుంటలు: 10,561
ప్రారంభించిన పనులు: 2,564
పూర్తయినవి : 590

# జోరుగా హంద్రీనీవా పనులు

అనంతపురం: ప్రజల కోసం పనిచేయాలనే తపన.. చిత్తశుద్ధి పాలకులకు ఉంటే ఎంతటి పనులైనా చేయవచ్చని చెప్పడానికి హంద్రీనీవా విస్తరణే నిదర్శనం. జిల్లాలో కాలువ పనులు జోరుగా సాగుతున్నాయి. రెండు వారాల్లోనే 15 శాతం పూర్తి అయ్యాయి. ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ నిత్యం పర్యవేక్షిస్తున్నారు. జూన్ 10 నాటికి వందశాతం విస్తరణ పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. మార్చి 8న మల్యాల నుంచి నీటి పంపింగ్ నిలిపివేశారు. 8 రోజుల పాటు కాలువలో నిలిచిన నీటిని ఎత్తిపోశారు. తర్వాత బురద తొలగించి 20 నుంచి పనులు మొదలుపెట్టారు. కంపచెట్లను తొలగించి దారులు ఏర్పాటు చేశారు. గట్లపై ఉన్న మట్టిని తీసేసి పనులకు ఆటంకం లేకుండా చేసుకున్నారు.

క్షేత్రస్థాయిలో 195 పొక్లెయిన్లు, 292 భారీ వాహనాలతో పనులు సాగుతున్నాయి. ప్యాపిలి, రాగులపాడు, ఉరవకొండ, లత్తవరం, కొట్టాలపల్లి ప్రాంతాల్లో పనులు దాదాపు పూర్తయ్యాయి.

**సవాళ్లను అధిగమిస్తూ..** అనంత జిల్లా పరిధిలో 81 కి.మీ మేర విస్తరణ పనులు చేస్తున్నారు. కాలువను 12 నుంచి 19 మీటర్లకు పొడిగిస్తున్నారు. రాగులపాడు, గుంతకల్లు, కసాపురం ప్రాంతాల్లో రాతిపొర తొలగించాల్సి ఉంది. ఉరవకొండ మండలంలో బురద ఉ



ండటంతో పనులు కష్టంగా మారుతున్నాయి. వాటిని అధిగమిస్తూ పనులు సాగుతున్నాయి.

**ఇదీ పరిస్థితి..**

ఫేజ్-1లో విస్తరణ: 88-216 కి.మీ
అనంతపురం జిల్లాలో: 134-216 కి.మీ
విలువ: రూ.440 కోట్లు
నిర్మించే తూములు: 19
ఈనెలాఖరుకు లక్ష్యం: 40 కి.మీ

# పన్ను రాయితీ.. వసూళ్లలో పురోగతి

ఆత్మకూరు : పురపాలక సంఘాల్లో ఆస్తి పన్ను బకాయిలు ఏళ్ల తరబడి పేరుకుపోయాయి. అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా చాలామంది ఆస్తుల యజమానులు పన్ను బకాయిలు చెల్లించడం లేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం పన్ను వసూళ్లపై దృష్టి పెట్టింది. గత ఆర్థిక సంవత్సరం మార్చి నెలాఖరులోగా పన్ను చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ మాఫీ చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు వసూలు కాలేదు. ఈ క్రమంలో వందశాతం పన్ను వసూలే లక్ష్యంగా మొత్తం పన్నులో 5 శాతం రాయితీ ప్రకటిస్తూ ఈనెల 4న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**ప్రత్యేక కార్యాచరణ**

రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ప్రకటించటంతో ప్రజలు పన్నులు



చెల్లించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈనెల 4వ తేదీన పన్ను రాయితీ ప్రకటించినా శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో చెల్లింపులకు వీలుకాలేదు. సోమవారం ఉదయం 10 గంటల నుంచే పలువురు పన్ను చెల్లించేందుకు పురపాలక కార్యాలయాల్లో బారులుతీరారు. రూ.5 వేల నుంచి రూ.30 వేల వరకు బకాయిలు ఉన్న వారు కార్యాలయాలకే వచ్చి చెల్లిస్తున్నారు. ప్రజల నుంచి స్పందన చూసి పురపాలక అధికారులు పన్ను చెల్లింపుదారులకు కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ వేడిమి తగలకుండా రేకులు, తడికెలతో షెడ్లు ఏర్పాటు చేసి నీటివసతి కల్పించారు. వృద్ధులు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు. పన్నుల వివరాలు తెలియజేసేందుకు ప్రత్యేక కౌంటరును ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు.

# భవితకు ఊతం

డోన్ : గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వం 'భవిత' కేంద్రాలను వదిలేసింది. దీంతో దివ్యాంగ బాలలు ఇబ్బంది పడ్డారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 55 భవిత కేంద్రాలు ఉన్నాయి. 10 వేల మంది వరకు దివ్యాంగ బాలలు ఉండగా 1,370 మందే కేంద్రాలకు వస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది పేద కుటుంబాలకు చెందిన వారే. 'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భవిత కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. అలవెన్సులు పిల్లల తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.. సిబ్బందికి సకాలంలో వేతనాలు మంజూరు చేస్తున్నారు. అదేవిధంగా బాలలకు అవసరమైన ఉపకరణాల పంపిణీకి రంగం సిద్ధం చేసింది.

**భత్యం విడుదల చేసి**

రవాణా భత్యం కింద పది నెలలకు ఒక్కో విద్యార్థికి రూ.3 వేలు, పీఎంశ్రీ పాఠశాల దివ్యాంగ బాలికలకు స్టైపండ్ కింద పది నెలలకు రూ.3వేలు, మిగతా పాఠశాలల్లోని బాలికలకు రూ.2వేలు, బడికి స్వతహాగా వెళ్లలేని పిల్లల సహాయకులకు ఎస్కార్ట్ అలవెన్స్ రూ.3వేలు ఇవ్వాలి. వైకాపా ప్రభుత్వం వీటిని ఇవ్వలేదు. దీంతో పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు ఇబ్బంది పడ్డారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది నవంబరులో అలవెన్స్ నిధులను మంజూరు చేసింది. నంద్యాల జిల్లాకు రూ.87,28,000, కర్నూలు జిల్లాకు రూ.49,45,000 చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేశారు.

**త్వరలో శిబిరాల నిర్వహణ**

గతేడాది ఆదోని, కర్నూలులో ఉచిత వైద్య ఉపకరణాల నిర్ధారణ శిబిరాలు నిర్వహించి అవసరమైన ఉపకరణాల తయారు చేయించారు. ఈ మేరకు కర్నూలు జిల్లాకు రూ.10 లక్షలు విలువ చేసే వివిధ రకాల ఉపకరణాలు వచ్చాయి. ఎంపికైన పిల్లలకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి త్వరలో పంపిణీ చేయనున్నారు. త్వరలో ప్రత్యక్షంగా చూపిస్తూ బోధించే బోధనోపకరణాలకు సంబంధించి 31 కిట్లు రానున్నట్లు అధికారులు తెలిపారు. నంద్యాల జిల్లాలో రెండేళ్లుగా ఉచిత వైద్య ఉపకరణాల నిర్ధారణ శిబిరాలు నిర్వహించని కారణంగా ఉపకరణాలు మంజూరు కాలేని పరిస్థితి నెలకొంది.

## మిల్కీ బ్యూటీ అందం తగ్గదా..?

మిల్కీ బ్యూటీ తమన్నా ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు దాటింది. అయినా కూడా జోరు తగ్గడం లేదు. ఇప్పటి వరకు మిల్కీ బ్యూటీ తమన్నా వరుస సినిమాలతో బిజీ బిజీగానే ఉంది. కొన్నాళ్ల క్రితం మిల్కీ బ్యూటీ తమన్నా పనై పోయింది అంటూ కొందరు కామెంట్ చేశారు. ఆ సమయంలోనే తమన్నా సినిమాలకు గుడ్ బై చెబుతుందేమో అని అంతా అనుకున్నారు. కానీ ఆమె పట్టుదలతో సినిమాల్లో కొనసాగింది. ఆ సమయంలో కాస్త ఆఫర్లు తగ్గినా కూడా వెబ్ సిరీస్‌లు, ఐటెం సాంగ్స్‌తో కెరీర్‌ను నిలబెట్టుకుంది. ఇప్పుడు మరోసారి మిల్కీ బ్యూటీ తమన్నా కెరీర్ పీక్స్‌లో ఉంది. హిందీ, తెలుగు భాషల్లోనే కాకుండా ఇతర భాషల్లో కూడా వరుస సినిమాలు చేస్తోంది. ఇటీవల ఈమె ఓదెల 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలో లేడీ అఘోరి పాత్రలో నటించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. శివశక్తి పాత్రతో ఓదెల సినిమాలో అద్భుతమైన నటన కనబర్చిన తమన్నా మరోసారి తన నట విశ్వరూపం చూపించింది. తెలుగులో చాలా రోజుల తర్వాత తమన్నా చేసిన ఓదెల 2 నిరాశ పరచింది. అయినా కూడా ఆమె మరిన్ని సినిమాల్లో నటించేందుకు ఆ సినిమా బూస్ట్ గా నిలిచింది అనడంలో సందేహం లేదు. ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా కాలం అయినా ఇప్పటికీ ఆమెకు ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు అనడంలో సందేహం లేదు. సోషల్ మీడియాలోనూ ఆమె ఫాలోయింగ్ అదే స్థాయిలో ఉంది. ఇన్‌స్టాగ్రామ్



లో తమన్నాకి దాదాపుగా మూడు కోట్ల మంది ఫాలోవర్స్ ఉంటారు. వారిని ఎంటర్‌టైన్ చేసేందుకు గాను అందాల ఆరబోత ఫోటోలతో రెగ్యులర్‌గా రెచ్చి పోతూనే ఉంటుంది. తాజాగా మరోసారి మిల్కీ బ్యూటీ రెడ్ డ్రెస్‌లో తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. సాధారణంగా హీరోయిన్స్ రెడ్ డ్రెస్‌లో చాలా అందంగా కనిపిస్తూ ఉంటారు. తమన్నా ఈ ఫోటోల్లో మరింత అందంగా కనిపిస్తుంది అంటూ అభిమానులు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మిల్కీ బ్యూటీ తమన్నా షేర్ చేసిన ఈ ఫోటోలు ఆమె పై అభిమానంను మరింత పెంచే విధంగా ఉన్నాయని, ఈమె ఇండస్ట్రీలో అడుగు పెట్టి 20 ఏళ్లు అయిందంటే నమ్మశక్యంగా లేదని కొందరు అంటున్నారు. ఈ ఏడాది ఇప్పటికే ఓదెల 2, రైడ్ 2 సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన తమన్నా మరో రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కేవలం హీరోయిన్‌గానే నటిస్తాను అనే పట్టింపు లేకుండా వచ్చిన ప్రతి ఒక్క ఆఫర్‌ను ఈ అమ్మడు స్వాదీనం చేసుకుంటూ దూసుకు పోతుంది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ఈమె సొంతం. ఈమె ఇటీవల ప్రేమలో విఫలం అయిందనే విషయం తెల్సిందే. ఆ మధ్య ఈమె పెళ్లికి సంబంధించిన వార్తలు వచ్చాయి. ఇటీవల ప్రేమ విఫలం కావడంతో పెళ్లి మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నటిగా తమన్నా మరింత బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## బుట్టబొమ్మని గట్టెక్కించేది ఆ ఇద్దరేనా?

ఫిల్మ్ ఇండస్ట్రీలో కొంత మంది క్రేజ్ ఎంత రాకెట్ స్పీడుతో పెరుగుతుందో అంతే స్పీడుగా పడిపోతుంటుంది. ఇలియానా, శ్రీలీల ఇప్పుడు బుట్టబొమ్మ పూజా హెగ్డే. ఈ ముగ్గురు టాలీవుడ్‌లో ఎంత స్పీడుగా ఎదిగారో అంతే స్పీడుగా ఫ్లాపుల్ని ఎదుర్కొన్నారు. ఇప్పటికీ ఎదుర్కొంటున్నారు. దానికి కారణం వారు ఎంచుకున్న సినిమాలే. ఇలియాన రాకెట్ స్పీడుతో ఎదిగి అంతే స్పీడ్‌తో తెరమరుగైపోయింది. ఇప్పుడు ఆ పరిస్థితిని బుట్టబొమ్మ పూజాహెగ్డే ఎదుర్కొంటోంది. డీజే దువ్వాడ జగన్నాథంమూవీతో బిగ్ డైరెక్టర్ల దృష్టిని ఆకర్షించిన పూజా హెగ్డే అనతికాలంలోనే వరుసగా క్రేజీ ఆఫర్లని దక్కించుకుని టాక్ ఆఫ్ ది టాలీవుడ్‌గా నిలిచింది. బన్నీ అలవైకుంఠపురం%-% వరకు అదే హవాని కొనసాగిస్తూ భారీగా డిమాండ్ చేసిన పూజా హెగ్డే ఆ తరువాత నుంచి వరుస ఫ్లాపుల్ని ఎదుర్కొంటూ కెరీర్ పరంగా ఎదురీదుతోంది. రాధేశ్యామ్, బీస్ట్, ఆచార్య, బాలీవుడ్‌లో సర్కస్, కిసీకి భాయ్ కిసీకి జాన్, దేవ వంటి సినిమాలతో వరుస ఫ్లాపుల్ని ఎదుర్కొని షాక్




ఇచ్చింది. ఈ సినిమాలతో పూజా హెగ్డే వరుసగా రికార్డు స్థాయిలో 7 ఫ్లాపుల్ని దక్కించుకోవడం గమనార్హం. తాజాగా సూర్య, కార్తీక్ సుబ్బరాజ్‌ల రెట్రోతోనూ ఫ్లాప్‌ని ఎదుర్కోవడంతో బుట్టబొమ్మ కెరీర్ ఇక అంతేనా అనే అనుమానాలు మొదలయ్యాయి. తాజా పరిణామాల నేపథ్యంలో పూజా హెగ్డేకు టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లలో అవకాశాలు తగ్గే అవకాశం ఉందనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తనని, తన కెరీర్ ని కాపాడేది ఆ ఇద్దరే అనే చర్చ మొదలైంది. ఆ ఇద్దరు దళపతి విజయ్, రాఘవ లారెన్స్. విజయ్ తన చివరి సినిమా జన నాయగన్ చేస్తున్న విషయం తెలిసిందే. హెచ్.వినోద్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో విజయ్‌కి జోడీగా బుట్టబొమ్మ నటిస్తోంది. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ మూవీని వచ్చే ఏడాది జనవరి 9న రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా ఫలితంపైనే పూజా హెగ్డే కెరీర్ ఆధారపడి ఉంది.

ఇక ఈ మూవీ తరువాత పూజా హెగ్డే హారర్ థ్రిల్లర్ కాంచన 4లో నటిస్తోంది. కాంచన ఫ్రాంచైజీలో భాగంగా రాఘవ లారెన్స్ రూపొందిస్తున్న ఈ మూవీ కూడా పూజా హెగ్డేకు కీలకంగా మారింది. తొలి సారి తను చేస్తున్న హారర్ థ్రిల్లర్ కావడం, కాంచన సీక్వెల్ కావడంతో అందరి దృష్టి ఈ ప్రాజెక్ట్‌పై పడింది. బుట్టబొమ్మకు ఈ రెండు సినిమాలు హిట్ ని అందిస్తే మరిన్ని సినిమాలు వచ్చే అవకాశం ఉంది. లేదంటే ఇక కెరీర్ ముగిసినట్టే అని ఇన్ సైడ్ టాక్.




## క్రేజీ సీక్వెల్స్ వారికి బ్రహ్మాస్త్రాలేనా?




కెరీర్‌లో టాప్ హిట్ లని, బ్లాక్ బస్టర్లని, పాన్ ఇండియా హిట్‌లని సొంతం చేసుకున్న హీరోలు, డైరెక్టర్లు మన టాలీవుడ్‌లో ఉన్నారు. అయితే వాళ్లకి సీక్వెల్స్ ఇప్పుడు బ్రహ్మాస్త్రాలుగా మారుతున్నాయి. కెరీర్‌లో డౌన్ అయ్యామని భావించిన వారికి సీక్వెల్స్ వారికి కెరీర్‌ని కాపాడి మళ్లీ ట్రాక్‌లోకి తీసుకొచ్చే భారీ బ్రహ్మాస్త్రాలవుతున్నాయి. ఇప్పుడు అవే బ్రహ్మాస్త్రాల కోసం అటు హీరోలు, ఇటు దర్శకులతో పాటు సగటు సినీ లవర్ కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు. అవే కార్తికేయ 3, పుష్ప 3, కేజీఎఫ్ 3, హిట్ 4. చందూ మొండేటి, నిఖిల్‌ల కెరీర్‌కు కార్తికేయ సిరీస్ సినిమాలు ఎంత వరకు ఉపయోగపడ్డాయో తెలిసిందే.

దర్శకుడిగా చందూ మొండేటికి, హీరోగా నిఖిల్‌కు ఈ సినిమాలు మంచి గుర్తింపుని తెచ్చిపెట్టాయి. తండేల్ తరువాత చందూ మొండేటి మరో సినిమా కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. నిఖిల్ రెండు ప్రాజెక్ట్‌లు స్వయంభు, ది ఇండియా గేట్ సినిమాలు చేస్తున్నాడు. వీరిద్దరి కెరీర్ ఫ్యూచర్ లో ఎప్పుడన్నా డౌన్ అయిందనే పరిస్థితి తలెత్తితే బ్రహ్మాస్త్రంగా కార్తికేయ 3-ని తెరపైకి తీసుకొస్తారు. మళ్లీ ట్రాక్‌లోకొస్తారు. ఇక అల్లు అర్జున్ కూడా అంతే. ప్రస్తుతం బన్నీ తమిళ డైరెక్టర్ అట్లీతో భారీ పాన్ వరల్డ్ మూవీకి శ్రీకారం చుడుతున్న విషయం తెలిసిందే. దీని తరువాత మరో ప్రాజెక్ట్ కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చే ఆలోచనలో ఉన్నాడు. ఒకవేళ అనివార్య కారణాల వల్ల అవి వర్కవుట్ కాకపోతే ఫ్యూచర్ లో బన్నీ బయటకి తీసే బ్రహ్మాస్త్రం పుష్ప 3. ఇదే తరహాలో డైరెక్టర్ సుకుమార్ కూడా ఇతర ప్రాజెక్ట్‌లు చేయాలనే ఆలోచనలో ఉన్నాడు. అవి ఒకవేల పొరపాటున ఎమన్నా మిస్ ఫైర్ అయితే అప్పుడు సుకుమార్ బయటికి తీసే బ్రహ్మాస్త్రం పుష్ప 3. ఇక శైలేష్ కొలను హిట్ 4 పరిస్థితి కూడా అంతే. హిట్ 3 ఎండింగ్‌లో హిట్ 4కు హింట్ ఇవ్వడం, ఇందులో కార్తి హీరోగా నటిస్తాడని క్లారిటీ ఇవ్వడం తెలిసిందే. ఇది కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతుంది. అయితే ఈ మధ్యలో శైలేష్ కొలను మరేదైనా ప్రాజెక్ట్ చేస్తే అది ఆశించిన స్థాయిలో అంటే సైంధవ్ స్థాయిలో ఆకట్టుకోలేకపోతే అప్పుడు తను తెరపైకి తీసుకొచ్చే బ్రహ్మాస్త్రం హిట్ 4. ఈ క్రేజీ సీక్వెల్స్ తరువాత టాక్ ఆఫ్ ది ఇండియాగా నిలుస్తున్న ప్రాజెక్ట్ కేజీఎఫ్ 3. ప్రస్తుతం యష్ టాక్సిక్, రామాయణ సినిమాలు చేస్తున్నాడు. డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కూడా రెండు ప్రాజెక్ట్‌లతో రాబోతున్నాడు. ఎన్టీఆర్‌తో డ్రాగన్, ప్రభాస్‌తో సలార్ 2.

ఈ ఇద్దరి ప్రాజెక్ట్‌లు అటు ఇటు అయితే యష్, ప్రశాంత్ నీల్‌లకున్న బ్రహ్మాస్త్రం కేజీఎఫ్ 3. ఇలా ప్రతి స్టార్ హీరో, స్టార్ డైరెక్టర్ తమ బ్రహ్మాస్త్రాలని తమ అమ్ముల పొదిలో పెట్టుకుని సమయం వచ్చినప్పుడు వాటిని బయటికి తీయడానికి రెడీగా ఉన్నారు.


## వార్ 2 ముందున్న సవాళ్ళు.. అంత ఈజీ కాదు..



ఇండియన్ యాక్షన్ యూనివర్స్‌లో మరో క్రేజీ ప్రాజెక్ట్ 'వార్ 2'. హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్‌ల కాంబినేషన్‌కు ఇదే తొలి సినిమా కావడం, బాలీవుడ్ టాలీవుడ్ స్టార్ హీరోలు స్క్రీన్ షేర్ చేసుకోవడం వంటి అంశాలు భారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. కానీ రిలీజ్ డేట్ దగ్గర పడుతున్నా ఇప్పటిదాకా ప్రమోషన్లు మొదలవ్వకపోవడంతో ఫ్యాన్స్ లో కొంత అసంతృప్తి అయితే ఉంది. ఇదే విషయమే ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చగా మారింది. హృతిక్ గాయం కారణంగా తీసుకున్న విరామం ఈ సినిమాకు పెద్దగా అడ్డంకిగా మారింది. తారక్, హృతిక్ కాంబినేషన్‌లో చిత్రీకరించాల్సిన పాటలు ఇంకా మిగిలివుండడంతో మొత్తం షూటింగ్ ఇంకా పూర్తవ్వలేదు. టీజర్ అప్డేట్ విషయం పక్కన పెడితే.. అసలు ఫస్ట్ లుక్ పోస్టర్ అయినా వదిలుంటే ఓ లెవెల్ బజ్ వచ్చేది. కానీ డెడ్ లైన్ దగ్గరపడుతున్నా ఈ విషయంలో యష్ రాజ్ ఫిలింస్ అలసత్వం చూపుతోంది. ప్రేక్షకులు, డిస్ట్రిబ్యూటర్లు ఇద్దరూ కలిపి ఎదురు చూస్తున్న సమయంలో ఎలాంటి అప్డేట్ రివీల్ చేయకపోవడం వింతగా మారుతోంది. ఇదిలా ఉండగా, వార్ 2 తెలుగు, తమిళ వర్షన్ హక్కులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. పలు టాప్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు ఇప్పటికే భారీ బిడ్లు వేస్తున్నాయని సమాచారం. అయితే యష్ రాజ్ బేనర్ మాత్రం ఇప్పట్లో డీల్స్ క్లోస్ చేయడం లేదట. సరిగ్గా టీజర్ రిలీజ్ టైమ్ దగ్గరే రెస్పాన్స్ బేస్డ్ వ్యూహంతో ముందుకెళ్లాలని చూస్తున్నారు. ఇది పాజిటివ్ స్ట్రాటజీ అయినప్పటికీ, ప్రస్తుతం పోటీ బాగా పెరిగిపోవడం వల్ల మరింత ఒత్తిడి పడుతోంది. అదే సమయంలో రజనీకాంత్ 'కూలి' పోస్ట్ ప్రొడక్షన్ ఫుల్ స్పీడ్‌లో జరుగుతోంది. షూటింగ్ ఎప్పుడో పూర్తయింది, టీజర్ బ్లాస్ట్ చేసింది. రిలీజ్ డేట్ కన్‌ఫర్మ్ అయింది. ఇది వార్ 2 టీంకు ఎదురులేని మెసేజ్‌లాంటిది. రెడీ కావడంలో కూలి ముందుండటం నిజంగానే ఆందోళనకరం.. వార్ 2 రిలీజ్ డేట్ మాత్రం మార్చే ప్రసక్తే లేదని డిస్ట్రిబ్యూషన్ వర్గాలు చెబుతున్నాయి. జూన్ చివరినుండి ప్రమోషన్ కార్యక్రమాలు స్టార్ట్ చేయాలని యష్ రాజ్ ప్రణాళిక వేసింది. రాజమౌళి తరహాలో దేశం చుట్టే ప్రమోషన్లు జరపాలని చూస్తున్నారు. ప్రత్యేకంగా తారక్‌కు కూడా బ్రేక్ ఇచ్చి ఆ ప్రచారాల్లో భాగం అయ్యేలా ప్లాన్ ఉంది. ఐతే ఓ విషయం క్లియర్.. ఈ సినిమాలో బహుశా ఎలాంటి స్పెషల్ క్యామియోలు ఉండబోవు. మొదటి నుంచే దాగుడుమూతల మధ్య సాగిన ప్రచారానికి ఈ క్లారిటీ కొంతవరకు నిరాశ కలిగించే అంశం కావచ్చు. మొత్తానికి క్రేజ్ ఉన్నా.. కంటెంట్ గురించి క్లారిటీ లేకపోవడం, ప్రమోషన్ ఆలస్యం, బిజినెస్ డీల్స్ మళ్లింపులు అన్నీ కలిపి వార్ 2 యూనిట్‌ను గట్టిగా పరీక్షిస్తున్నాయి. మరి ఈ చాలెంజ్ లను ఎలా ఎదుర్కొంటారో చూడాలి.

## సముద్రం పక్కన హీటెక్కించే గ్లామర్ తో తెలుగమ్మాయి

సినిమాలకంటే కూడా సోషల్ మీడియాలో ఈమధ్య నటీనటులు మంచి గుర్తింపు అందుకుంటున్నారు. కొందరైతే సినిమాల్లోకి రాక ముందే ఫ్యాన్ ఫాలోయింగ్ ను పెంచుకుంటున్నారు. ఇక ఆ రూట్లో గ్లామరస్ బ్యూటీగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు అందుకున్న వారిలో రమ్య పసుపులేటి ఒకరు. తెలుగు సినిమా ఇండస్ట్రీలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా అమ్మడు బాగానే పేరు తెచ్చుకుంది. రమ్య ఇటీవల "మారుతి నగర్ సుబ్రమణ్యం" సినిమాలో నటించింది. కానీ ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేదు. అయినా రమ్యకు అభిమానులు ఎప్పుడూ సపోర్ట్ చేస్తారు. ఆమె నెక్స్ట్ మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న "విశ్వంభర" సినిమాలో చిన్న పాత్రలో కనిపించనుంది. ఈ సినిమా 2025లో విడుదల కానుంది. రమ్య



తన అందం, స్టైల్‌తో అభిమానులను ఎప్పుడూ ఆకర్షిస్తునే ఉంటుంది. ఆమె ఇటీవల థాయ్‌లాండ్‌లోని కో సముయ్ బీచ్‌లో తీసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆమె లుక్ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. రమ్య ఈ ఫోటోల్లో ఎరుపు, తెలుపు చెక్స్ ఉన్న బ్రాలెట్‌లో కనిపిస్తుంది. అలాగే తెల్లని షర్ట్, తెల్లని ప్యాంట్ ధరించింది. ఈ లుక్‌లో ఆమె చాలా గ్లామరస్ గా, అందంగా ఉంది. బీచ్‌లో సూర్యాస్తమయం సమయంలో ఆమె ఫోటోలు మరింత అందంగా ఉన్నాయి. అలాగే తెల్లని పువ్వుతో ఆమె స్మైల్ కూడా ఆకట్టుకునేలా ఉంది. రమ్య ఈ బీచ్ లుక్‌లో అల్ట్రా గ్లామరస్ బ్యూటీ అనిపించుకుంది. ఇక ఆమె స్టైల్, కాన్ఫిడెన్స్ అందరినీ ఆకట్టుకుంటున్నాయి. సముద్రం బ్యాక్ డ్రాప్ లో ఆమె తీసిన మరికొన్ని ఫోటోలు చూస్తే, ఆమె ఎక్కడైనా తన అందంతో ఆకర్షిస్తుందని అర్థమవుతుంది. రమ్య ఈ ఫోటోలతో తన గ్లామర్‌ను మరోసారి చూపించింది. ఆమె అభిమానులు ఈ ఫోటోలను చూసి పాజిటివ్ గా స్పందిస్తున్నారు.

## ఎట్టకేలకు ఫరియా ఫిక్స్ చేసిందా?

జాతి రత్నాలు సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన ఫరియా అబ్దుల్లా ఆ సినిమాతో మంచి హిట్ ను అందుకుంది. ఆ తర్వాత పలు సినిమాల్లో నటించి నటిగా మంచి పేరు తెచ్చుకున్న ఫరియా అబ్దుల్లా ఆఖరిగా మత్తు వదలరా2 లో కనిపించింది. ఆ సినిమా బ్లాక్ బస్టర్ అయినప్పటికీ ఆ తర్వాత ఫరియా నుంచి మరో సినిమా వచ్చింది లేదు. అయితే తాజాగా ఇప్పుడు ఫరియా ఇన్‌స్టాగ్రమ్ లో చేసిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతుంది. ఫరియా ఓ ప్రొడక్షన్ హౌస్ నుంచి వచ్చిన ఓ టీజర్ ను తన ఇన్‌స్టాలో షేర్ చేసింది. ది టైటిల్ ఈజ్ హిజ్ నేమ్, అతని ఆటకు రెడీ గా ఉండు. మ్యాడ్‌నెస్ స్టార్ట్ కానుందంటూ ఆ పోస్టర్ కింద రాసి ఉంది. %వీజీవీ% మోషన్ పిక్చర్స్, బురా, సద్ది క్రియేటివ్ ఆర్ట్స్ బ్యానర్లు ఆ సినిమాను సంయుక్తంగా రూపొందిస్తున్నాయి. అమర్ బురా, జయకాంత్, వేణు సిద్ది ఈ



సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ఫరియా నటిస్తున్నానని డైరెక్ట్ గా చెప్పకపోయినప్పటికీ ఆ టీజర్ ను ఆమె షేర్ చేయడం వెనుక ఉద్దేశం అదే అని ఆమె ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి సంవత్సరం తర్వాత ఫరియా సినిమా ఓకే చేసిందని, ఈ ప్రాజెక్టుతోనే ఫరియా మళ్లీ స్క్రీన్ పైకి రానుందని వారు భావిస్తున్నారు. ఫరియా షేర్ చేసిన ఆ టీజర్ డార్క్ కామెడీ మూవీ అని తెలుస్తోంది. ఫరియా పోస్ట్ ఆమె కంబ్యాక్ ను సూచిస్తే, తెలుగు మూవీ కొత్త పుంతలు తొక్కుతున్న ఈ టైమ్ లో ఆమె కూడా ఒక అధ్యాయంలోకి అడుగుపెట్టినట్టే అవుతుంది. మరి ఈ సినిమా అయినా ఫరియాకు మంచి హిట్ ను అందించి, తనను బిజీ ఆర్టిస్టుగా మారుస్తుందేమో చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536